www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 20-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 323 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 8.57 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆర్ద్ర మ. 12.14 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.1.16-3.00; దుర్ముహూర్తం: రా.1.16-3.00; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.15 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## బుమ్రాకు విశ్రాంతి
# రాహుల్ రీఎంట్రీ !

రాంచీ టెస్ట్ కోసం టీమిండియాలో మార్పులు



రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టుకు భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. టీమిండియా ప్రధాన పేసర్ బుమ్రాకు విశ్రాంతి నిచ్చే చాన్సులుండగా.. తొడ కండర గాయం నుంచి కోలుకొన్న కేఎల్ రాహుల్ పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో తుది జట్టులో చోటు ఖాయంగా కనిపిస్తోంది. రాంచీ టెస్ట్ శుక్రవారం నుంచి జరగనుంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు బ్రేక్ ఇచ్చే అవకాశాలున్నాయని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు.




ఈనేపథ్యంలో బెంగాల్ తరఫున రంజీ ఆడుతున్న పేసర్ ముకేష్ కుమార్ జట్టులోకి పునరాగమనం చేయొచ్చు. రాంచీలోనే టీమిండియా సిరీస్ సొంతం చేసుకొంటే.. ధర్మశాల టెస్ట్‌కు కూడా బుమ్రాకు విశ్రాంతి లభించవచ్చు. రాహుల్ రీఎంట్రీతో రజత్ పటీదార్ బెంచీకే పరిమితమయ్యే అవకాశముంది. రజత్ ఆడిన రెండు టెస్టుల్లోని నాలుగు ఇన్నింగ్స్‌లో కలిపి 46 (32+9+5+0) పరుగులే చేసి విఫలమయ్యాడు.

## విజయంతో ముగించిన జైపూర్

పంచకుల: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10ను జైపూర్ పింక్ పాంథర్స్ విజయంతో ముగించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 45-36తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గి, తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 51-36తో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. ఈ విజయంతో లీగ్ పట్టికలో పుణె 91 పాయింట్లతో ద్వితీయ స్థానానికి చేరుకుంది.

# కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు

**'వారు నేటితరం కుర్రాళ్లు'.. యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, కీపర్ ధ్రువ్ జురెల్‌లనుద్దేశించి కెప్టెన్ రోహిత్ చేసిన వ్యాఖ్యలివి. ఈ మేరకు అతడు ఇన్‌స్టా స్టోరీలో వీరి ఫొటోలు పోస్ట్ చేశాడు. వాస్తవానికి భారత క్రికెట్‌లో ఇప్పుడు యువ ఆటగాళ్ల హవా నడుస్తోంది. అదీ సంప్రదాయక టెస్టు ఫార్మాట్‌లో కావడం మరో విశేషం.**

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)




ఇంగ్లండ్‌తో ముగిసిన మూడో టెస్టులోనే కాదు.. వైజాగ్‌లో జరిగిన రెండో టెస్టులోనూ కుర్రాళ్ల విజృంభణను అంతా గమనించే ఉంటారు. అందుకే భారత టెస్టు క్రికెట్ భవిష్యత్ యువ ఆటగాళ్ల చేతుల్లో పదిలంగా ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అటు కెప్టెన్ రోహిత్ కూడా మూడో టెస్టులో 434 పరుగుల రికార్డు విజయాన్ని యువ ఆటగాళ్ల ఖాతాలోనే వేశాడు. అలాగే ఈ సిరీస్‌లో జట్టు రిజర్వ్ బెంచ్ ఎంత బలంగా ఉందో కూడా ప్రపంచ క్రికెట్‌కు తెలిసివచ్చింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లేకపోయినా ఇబ్బందేమీ లేకుండా ఈ సిరీస్‌లో జట్టు బ్యాటింగ్ ఆర్డర్ కదం తొక్కుతోంది. 22 ఏళ్ల జైస్వాల్ విశ్వరూపాన్ని గమనిస్తున్న క్రికెట్ దిగ్గజాలు వేనోళ్ల పొగుడుతున్నారు. వినోద్ కాంబ్లీ, డాన్ బ్రాడ్‌మన్ తర్వాత రెండు డబుల్ సెంచరీలు బాదేసిన పిన్నవయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఆడింది ఏడు టెస్టులే అయినా అతడి పరిణతి చెందిన బ్యాటింగ్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది వరల్డ్‌గా మారింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో అతనాడిన ఆడిన ఆటకు.. కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించిన తీరుకు అసలు సంబంధమే లేదు. పరిస్థితిని అంచనా వేసుకుంటూ జట్టుకు విలువైన ఇన్నింగ్స్‌ను అందించే ప్రయత్నంలో జైస్వాల్ ఆడిన తీరది. దిగ్గజ పేసర్ అండర్సన్ ఓవర్‌లో వరుసగా మూడు సిక్సర్లతో రాబోయే పరుగుల తుపాన్‌కు హెచ్చరికలు జారీ చేశాడు. సెంచరీ అయ్యాక వెన్నునొప్పితో మైదానం వీడి.. మరుసటి రోజు వచ్చి మరో సెంచరీ బాదిన అతడి నిలకడైన ఆట గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో 12 సిక్సర్లు బాదిన అతడి పవర్ హిట్టింగ్ సైతం ప్రత్యర్థి జట్లను వణికించేదే. అందుకే ఇంగ్లండ్ ఓపెనర్ డకెట్ అతడిని భవిష్యత్ సూపర్‌స్టార్‌గా ప్రకటించేశాడు. అతి పేద కుటుంబం నుంచి వచ్చి నేడు భారత క్రికెట్‌కు ఆశాకిరణంగా చెప్పుకొనే స్థాయికి ఎదిగిన యశస్వీ దేశంలోని ఎందరో వర్థమాన ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తున్నాడు. అంతేకాదు.. 'కష్టపడనిదే ఏదీ దరిచేరదు. నా చిన్నప్పటి ప్రయాణంలో బస్సు రైలు లేదా ఆటో రిక్షాలు అందుకునేందుకు చాలా కష్టాలు పడాల్సివచ్చేది. నేను ఆ స్థాయినుంచి కష్టాలు పడుతూ వచ్చినవాణ్ణి. అందుకే ప్రాక్టీస్ సెషన్‌లోనూ అలాగే ఉంటా. క్రీజులో ఉన్న ప్రతిసారీ వంద శాతం నా శక్తిని వినియోగిస్తా' అని యశస్వీ చెబుతున్నాడు.

మరో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సైతం జట్టులో సుస్థిరంగా ఉండేందుకే వచ్చానని చాటుకున్నాడు. రాజ్‌కోట్ టెస్టులో అతడికి తుది జట్టులో చోటు దక్కగానే క్రికెట్ ప్రేమికులు ఎంతగానో సంతోషించారు. అతడి దేశవాళీ క్రికెట్ ప్రతిభ అలాంటిది మరి. జాతీయ జట్టులో చోటే లక్ష్యంగా 2022 రంజీ సీజన్‌లో 928 పరుగులు బాదాడంటే ఈ యువ ఆటగాడి ఆకలి ఎలా ఉందో తెలుస్తుంది. ఇక ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 45 మ్యాచ్‌ల్లో 14 శతకాలతో 3912 రన్స్ సాధించాడు. రాహుల్ గాయం రూపంలో అతడికి అదృష్టం తలుపు తట్టింది. ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగి రెండు ఇన్నింగ్స్‌లోనూ హాఫ్ సెంచరీలతో తన అరంగేట్రాన్ని ఘనంగా చాటుకున్నాడు. అయితే ఇంగ్లండ్ స్పిన్నర్లు హార్ట్‌లీ, రెహాన్, రూట్‌లను అలవోకగా ఎదుర్కోవడం వెనుక అతడి అలుపెరుగని కష్టం కూడా ఉంది. తండ్రి, కోచ్ నౌషద్ ఖాన్ అతడికి ఆఫ్, లెగ్, లెఫ్టామ్ స్పిన్నర్ల తో రోజుకు 500 బంతులు వేయించి ప్రాక్టీస్ చేయించేవాడు. కరోనా సమయంలోనూ ప్రాక్టీస్ కోసం ముంబై నుంచి వివిధ నగరాలకు 1600 కి.మీలపాటు కారులో ప్రయాణించేవాడట. అలాగే కాన్పూర్ అకాడమీలో స్పిన్నర్ కుల్దీప్ బంతులను అదేపనిగా ఎదుర్కొని రాటుదేలాడు. మ్యాచ్‌లు లేనప్పుడు సర్ఫరాజ్ కోసం నౌషద్ ఇంట్లోనే ఆస్ట్రో టర్ఫ్ వికెట్‌ను ఏర్పాటు చేసి ఆడించేవాడు. ఇంతటి కఠోర సాధన కారణంగానే ఆడుతోంది ఇంగ్లండ్‌లాంటి జట్టుపై అయినా ఈ కుర్రాడు అదురూ బెదురు లేకుండా బ్యాటింగ్ చేశాడు. ఏదిఏమైనా ప్రస్తుత తరుణంలో సీనియర్లను కాదని కొత్త ఆటగాళ్లకే టీమిండియా సెలెక్టర్లు పెద్దపీట వేస్తున్నారు కాబట్టి.. యంగ్ గన్స్ కూడా తమ ప్రతిభ నిరూపించుకుంటే వారి స్థానాలకు ఢోకా లేనట్టే.

## రైల్వేస్ నయా చరిత్ర

రంజీలో రికార్డు ఛేదన
త్రిపురపై ఘన విజయం

న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీ చరిత్రలో రైల్వేస్ జట్టు సరికొత్త రికార్డు సృష్టించింది. త్రిపురతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఈ జట్టు 378 పరుగుల ఛేదనను విజయవంతంగా అధిగమించింది. 90 ఏళ్ల రంజీ ట్రోఫీలో ఇప్పటిదాకా ఏ జట్టూ ఇంత భారీ స్కోరును ఛేదించలేకపోయింది. నాలుగేళ్ల క్రితం సౌరాష్ట్ర జట్టు ఉత్తరప్రదేశ్‌పై 372 పరుగులను ఛేదించడమే ఇప్పటిదాకా రికార్డు. అయితే ఈ ఛేదనలో రైల్వేస్ 31 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినా.. ఓపెనర్ ప్రథమ్ సింగ్ (169), మహ్మద్ సైఫ్ (106) జోడీ ఐదో వికెట్‌కు 175 పరుగులు జోడించడంతో గట్టెక్కింది. దీంతో 378/5 స్కోరు సాధించిన రైల్వేస్ ఐదు వికెట్లతో అద్భుత విజయాన్నందుకుంది. త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 149, రెండో ఇన్నింగ్స్‌లో 333 పరుగులు చేయగా.. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 105 పరుగులు సాధించింది.

## సిరీస్ శ్రీలంకదే..

అఫ్ఘాన్ మరో పరాజయం




దంబుల్లా: అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే శ్రీలంక చేజిక్కించుకుంది. సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 72 పరుగులతో నెగ్గింది. తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 187/6 స్కోరు చేసింది. సమరవిక్రమ (51), ఏంజెలో మాథ్యూస్ (42 నాటౌట్) రాణించారు. ఛేదనలో 17 ఓవర్లలో అఫ్ఘానిస్థాన్ 115 పరుగులకే కుప్పకూలింది. ఏంజెలోతోపాటు నలుగురు బౌలర్లు తలా రెండేసి వికెట్లు తీశారు.

**స్టేడియం వద్ద ఉద్రిక్తత..:** సోమవారం నాటి ఈ రెండో మ్యాచ్ టిక్కెట్లకోసం అభిమానులు స్టేడియానికి భారీగా తరలొచ్చారు. గేట్లను బద్దలుగొట్టి టిక్కెట్ కౌంటర్ల వద్దకు పరుగులు తీయడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

## అబ్బో..ఇక్కడ మహిళలకు కష్టమే !



న్యూఢిల్లీ: భారత్‌లో పనిచేయడం ఎంతో కష్టమని మహిళల హాకీ జట్టు కోచ్ షాప్‌మన్ వ్యాఖ్యానించింది. భారత జట్టుకు తొలి మహిళా కోచ్‌గా గత రెండున్నరేళ్ల తన పదవీ కాలంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని వాపోయింది. 'నేను ఎంతో ఒంటరిగా ఫీలవుతున్నా' అని వెల్లడించింది. హాకీ ఇండియా తనకు గౌరవం ఇవ్వలేదని విమర్శించింది. బీజింగ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన నెదర్లాండ్స్ జట్టులో ఆమె సభ్యురాలు. 'మహిళలను గౌరవించే దేశం నుంచి నేను వచ్చా. కానీ అదే గౌరవాన్ని నేను ఇక్కడ పొందలేకపోతున్నా. పురుషుల, మహిళల కోచ్‌లు, పురుషుల, మహిళల జట్ల మధ్య హాకీ ఇండియా పక్షపాతాన్ని చూపుతోంది' అని 46 ఏళ్ల షాప్‌మన్ చెప్పింది.

## విజయం దిశగా హైదరాబాద్

● 5 వికెట్లతో చెలరేగిన తనయ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ ప్లేట్ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు హైదరాబాద్ జట్టు మరో 127 పరుగుల దూరంలో నిలిచింది. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఫైనల్‌కు మూడోరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మేఘాలయను తనయ్ త్యాగరాజన్ ఆటాడుకున్నాడు. వరుసగా రెండో ఇన్నింగ్స్‌లోనూ తనయ్ ఐదు (5/86) వికెట్లు తీశాడు. తనయ్‌తో పాటు రోహిత్ 2, తిలక్, రిషభ్, కార్తికేయ తలో వికెట్ పడగొట్టడంతో రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ 243 పరుగులకు ఆలౌటైంది. 197 రన్స్ టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ ఆటచివరికి ఒక వికెట్ నష్టానికి 71 పరుగులు చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 304కు, హైదరాబాద్ 350కి ఆలౌటయ్యాయి.



మలేసియాలో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టు సభ్యురాలు పుల్లెల గాయత్రి గోపీచంద్‌ను హైదరాబాద్‌లో సోమవారం అభినందిస్తున్న తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్

## ఉజ్బెకిస్థాన్‌పై అమ్మాయిల గెలుపు

● పురుషులకు మరో ఓటమి
● వరల్డ్ టీటీ చాంపియన్‌షిప్స్

బుసాన్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళల జట్టు గెలుపు జోరును కొనసాగిస్తోంది. గ్రూప్-1లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0తో ఉజ్బెకిస్థాన్‌ను చిత్తు చేసింది. అర్చన 11-7, 11-3, 11-6తో రిమ్మా గుఫ్రనోవాపై, మనికా బాత్రా 11-7, 11-4, 11-1తో మర్కబో మగ్దియేవాపై, దివ్య చిటాలే 11-6, 10-12, 11-4, 11-6తో రోజ్‌లినా కద్యయేవాపై గెలిచారు. బలహీన ప్రత్యర్థి కావడంతో ఆకుల శ్రీజ, అయిహిక ముఖర్జీలకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతినిచ్చారు. చైనా చేతిలో ఓడినా.. హంగేరిపై గెలిచిన అమ్మాయిలు గ్రూప్‌లో రెండో స్థానంలో ఉన్నారు. మంగళవారం ఆఖరి మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ తలపడనుంది. మరోవైపు పురుషుల జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. గ్రూప్-3 మ్యాచ్‌లో భారత్ 0-3తో కొరియా చేతిలో చిత్తయింది. హర్మీత్ దేశాయ్ 4-11, 10-12, 8-11తో జాంగ్ ఉజిన్ చేతిలో సాథియాన్ 5-11, 7-11, 7-11తో లిమ్ జంగూన్ చేతిలో, శరత్ కమల్ 9-11, 11-8, 6-11, 5-11తో లీ సంగ్ సు చేతిలో పరాజయం పాలయ్యారు.

## ప్రైమ్ వాలీబాల్‌లో హైదరాబాద్ బోణీ

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు బోణీ కొట్టింది. సోమవారం ఆడిన తమ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ 3-2తో ముంబై మెటియర్స్‌పై నెగ్గింది. తొలి రెండు సెట్లలో హైదరాబాద్ 7-15, 12-15 స్కోరుతో ఓడింది. ఆ తర్వాత పుంజుకుని 15-10, 15-11, 20-18 స్కోరుతో వరుసగా మూడు సెట్లలో నెగ్గి, మ్యాచ్‌లో విజయం సాధించింది.

# ప్రపంచ టాప్-100 లగ్జరీ బ్రాండ్లలో మలబార్ గోల్డ్

- టైటాన్, మరో 4 దేశీ బ్రాండ్లకూ స్థానం
- జాబితా విడుదల చేసిన డెలాయిట్

ముంబై: ప్రపంచంలోని టాప్-100 లగ్జరీ బ్రాండ్ల జాబితాలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, టైటాన్ సహా మరో నాలుగు భారత కంపెనీలకు చోటు దక్కింది. అంతర్జాతీయ సంస్థ డెలాయిట్ విడుదల చేసిన ఈ జాబితాలో మలబార్ గోల్డ్‌కు 19వ స్థానం లభించింది. దేశీ బ్రాండ్లలో దీనిదే అగ్రస్థానం. టాటా గ్రూప్‌నకు చెందిన ఫ్యాషన్ ఉత్పత్తుల తయారీ సంస్థ టైటాన్ 24వ స్థానంలో నిలిచింది. ఆభరణాల విక్రయ కంపెనీలైన కల్యాణ్ జువెలర్స్, జోయ్ అలుక్కాస్ వరుసగా 46,47 స్థానాలను దక్కించుకున్నాయి. సెన్‌కో గోల్డ్ అండ్ డైమండ్స్‌కు 78, తంగమాయిల్ జువెలరీకి 98వ స్థానం లభించింది. కాగా, ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ లగ్జరీ ఉత్పత్తుల బ్రాండ్ ఎల్‌వీఎంహెచ్ ఈ జాబితాలో తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది. పీవీహెచ్ కార్ప్ రెండు, రిచ్‌మాంట్ వరుసగా 2,3 స్థానాల్లో ఉన్నాయి.

MALABAR GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE

మరిన్ని విషయాలు..

- కోజికోడ్‌కు చెందిన మలబార్ గోల్డ్‌కు ఈ జాబితాలో చోటు దక్కడం ఇదే తొలిసారి. గత ఏడాది (2023)కి గాను కంపెనీ ఆదాయం 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.33,200 కోట్లు)గా నమోదైంది. కాగా, టైటాన్ టర్నోవర్ 367 కోట్ల డాలర్లు (రూ.30,461 కోట్లు)గా ఉంది.
- భారత్‌లో లగ్జరీ బ్రాండ్లు పెరుగుతుండటం దేశీయంగా విలాస ఉత్పత్తుల మార్కెట్ గతిని నొక్కి చెబుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి జోరు కొనసాగుతున్న నేపథ్యంలో వినియోగదారుల ప్రాధాన్యాలు కూడా పెరుగుతుండటంతో లగ్జరీ మార్కెట్ కూడా గణనీయ వృద్ధి సాధించనుందని రిపోర్టు పేర్కొంది. దీంతో మున్ముందు మరిన్ని భారత బ్రాండ్లు ఈ జాబితాలో చోటు దక్కించుకునే అవకాశం ఉంది.
- గత ఏడాది టాప్-100 లగ్జరీ బ్రాండ్ల టర్నోవర్ వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం పెరిగి 34,700 కోట్ల డాలర్ల (రూ.28,80,100 కోట్లు)కు చేరుకుంది. అందులో ప్రపంచ నం.1 లగ్జరీ బ్రాండ్ ఎల్‌వీఎంహెచ్ వాటానే 31 శాతంగా ఉంది. టాప్-10 బ్రాండ్ల టర్నోవర్ వాటా 63 శాతం. ఈ బ్రాండ్ల విక్రయాలు గత ఏడాదిలో 23 శాతం వృద్ధి చెందాయి. అంతేకాదు, టాప్-100 బ్రాండ్ల నికర లాభంలో 76.4 శాతం వాటా ఈ పది కంపెనీలదే.

# బిజినెస్

## స్పైస్‌జెట్ చీఫ్‌కు 'సుప్రీం' చీవాట్లు

న్యూఢిల్లీ: స్పైస్‌జెట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. స్విట్జర్లాండ్‌కు చెందిన క్రెడిట్ సూయిస్‌కు నెలనెలా చెల్లించాల్సిన బకాయిలను సక్రమంగా చెల్లించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'గో ఫస్ట్ ఎయిర్‌లైన్‌ను కొనేందుకు మీ వద్ద డబ్బులు ఉంటాయి గానీ, క్రెడిట్ సూయిస్ బకాయిలు చెల్లించేందుకు మాత్రం డబ్బులు లేవా?' అని సూటిగా ప్రశ్నించింది. కుయుక్తులు పక్కన పెట్టి వచ్చే నెల 15 కల్లా క్రెడిట్ సూయిస్‌కు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసుపై మార్చి 22న జరిగే తదుపరి విచారణకు అజయ్ సింగ్ స్వయంగా హాజరు కావాలని కూడా ఆదేశించింది.

## పన్ను చెల్లింపుదారులకు ఊరట

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ), వెల్త్ ట్యాక్స్, గిఫ్ట్ ట్యాక్స్ చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుభవార్త చెప్పింది. 2015-16 అసెస్‌మెంట్ ఇయర్ వరకు వీరికి జారీ చేసిన రూ.లక్ష లోపు పన్ను చెల్లింపు డిమాండ్ నోటీసులను వెనక్కి తీసుకుంటున్నట్టు తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో చేసిన ప్రకటన మేరకు సీబీడీటీ ఈ నిర్ణయం తీసుకుంది.

## టాటా గ్రూప్ మార్కెట్ విలువ..
# పాకిస్థాన్ జీడీపీ కంటే ఎక్కువ

రూ.30 లక్షల కోట్లు దాటిన టాటా కంపెనీల మార్కెట్ క్యాప్




న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 36,500 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.30.3 లక్షల కోట్లు) చేరుకుంది. ఇది మన పొరుగు దేశమైన పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం కంటే అధికం. గత ఏడాది నాటికి పాకిస్థాన్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 34,100 కోట్ల డాలర్ల స్థాయిలో ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ అంచనా. కాగా, టాటా గ్రూప్‌లో అత్యంత విలువైన, దేశీయ లిస్టెడ్ కంపెనీల్లో రెండో అత్యంత విలువైన కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ క్యాప్ రూ.15 లక్షల కోట్లు దాటింది. టాటా గ్రూప్ మొత్తం మార్కెట్ విలువలో 50 శాతం వాటా ఈ కంపెనీదే. అంటే, పాకిస్థాన్ ఎకానమీ సైజులో సగం. గడిచిన ఏడాది కాలంలో టీసీఎస్‌తో పాటు టాటా మోటార్స్, ట్రెంట్, టాటా పవర్, టైటాన్, టీఆర్ఎఫ్ షేర్లు భారీగా పుంజుకోవడం గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయి.

### మన టాప్-10 కంపెనీల విలువ 6 పొరుగు దేశాల జీడీపీ కంటే అధికం

గత వారం చివరి నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ సహా దేశంలోని అత్యంత విలువైన 10 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 1.1 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.89.98 లక్షల కోట్లు) చేరుకుంది. దక్షిణాసియాలోని 6 పొరుగు దేశాల (పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవులు) మొత్తం జీడీపీ కంపెనీ అధికమిది. 'వరల్డ్ ఎకనామిక్ రిపోర్టు 2023'లో ఐఎంఎఫ్ పేర్కొన్న అంచనాల ప్రకారం.. ఈ ఆరు దేశాల మొత్తం జీడీపీ విలువ 91,200 కోట్ల డాలర్లు. కాగా, దేశంలో అత్యంత విలువైన కంపెనీ ఆర్ఐఎల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 23,800 కోట్ల డాలర్ల స్థాయికి ఎగబాకింది. ఇది శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవుల మొత్తం జీడీపీ కంటే అధికం.

## పెద్దల కోసం పన్ను సంస్కరణలు

పొదుపు, గృహ పథకాలు తప్పనిసరి: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: పెరుగుతున్న వృద్ధుల జనాభా అవసరాల కోసం పన్నుల సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వాన్ని నీతి ఆయోగ్ కోరింది. ఇందుకు వారి కోసం ప్రత్యేక పొదుపు, గృహ పథకాలు తీసుకురావాలని ఒక నివేదికలో సూచించింది. ప్రస్తుతం దేశ జనాభాలో 10 శాతంగా ఉన్న వృద్ధుల జనాభా, 2050 నాటికి 19.5 శాతానికి పెరగబోతున్న విషయాన్ని నీతి ఆయోగ్ గుర్తు చేసింది. దేశంలో కొద్ది మంది వృద్ధులకు మాత్రమే ఆర్థిక భద్రత ఉన్న విషయాన్నీ గుర్తు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీ రేట్ల మార్పు ప్రభావం వారిపై పెద్దగా పడకుండా ఉండేలా సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ పథకాన్ని తీర్చిదిద్దాలని కోరింది.

**రివర్స్ మార్టగేజ్‌ను సంస్కరించాలి:** సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన రివర్స్ మార్టగేజ్ పథకాన్ని మరింత సంస్కరించాని నీతి ఆయోగ్ కోరింది. అలాగే సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ఉపయోగించే ఉత్పత్తులపైనా జీఎస్‌టీతో సహా ఇతరు పన్ను రాయితీలు ఇవ్వాలని సూచించింది. కంపెనీలు సామాజిక బాధ్యత కింద ఖర్చు చేసే సీఎస్ఆర్ నిధుల్లో కొంత భాగం సీనియర్ సిటిజన్ల సంరక్షణకు వినియోగించేందుకు అనుమతించాలని సూచించింది.

### చందా కొచ్చర్ అరెస్టు అక్రమం: బాంబే హైకోర్టు

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌కు పెద్ద ఊరట లభించింది. తగినన్ని సాక్ష్యాలు లేకుండా సీబీఐ వీరిద్దరిని అరెస్టు చేయడాన్ని బాంబే హైకోర్టు తప్పుపట్టింది. ఇది అధికార దుర్వినియోగం తప్ప, మరొకటి కాదని ఆక్షేపించింది. కేసు విచారణలో కొచ్చర్‌లు మౌనంగా ఉండడం, సహాయ నిరాకరణ ఎంతమాత్రం కాదని స్పష్టం చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణాల కేసులో 2019లో కేసు నమోదు చేసి, ప్రశ్నించేందుకు తమ ముందు హాజరు కావాలని సీబీఐ 2022లో సమన్లు జారీ చేయడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. దీంతో ఈ కేసులో కొచ్చర్ దంపతులకు రెగ్యులర్ బెయిల్ లభించినట్టయింది.

## మన స్టాక్ మార్కెట్ పరుగుకు ఢోకా లేదు..

వచ్చే పాతికేళ్లలో 50 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్

అందరి ఆమోదంతోనే ట్రేడింగ్ సమయం పెంపు.. ● ఎన్ఎస్ఈ ఎండీ ఆశిష్ చౌహాన్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లకు ఢోకా లేదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ అన్నారు. ఇప్పటికే జీడీపీని మించిపోయిన మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో పాతికేళ్లలో (2047 నాటికి) మరింతగా పెరగనుందన్నారు. అప్పటికి దేశ జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లు ఉంటే.. మార్కెట్ క్యాప్ 50 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందన్నారు. ప్రస్తుత డాలర్-రూపాయి మారకం రేటు ప్రకారం ఇది రూ.4,150 లక్షల కోట్లకు సమానం. ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్ క్యాప్ 4.5 లక్షల కోట్ల డాలర్ల నుంచి 4.6 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.373.5 లక్షల కోట్ల నుంచి రూ.381.8 లక్షల కోట్లు) మాత్రమే.

**టెక్నాలజీనే ఊతం :** వచ్చే పాతికేళ్లలో దేశీయ టెక్నాలజీ కంపెనీలు పెద్ద ఎత్తున సంపదను సృష్టించబోతున్నట్టు చౌహాన్ తెలిపారు. మన దేశం ఇప్పటికే అనేక టెక్నాలజీలకు ప్రపంచంలో ప్రధాన కేంద్రంగా మారుతోందన్నారు. గత పదేళ్లలో టెక్నాలజీ దాదాపు అన్ని దైనందిక కార్యకలాపాల్లో భాగమైపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రోజుకి 6.15 గంటలు మాత్రమే ఉన్న ట్రేడింగ్ సమయాన్ని పెంచే విషయంపైనా చౌహాన్ మాట్లాడారు. బ్రోకర్లతో సహా అందరూ ఇందుకు అంగీకరించాల్సి ఉందన్నారు. కొన్ని దేశాల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఇప్పటికే 24 గంటలు ట్రేడింగ్‌ను అనుమతిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు

## జీవితకాల గరిష్ఠానికి నిఫ్టీ

ముంబై: కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్లో జోరు కొనసాగుతోంది. వరుసగా ఐదో రోజు కూడా లాభాల బాటలో మార్కెట్ సూచీలు పయనించాయి. దీంతో సోమవారం నిఫ్టీ కొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిలు నమోదు చేయగా ఇన్వెస్టర్ల సంపద కూడా కొత్త రికార్డును నమోదు చేసింది. సెన్సెక్స్ 281.52 పాయింట్ల లాభంతో 72,708.16 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. నిఫ్టీ 81.55 పాయింట్ల లాభంతో 22,122.25 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 22,186.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఈ రెండూ కొత్త రికార్డు స్థాయిలే. నిఫ్టీలోని 50 షేర్లలో 27 లాభాలతో ముగిశాయి.

**కొత్త శిఖరాలకు సంపద:** మార్కెట్లో కొనుగోళ్ల జోరు కొనసాగుతున్న నేపథ్యంలో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ సోమవారం రూ.2,19,581.56 కోట్లు పెరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపద కొత్త రికార్డు రూ.391.69 లక్షల కోట్లకు దూసుకుపోయింది.

## 22న జీపీటీ హెల్త్‌కేర్ ఇష్యూ

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్వహణ సంస్థ జీపీటీ హెల్త్‌కేర్ ఇష్యూ గురువారం (తేదీ 22) ప్రారంభమై వచ్చే సోమవారం (తేదీ 26) ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.177-186గా కంపెనీ ప్రకటించింది. ఈ ఐపీఓ కనిష్ఠ ధరలో రూ.501.67 కోట్లు, గరిష్ఠ ధరలో రూ.525.14 కోట్లు సమీకరించగలుగుతుంది. ఇష్యూలో భాగంగా 2.6 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్ విధానంలో విడుదల చేస్తారు. రూ.40 కోట్ల విలువ గల తాజా షేర్లు మార్కెట్లో విక్రయానికి పెడతారు.

- టోలిన్స్ టైర్స్ కంపెనీ రూ.230 కోట్ల విలువ గల పబ్లిక్ ఇష్యూ జారీకి అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక పత్రాలు సమర్పించింది.


## లిక్విడేషన్‌కు గీతాంజలి జెమ్స్

ముంబై: పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ లిక్విడేషన్ (ఆస్తుల విక్రయం)కు జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సోమవారం ఆదేశించింది. కంపెనీ లిక్విడేటర్‌గా 'శాంతను టీ రే'ను నియమించింది. దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా గీతాంజలి జెమ్స్ పునరుద్ధరణ అవకాశాలు పూర్తిగా సన్నగిల్లడంతో కంపెనీ దివాలా పరిష్కార నిపుణుడు విజయ్ కుమార్ గార్గ్ లిక్విడేషన్‌కు అనుమతించాలని ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు సమర్పించారు. కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ పూర్తికి గడువు 2019 ఏప్రిల్‌లోనే ముగియడంతో పాటు సంస్థపై కొనసాగుతున్న ఈడీ, సీబీఐ దర్యాప్తులు, పలు ఆస్తులు ఈ దర్యాప్తు ఏజెన్సీల జప్తులో ఉన్న నేపథ్యంలో ట్రైబ్యునల్ లిక్విడేషన్‌కు ఆదేశించింది.

గీతాంజలి జెమ్స్ పలు బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలకు రూ.12,558 కోట్లకు బకాయిపడింది. దివాలా పరిష్కార చర్యల ద్వారా ఏదైనా కంపెనీ వ్యాపార పునరుద్ధణ సాధ్యం కాని పక్షంలో దాని ఆస్తుల విక్రయం ద్వారా రుణదాతల బకాయిలను పరిష్కరించే ప్రక్రియనే లిక్విడేషన్ అంటారు.

### కర్ణాటకలో టాటాల రూ.2,300 కోట్ల పెట్టుబడి

బెంగళూరు: కర్ణాటకలో చేపట్టనున్న పలు కొత్త ప్రాజెక్టుల్లో టాటాల సారథ్యంలోని ఎయిరిండియా, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) రూ.2,300 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టులు 1,650 మందికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తాయి. ఈ మేరకు ఉభయ సంస్థలు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మధ్యశ్రేణి పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ సమక్షంలో ఎంఓయూలపై సంతకాలు చేశాయి.




| బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో) | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 62,670 ▲ | 57,450 ▲ | 77,500 ▼ |
| ముంబై | 62,017 ▲ | 56,808 ▲ | 71,210 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 19వ తేదీ | | విజయవాడ | 542 |
| హైదరాబాద్ | 554 | విశాఖపట్నం | 555 |
| 20వ తేదీ | | వరంగల్ | 556 |
| చిత్తూరు | 603 | | |
| గోదావరి | 542 | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 135 | గోదావరి | 139 |
| వరంగల్ | 135 | విజయవాడ | 139 |
| కరీంనగర్ | 135 | గుంటూరు | 139 |
| మహబూబ్‌నగర్ | 135 | ఒంగోలు | 139 |
| కర్నూలు | 135 | చిత్తూరు | 135 |
| విశాఖపట్నం | 124 | | |

www.andhrajyothy.com


వరంగల్

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 20-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 323 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## రిటర్నింగ్ అధికారిని ప్రాసిక్యూట్ చేయాల్సిందే!



- చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- రిటర్నింగ్ అధికారి అనిల్‌ను ప్రశ్నించిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్
- 8 బ్యాలెట్ పత్రాలపై 'ఎక్స్' గుర్తు వేసినట్టు అంగీకరించిన ఆర్వో
- బ్యాలెట్ పత్రాలు, వీడియో రికార్డింగ్‌ను సమర్పించాలన్న ధర్మాసనం
- కౌన్సిలర్లను కొనేస్తుండడంపై అత్యున్నత న్యాయస్థానం ఆందోళన
- మేయర్ సోంకర్ రాజీనామా.. బీజేపీలోకి ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు

10



మూసీ ప్రక్షాళనపై ఉన్నతాధికారులకు సూచనలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

## మూసీ ప్రక్షాళనకు సిద్ధమవండి

- తొలుత నదిని శుభ్రం చేయించండి
- మూసీలోకి నీటిని తెచ్చే మార్గాలపై ప్రణాళికలివ్వండి
- జంట జలాశయాల నీటిని మూసీకి మళ్లించండి: సీఎం
- ఇక ప్రతివారం మూసీ ప్రగతిపై సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): "మూసీలోకి నీటిని తీసుకొచ్చే మార్గాలెన్ని ఉన్నాయి? నీటి నిల్వకు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? మూసీ ఫ్లడ్ లెవల్ ఎంతుంది? వరద ప్రభావిత ప్రాంతాలెన్ని?" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పురపాలక శాఖ అధికారులపై ప్రశ్నలు సంధించారు. సోమవారం ఆయన నానక్‌రామ్‌గూడలోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో మూసీ నది ప్రక్షాళనపై సమీక్షించారు. గత నెలలో దావోస్ పర్యటన తర్వాత.. ఆయన లండన్‌లోని థేమ్స్ నదిని పరిశీలించిన విషయం తెలిసిందే..! అప్పట్లోనే థేమ్స్ తరహాలో మూసీని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అప్పట్లోనే దీనిపై సమీక్ష జరపగా.. తాజాగా పర్యాటకులను ఆకర్షించేలా మూసీని తీర్చిదిద్దాలని పేర్కొంటూ అధికారులకు

మిగతా 11వ పేజీలో...

### ఢిల్లీలో నేడు కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ?

### 'సీఎంఆర్‌ఎఫ్'లో 150 కోట్ల స్కామ్!

- బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేల పాత్ర
- సీఎంవోకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన రేవంత్‌రెడ్డి

11

### కిశోర్.. కబ్జాలను ఉపేక్షించొద్దు

- ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్లను స్వాధీనం చేసుకోండి
- మునిసిపల్ కార్యదర్శికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- సమీక్షలో తొలి అంశంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

# గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్

**జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. గత ఏడాది ప్రకటన రద్దు**

- సుప్రీంకోర్టులో నడుస్తున్న కేసు ఉపసంహరణ.. 563 పోస్టులు.. వయోపరిమితి రెండేళ్లు పెంపు
- 23 నుంచి మార్చి 14 వరకు దరఖాస్తులు.. గతంలో పరీక్ష రాసిన వారూ అప్లై చేసుకోవాలి
- వారికి దరఖాస్తు ఫీజు మినహాయింపు.. మే/జూన్‌లో ప్రిలిమ్స్, సెప్టెంబరు/అక్టోబరులో మెయిన్స్




హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి సర్కారు కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. గత నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో నడుస్తున్న కేసును ఉపసంహరించుకోవడానికి అత్యున్నత న్యాయస్థానం సోమవారం అనుమతి ఇచ్చింది. దీంతో పాత నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఆ వెంటనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసింది. గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి గత నోటిఫికేషన్‌లో 503 పోస్టుల భర్తీకి ప్రకటన ఇవ్వగా.. ఇప్పుడు మరో 60 పోస్టులను పెంచి.. మొత్తం 563 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో 18 విభాగాలకు చెందిన కొలువులు ఉన్నాయి. అన్ని పోస్టులకు సంబంధించి సర్కారు రెండేళ్ల వయోపరిమితిని పెంచింది. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. గత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే వారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు రూ.200 చెల్లించాలి. అభ్యర్థులు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 14న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకునేందుకు సమయం ఇచ్చారు. మార్చి 23 నుంచి 27 మధ్య దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నారు. ఈ ఏడాది మే లేదా జూన్‌లో ప్రిలిమినరీ పరీక్ష.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మెయిన్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. పరీక్షల తేదీలను తర్వాత ప్రకటించనున్నారు. ప్రిలిమినరీ పరీక్షను

మిగతా 12వ పేజీలో...

### మెగా డీఎస్సీతో పాటే టెట్ నోటిఫికేషన్

వచ్చే వారం ప్రకటన విడుదలయ్యే అవకాశం

12



## డబ్బుల్లేవ్!

- పథకాల అమలుకు నిధుల కటకట
- ఆచితూచి వ్యయం చేస్తున్న రేవంత్ సర్కారు
- రైతుబంధు, ఫ్రీ బస్సు పథకాలకే నిధులు
- మిగతా పథకాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు
- త్వరలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాల ప్రారంభం
- ఈ రెండింటికే నెలకు రూ.500 కోట్లు అవసరం
- నిధుల సర్దుబాటుపై సర్కారు ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి రాష్ట్ర సర్కారు నిధుల కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఖజానాలో నిధుల కటకట తీవ్ర స్థాయిలో ఉంది. పథకాలకు నిధులను విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న ఖర్చులకు నిధులను విడుదల చేయాలన్నా.. ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. అత్యంత అవసరమైతే తప్ప.. నిధులను విడుదల చేయడం లేదు. రైతుబంధు, మహాలక్ష్మి(ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం) పథకాలకు మాత్రమే నిధులను విడుదల చేస్తోంది. మూలధన(కేపిటల్) వ్యయానికి కూడా పెద్దగా నిధులివ్వడం లేదు. నిజానికి రెండు నెలల క్రితం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. నెలవారీ రాబడుల సొమ్మును నిర్దేశిత వ్యయాలకు మాత్రమే సరిపెట్టే పరిస్థితి ఉండేది. ఖజానాలో మిగిలే సొమ్ము పెద్దగా ఉండేది కాదు. దాంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక అంశాలపై

మిగతా 12వ పేజీలో...




## 6,000 కోట్లతో సోలార్ ప్యానెళ్ల పరిశ్రమ

- 'రెన్యూసిస్ ఇండియా' భారీ పెట్టుబడి
- రాష్ట్ర సర్కార్‌తో అవగాహన ఒప్పందం
- వచ్చే ఐదేళ్లలో 11వేల మందికి ఉపాధి

హైదరాబాద్, మహేశ్వరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్తు పరికరాల తయారీ రంగంలో రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూసిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిద్ధమైంది. 6వేల కోట్ల రూపాయలతో సోలార్ ఫొటోవోల్టాయిక్(పీవీ) మాడ్యూల్, పీవీ సెల్స్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. దీంతో వచ్చే

మిగతా 11వ పేజీలో...

### త్వరలో ఢిల్లీకి కేసీఆర్?

పలువురు జాతీయ నేతలను కలిసే చాన్స్!

11

### గొర్రెల పంపిణీ అక్రమాలపై చర్యలేవి?

- తొలివిడతలోనే భారీగా అవకతవకలు
- అప్పట్లోనే 40 మంది అధికారులపై కేసులు
- ఆ తర్వాత ఉపసంహరణ
- అక్రమాలపై 'కాగ్' నివేదిక ఆధారంగా సర్కారు వైఖరి ఏంటన్న దానిపై ఉత్కంఠ

### జవహర్ నగర్‌లో బీఆర్‌ఎస్ మేయర్ ఔట్

- మేయర్ సహా అంతా బీఆర్‌ఎస్ వారే
- అయినా నెగ్గిన అవిశ్వాసం
- బల నిరూపణలో చెయ్యెత్తిన 20 మంది కార్పొరేటర్లు
- కాంగ్రెస్‌కు జైకొడతారా!? బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతారా..?

11

## ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

**గిరిజన సంక్షేమ శాఖ అధికారుల చేతివాటం**

- ఎంఎస్‌ఎంఈ స్కీమ్‌లో 40 కోట్లకు పైగా సొమ్ము పక్కదారి
- 2020-22లో ఈ స్కీమ్ కింద రాష్ట్రంలోని 3 ఐటీడీఏల పరిధిలో రూ.130 కోట్ల మంజూరు.. 62 కోట్లు విడుదల
- 60% సబ్సిడీతో యూనిట్‌కు 40 లక్షల దాకా మంజూరు
- లబ్ధిదారులు తమ వాటాగా జమచేయాల్సింది 10 శాతం
- మిగతా 30శాతం బ్యాంకు నుంచి రుణం మంజూరు
- లోన్‌తో సంబంధం లేకుండా యూనిట్లకు నేరుగా సబ్సిడీ
- నిధులను దారి మళ్లించిన ఐటీడీఏ అధికారులు!
- పాత సామగ్రి తీసుకొచ్చి.. ఫొటోలకు పోజులిచ్చి బిల్లుల డ్రా
- చక్రం తిప్పిన గిరిజన సంక్షేమశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి
- గత ప్రభుత్వంలోని ఓ మంత్రి సమీప బంధువుకూ పాత్ర



(వరంగల్-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ట్రైకార్ నిధులు పక్కదారి పడుతున్నాయి. గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంఎస్‌ఎంఈ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ నిధులు దారిమళ్లుతున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకుగాను జాయింట్ లయబిలిటీ గ్రూపులకు (జేఎల్‌జీ), వ్యక్తులకు 60 శాతం సబ్సిడీతో రూ.40 లక్షల దాకా ప్రభుత్వం అందించే ఈ రుణాలపై అధికారులు, దళారుల కన్ను పడింది. ఫలితం.. 2020-2022 నడుమ తెలంగాణలోని మూడు ఐటీడీఏల పరిధిలో ఈ పథకం కింద

మిగతా 5వ పేజీలో...

## బీఆర్‌ఎస్ దగ్గర ఏముంది?

- వాళ్లతో పొత్తా?.. ఆ ప్రచారం మూర్ఖుల పనే
- అసలు తెలంగాణకు బీఆర్‌ఎస్ అవసరమా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- నేటి నుంచి బీజేపీ విజయ సంకల్ప యాత్ర
- భాగ్యలక్ష్మి ఆలయం వద్ద వాహనాలకు పూజ



యాత్ర వాహనాలకు పూజలు చేస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌తో బీజేపీ పొత్తు ఉంటుందని ప్రచారం చేసేవాళ్లు మూర్ఖులేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. మూర్ఖులు, దుర్మార్గులు చేసే ప్రచారాన్ని ఖాతరు చేయబోమన్నారు. మెడపై తలకాయ ఉన్నవారెవరూ ఇలాంటి ప్రచారం చేయరని ఆగ్రహం వ్యక్తం చేశారు. "బీఆర్‌ఎస్ మునిగిపోయే నావ. అలాంటి నావకు సహకరించే ప్రసక్తే లేదు. మాకు ఒక్క ఎమ్మెల్యే సీటు వచ్చినప్పుడే బీఆర్‌ఎస్‌తో కలవలేదు. ఇప్పుడెందుకు కలుస్తాం? కలవడానికి బీఆర్‌ఎస్ దగ్గర ఏముంది? తెలంగాణకు ఆ పార్టీ అవసరం ఉందా?" అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇదే తరహా ప్రచారం చేశారన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 11వ పేజీలో...

### కాళ్ల బేరానికి వచ్చినా పొత్తు పెట్టుకోం

- బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతయ్యింది
- ఆ పార్టీ నేతలు బీజేపీవైపు చూస్తున్నారు
- లోక్‌సభ ఎన్నికల్లో మాకు 10 సీట్లు ఖాయం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు

11

## ఎమ్మెస్పీకి పంచవర్ష ప్రణాళిక!

10

- పప్పులు, మొక్కజొన్న, పత్తి పంటలను ఐదేళ్లపాటు కనీస మద్దతు ధరకు కొంటాం
- కొనుగోళ్లకు పరిమితి ఉండదు.. రైతులతో 4వ విడత చర్చల్లో కేంద్రం ప్రతిపాదన
- తిరస్కరించిన రైతు సంఘాల నేతలు.. చలో ఢిల్లీ కొనసాగుతుందని ప్రకటన

### హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

కాంపిటెంట్ అథారిటీ జారీ చేయనందున సస్పెన్షన్ చెల్లదన్న హైకోర్టు

5

**కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు**

- కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు
- మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర: హరికృష్ణ



మేడారంలో నిర్మించిన తాత్కాలిక మరుగుదొడ్లు

## మేడారంలో నిధుల మేత!

**ప్రతిసారీ తాత్కాలిక పనులతో దోపిడీ**

- స్వరాష్ట్రంలో జాతరకు భారీగా నిధులు
- 2016 నుంచి 491 కోట్ల కేటాయింపు
- ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖలకే 226 కోట్లకు పైగా నిధులు
- తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, పూడికతీత పేరుతో నిధులు నీళ్లపాలు
- విజిలెన్స్ విచారణ, క్వాలిటీ తనిఖీల్లేవు
- కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు
- కొలతలు పెంచి.. బిల్లుల మంజూరు
- కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధుల బినామీలే

వరంగల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నా నేతలు శాశ్వత అభివృద్ధిని అటకెక్కించి తాత్కాలిక పనులతో జేబులు నింపుకుంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఏర్పడ్డాక 2016 నుంచి 2024 వరకు ప్రభుత్వం జాతర కోసం రూ.491.05 కోట్లు ఖర్చు చేసింది. జాతరలో చేపట్టేవన్నీ తాత్కాలిక పనులే కావడం.. కాంట్రాక్టర్లంతా ప్రజాప్రతినిధులకు బినామీలే అవడంతో నిధులన్నీ నేతల జేబుల్లోకి వెళుతున్నాయి. జాతర పనుల బిల్లులు చెల్లింపులన్నీ కలెక్టర్ చేతిలో ఉండటంతో పాటు ఆడిటింగ్, క్వాలిటీ తనిఖీలు ఉండవు. చివరకు విజిలెన్స్ విచారణ చేసే అవకాశం కూడా లేదు. దీంతో మేడారంలో అభివృద్ధి అదృశ్యమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మేడారం జాతరపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు పెంచింది. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ సారి జాతరకు రూ.105 కోట్లు కేటాయించింది. అయితే, 2016 నుంచి 2022 వరకు జరిగిన జాతరల్లో ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ శాఖలకే అత్యధికంగా నిధులు ఇచ్చారు. ఈ ఆరేళ్లలో ఆర్ అండ్ బీకి రూ.97 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు రూ.97.90 కోట్లు, ఇరిగేషన్‌కు రూ.31.11 కోట్లకు

మిగతా 9వ పేజీలో...

### వైభవంగా జాతర

- ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశాం
- శిలాశాసనంగా సమ్మక్క, సారలమ్మ చరిత్ర
- మంత్రులు పొంగులేటి, సీతక్క

12

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# రాప్తాడులో రాక్షసత్వం!

అనంతపురం జిల్లా రాప్తాడు సమీపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణమీద జరిగినదాడి పాలకుల నిరంకుశత్వానికి మరో రుజువు. వృత్తినిర్వహణలో భాగంగా సభను చిత్రీకరించిన ఈ ప్రతినిధి, ముఖ్యమంత్రి ప్రసంగం ఆరంభమైన కొద్దినిముషాల్లోనే ప్రజలు సభాప్రాంగణంనుంచి వెళ్ళిపోతున్న దృశ్యాలను కూడా కెమెరాలో బంధించాడు. దీనితో వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన మీద విరుచుకుపడ్డారు. జేబులోనుంచి ఐడీకార్డులాగి, ఆంధ్రజ్యోతి పేరు చూడగానే వీరావేశమెత్తిపోయారు. తమ చేతుల్లో ఉన్న వైసీపీ జెండా కర్రలతో అతడిని చావగొట్టారు. కర్రలతో కొడుతూ, కాళ్ళతో కుమ్ముతూ చాలాదూరం వరకూ వెంటాడి వేటాడారు. తీవ్రంగా గాయపడిన ఆ ఫోటోగ్రాఫర్ చివరకు సొమ్మసిల్లిపోవడంతో, ఒక పోలీసు అధికారి ఎత్తుకొని తన జీపులోకి చేర్చారు. ఆ ఫోటోగ్రాఫర్ కెమెరా, పర్సు, సెల్‌ఫోన్ ఇత్యాదివన్నీ లాక్కున్న వైసీపీ కార్యకర్తలు జీపుకు అడ్డుపడుతూ, ఆ పోలీసు అధికారిమీద కూడా దాడి యత్నం చేశారు. ఆఖరునిముషంలో, పోలీసువాహనంలో తరలించకపోయి వుంటే ఈ ఫోటోగ్రాఫర్ ఆ ఉన్మాదుల చేతిలో ప్రాణాలుకోల్పోయేవాడేమో! మొదట అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో, పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఇప్పుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అతను చికిత్సపొందుతున్నాడు.

ఉత్తరాది రాష్ట్రాల్లో 'మాబ్ లించింగ్' ను ఈ ఉదంతం గుర్తుకు తెస్తున్నది. ముఖ్యమంత్రి సమక్షంలో, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్న సభలో జరిగిన ఈ మూకదాడి వీడియోను చూసి దేశం విస్తుపోయింది. పాత్రికేయ సంఘాలు తీవ్ర నిరసనను, ఆగ్రహాన్ని వ్యక్తంచేశాయి. జర్నలిస్టు ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసిన ఈ ఘటనకు నిరసనగా ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టు సంఘాలు ప్రదర్శనలు నిర్వహించాయి. ఇదేమీ యాదృచ్ఛికంగా జరిగిన దాడికాదు. పార్టీ సభల్లోనే కాదు, ప్రభుత్వ కార్యక్రమాల్లో సైతం సీఎం జగన్ ఆంధ్రజ్యోతి సహా కొన్ని మీడియా సంస్థలమీద అక్కసు వెళ్లగక్కుతూ, వాటిపై తాను యుద్ధం చేస్తున్నానని చెబుతూ కార్యకర్తలను రెచ్చగొడుతున్న పర్యవసానం ఇది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ అరెస్టునుంచి తప్పించుకోవడానికి గత ఏడాది మే నెలలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి విశ్వభారతి ఆస్పత్రిలో తలదాచుకున్న విషయం తెలిసిందే. సీబీఐ అధికారులు అక్కడకు వచ్చారన్న ప్రచారం జరగడంతో, ఆ వార్తను నివేదించడానికి వెళ్ళిన ఆంధ్రజ్యోతి ప్రతినిధిని కడపజిల్లా వైసీపీ కార్యకర్తలు ఒక గదిలో నిర్బంధించి రాత్రంతా తీవ్రంగా కొట్టారు. అలాగే, కర్నూలులో పార్టీలోని రెండువర్గాల మధ్య పోరులో ఫ్లెక్సీలు చింపుకుంటున్న ఘటనను చిత్రీకరించినందుకు వైసీపీ కార్యకర్తలు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ మీద మూకుమ్మడి దాడిచేసి కర్రలతో కొట్టారు. ప్రజలకు సమాచారాన్ని అందించడం పాత్రికేయుల విధి. కానీ, తమకు వ్యతిరేకంగా రాస్తున్నారంటూ కొన్ని మీడియా సంస్థల పేర్లు చెబుతూ, నిండు సభల్లో పేపర్లు ప్రదర్శిస్తూ సాక్షాత్తూ ముఖ్యమంత్రే రెచ్చగొడుతున్నందున అధినేత మనసెరిగిన కార్యకర్తలు ఇలా మీడియా మీద తెగబడుతున్నారు.

ముఖ్యమంత్రి సభలో ఒక పాత్రికేయుడిమీద దాడిజరగడం ఎన్నడూ లేదు. అంగళ్ళు ఘటనలో చంద్రబాబు ప్రమేయం లేకపోయినా పాలకులు కేసు పెట్టారు. ఇప్పుడు ఓ దుర్మార్గమైన దాడి తన సమక్షంలోనే చోటుచేసుకుంటే సీఎం మాట్లాడటం లేదు, పాలకపక్షం ఖండించడం లేదు, బాధితుడు ఫిర్యాదు చేస్తేనే కేసు పెడతామని పోలీసులు సైతం అంటున్నారు. తన మనోభిప్రాయానికి అనుగుణంగా కార్యకర్తలు వ్యవహరించినందుకు సీఎం సంతోషిస్తున్నట్టు ఉంది. ఇదేమీ ముఖ్యమంత్రి కుటుంబ కార్యక్రమం కాదు. ఒక బహిరంగ సభలో మీడియా ప్రతినిధి ఫోటోలు తీయడం ఎలా తప్పవుతుందో పాలకులే చెప్పాలి. పార్టీ కార్యకర్తలు బరితెగించి ఒక జర్నలిస్టుమీద చేసిన ఈ దాడి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారపక్షం మరింత దుర్మార్గంగా వ్యవహరించబోతున్నదనడానికి సూచన. తమకు నచ్చనిదానిని రాసినా, చిత్రీకరించినా తీవ్ర శిక్షతప్పదన్న హెచ్చరిక, పాత్రికేయులను తమకు వ్యతిరేకంగా నోరువిప్పకుండా చేసే లక్ష్యం ఇందులో ఉంది. మీడియా మీదకు కార్యకర్తలను ఉసిగొల్పుతున్న సీఎం మీద రాజ్యాంగ సంస్థలు చర్యలు తీసుకోవాలి. న్యాయస్థానాలు సుమోటోగా విచారణ చేపట్టాలి. ప్రజాస్వామ్యం మీద, భావస్వేచ్ఛమీద, సమాచారాన్ని తెలుసుకొనే ప్రజల మౌలిక హక్కుమీద జరిగిన దాడి ఇది.

# శతాధిక కోట్ల స్వప్నాల సాధకుడు

నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యలను పట్టించుకుంటూ, ప్రజల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ, దేశ సంక్షేమం గురించి మాత్రమే ఆలోచించే ఒక రాజకీయ పార్టీని ప్రజలు వ్యతిరేకించే అవకాశాలు ఎంత మాత్రమూ లేవు. అధికారంలో ఉన్న పార్టీ పట్ల ప్రజా వ్యతిరేకత ఉండడం సహజమని, అందువల్ల ఆ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం కష్టమని చాలామంది మేధావులు భావిస్తుంటారు. అయితే, బీజేపీ విషయంలో మాత్రం ప్రజా వ్యతిరేకత అనేది ఉండదని చాలా సందర్భాల్లో రుజువైంది. గత పదేళ్లలో బీజేపీ విషయంలో ప్రజా వ్యతిరేకత బదులు ప్రజా అనుకూలత అనే పదం ఎక్కువగా వినపడుతోంది. ఇందుకు ప్రధాన కారణం బీజేపీకి నాయకత్వం వహిస్తున్న నరేంద్ర మోదీ అనడంలో సందేహం లేదు. బీజేపీ పాలించిన మెజారిటీ రాష్ట్రాల్లో ఆ పార్టీని ప్రజలు మళ్లీ మళ్లీ ఎన్నుకుంటే కాంగ్రెస్ తదితర పార్టీలు పాలించిన రాష్ట్రాల్లో ప్రజలు విసిగిపోయి గద్దె దింపుతున్నారు. ఇందుకు అనేక ఉదాహరణలున్నాయి. నరేంద్రమోదీ దాదాపు 23 సంవత్సరాలుగా అధికార పీఠానికి సారథ్యం వహిస్తున్నారు. తొలుత 13 సంవత్సరాల పాటు ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రధాన మంత్రి పదవిలో ఉన్నారు. మోదీ చేసిన మంచి పనుల మూలంగానే గుజరాత్‌లోనూ, కేంద్రంలోనూ భారతీయ జనతా పార్టీయే అధికారంలో కొనసాగుతున్నది. పార్లమెంట్ ఎన్నికల్లోనే కాదు. అసెంబ్లీ ఎన్నికల్లో, స్థానిక ఎన్నికల్లో కూడా బీజేపీ గతంలో కంటే ఎక్కువగా ప్రజా బలం సంపాదించుకోవడానికి కారణం మోదీ కలిగించిన విశ్వాసమే అని ఎవరైనా చెప్పగలరు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, ఛత్తీస్‌గఢ్, బిహార్, అస్సాం, త్రిపుర, మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో ప్రజలు మోదీ పట్ల విశ్వాసాన్ని ప్రకటించి ప్రజాసేవ చేసే అవకాశాన్ని బీజేపీకి కల్పించారు. గుజరాత్‌లో అయితే ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మొత్తం సీట్లలో పది శాతం కూడా రాలేదు. ఇప్పటి వరకూ అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా తన పనితీరుతో బీజేపీ అందరినీ ఆశ్చర్యపరిచింది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో బీజేపీ సంఖ్యాబలం 3 సీట్ల నుంచి 77 సీట్లకు పెరిగి ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రభవించింది. తెలంగాణలో బీజేపీ గతంలో ఒక సీటు గెలిస్తే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకుంది. పుదుచ్చేరిలో కూడా బీజేపీ సర్కార్ ఏర్పడింది. తమిళనాడు, కేరళ స్థానిక ఎన్నికల్లో కూడా బీజేపీ ఓటుశాతం పెరిగింది.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

ఇందుకు కారణమేమిటి? విధానాలు సరైనవైతే, నాయకత్వం సమర్థమైనదైతే, ప్రజలకోసం నిజాయితీగా పనిచేయాలనే ఉద్దేశం ఉంటే, ప్రజా వ్యతిరేకత అనేది అర్థరహితమని బీజేపీ పదే పదే రుజువు చేస్తోంది. మోదీ నాయకత్వంలో భారత దేశం బలమైన, సమర్థమైన దేశంగా మారిందనడంలో సందేహం లేదు. 2047 కల్లా బీజేపీ నాయకత్వంలో దేశం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) అవతరించడం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు. మోదీ నాయకత్వంలో భారత ప్రజలు బానిస భావజాలం నుంచి, వలస వాద సంస్కృతి నుంచి బయటపడ్డారు. మన సార్వభౌమికత్వం, సమగ్రత, సాంస్కృతిక వారసత్వం పట్ల ప్రజల విశ్వాసం పెరిగింది.. గత పదేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరిగాయో వారికి తెలుసు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, త్రిపుల్ తలాఖ్ రద్దు, జీఎస్టీ, పౌరసత్వ సవరణ చట్టం అమలు, కొత్త పార్లమెంట్ ప్రారంభం, భారతీయ న్యాయసంహిత ద్వారా మొత్తం నేరసంహితను మార్చివేయడం వంటి లెక్కలేనన్ని విజయాలు మోదీ హయాంలో సాధించిన విషయం ప్రజల అనుభవంలో ఉన్నది.



భారత ప్రజల స్వప్నాలను సాకారం చేయగల ఏకైక నేత నరేంద్రమోదీ ఒక్కరే అనడంలో సందేహం లేదు. ఆయనకు సాటి రాగల ప్రతిపక్ష నేత ఒక్కరూ దరిదాపుల్లో కనపడడం లేదు. ఇండియా కూటమి నేతలు కకావికలమవుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యాత్రలను ప్రజలు విస్మరిస్తున్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మూడోసారి 370 సీట్లకు పైగా గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు భారతీయ జనతా పార్టీ సర్వసన్నద్ధమయింది.

మోదీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి విధానాలు, ప్రభుత్వ పథకాల పేరుతో మోదీ ఇచ్చిన గ్యారంటీల ప్రభావం ఎంత బలంగా ఉన్నదో ప్రజలు స్వయంగా గమనిస్తున్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్, బేటీ బచావో -బేటీ పడావో, నమామిగంగే, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక పథకాలు దిగ్విజయంగా సాగుతున్నాయి. ఇవాళ నూటికి నూరు శాతం పారిశుద్ధ్య పథకాలు అమలు అవుతున్నాయి. 11 కోట్లకు పైగా శౌచాలయాలను నిర్మించారు. 13.91 కోట్ల కుటుంబాలకు ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు లభిస్తోంది. 55 కోట్ల మంది ఆయుష్మాన్ భారత్ కార్డులు పొందారు. 80 కోట్ల మందికి ఆహార ధాన్యాలు సరఫరా అవుతున్నాయి. అంతర్జాతీయంగా కూడా గత పదేళ్లలో భారతదేశ స్థాయి ఏ విధంగా పెరిగిందో కూడా సర్వవిదితమే. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం, ఉగ్రవాదం తోకముడవడం, అత్యంత బలమైన, సురక్షితమైన దేశంగా మారడాన్ని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయి. ఇవాళ మోదీ మాట్లాడితే మొత్తం ప్రపంచం ఆలకిస్తోంది. జీ–20, షాంఘై కార్పొరేషన్ సమావేశాలకు అగ్రరాజ్యాధినేతలందరూ హాజరై భారత్ రూపొందించిన సంయుక్త ప్రకటనను వివాదరహితంగా ఆమోదించడం మోదీ నాయకత్వ ప్రతిభకు సంకేతం. మోదీ చొరవతో ఆఫ్రికన్ యూనియన్‌ను కూడా జీ–20లో భాగం చేశారు. ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణతో అరెస్టయిన ఇండియన్ నేవీ మాజీ ఉద్యోగులు నిర్దోషులని మోదీ చెప్పడంతో ఆ దేశం వారిని వదిలిపెట్టింది. ఉరికంబం దాకా వచ్చిన వారు మోదీ పుణ్యమా అని జన్మభూమిపై అడుగుపెట్టి ఊపిరి పీల్చుకున్నారు.

సరే, మన ప్రతిపక్షాలు సైన్యం ధైర్యసాహసాలనూ ప్రశ్నించారు! ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడులు జరిపి ధ్వంసం చేసిన ఘనత మన సైన్యానికి దక్కింది. ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వన్ ర్యాంక్ – వన్ పింఛన్‌ను అమలు చేసింది కూడా మోదీ ప్రభుత్వమే. మోదీ హయాంలో బలహీన వర్గాలకు, దళితులకు, ఆదివాసీలకు, మహిళలకు జరిగిన సామాజిక న్యాయం విస్తృతమైనది. మోదీ సర్కార్ అధికారంలోకి రాగానే ఓబీసీ కమిషన్కు రాజ్యాంగ హోదా కల్పించారు. ముస్లిం మహిళలను త్రిపుల్ తలాఖ్ కోరలనుంచి తప్పించారు. భారతీయ సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేశారు. వర్గీకరణ కోసం కమిటీ ఏర్పాటు చేశారు.

దేశ రాజధాని ఢిల్లీలో 17, 18 తేదీల్లో భారత మండపంలో జరిగిన జాతీయ సదస్సులో ఈ విషయాలన్నీ చర్చకు వచ్చాయి. దేశ వ్యాప్తంగా నలుమూలల నుంచి హాజరైన పదివేలమందికి పైగా నేతల్లో తిరుగులేని సమధికోత్సాహం కనపడుతోంది. వికసిత్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్న వేలాది నేతలు దేశంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీని మరోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకువస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా బీజేపీ పట్ల ప్రజా వ్యతిరేకత కనపడడం లేదు. మోదీ నాయకత్వంలో 2004 జనవరి 22న అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రారంభం కావడంతో కోట్లాది ప్రజల కలలు నెరవేరడం వల్ల ఇవాళ దేశంలో ఒక పండుగ వాతావరణం కనపడుతోందని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ఈ దేశ ప్రజల కలలు సాకారం చేయగల ఏకైక నేత నరేంద్రమోదీ ఒక్కరే అనడంలో సందేహం లేదు. ఆయనకు దరిదాపుల్లో పేర్కొనదగ్గ ఏ ఒక్క ప్రతిపక్ష నేతా కనపడడం లేదు. ఇండియా కూటమి నేతలు కకావికలమవుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యాత్రలను ప్రజలు విస్మరిస్తున్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మూడోసారి 370 సీట్లకు పైగా గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు భారతీయ జనతా పార్టీ ఇప్పటికే సర్వసన్నద్ధమయింది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

# అప్పటి హామీల అమలు కోసమే రైతు ఉద్యమం

రైతు ఉద్యమాన్ని అడ్డుకునే పేరుతో మోదీ ప్రభుత్వం నేరుగా కురిపిస్తున్న పెల్లెట్లతో, దేశ ప్రజల కడుపు నింపడానికి శ్రమిస్తున్న భారతదేశ రైతులు తీవ్రంగా గాయపడుతున్నారు. వివక్షణారహిత ప్రభుత్వ నిర్బంధంతో, తమ కంటి చూపును కోల్పోతున్నా, దేశ భవిష్యత్తును వెలుతురు వైపు నడిపించడానికి ప్రయత్నిస్తున్నారు. డ్రోన్‌లతో వదులుతున్న బాష్పవాయు గోళాలను ఎదుర్కొంటూ కూడా సంక్షోభంలో ఉన్న గ్రామీణ ప్రజల కన్నీళ్లను తుడవడానికి ఉద్యమిస్తున్నారు.



2020లో కేంద్రం తెచ్చిన కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక మూడు చట్టాలకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు ఢిల్లీని చుట్టుముట్టి, పోరాడి ప్రభుత్వాన్ని వెనక్కు నెట్టి, విజయం సాధించారు. ఇప్పుడు మళ్ళీ పార్లమెంటు ఎన్నికల ముంగిట రోడ్లు ఎక్కారు. కేంద్ర ప్రభుత్వం ఆనాడు హామీ ఇచ్చినట్లుగా రైతులు పండించే పంటలకు ప్రకటించే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ఋణ మాఫీ చేసి రైతులను ఋణ విముక్తులను చేయాలనే కీలకమైన డిమాండ్లను రైతులు మళ్ళీ ప్రభుత్వం ముందు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా రైతులపై పెట్టిన అన్ని అక్రమ కేసులను ఎత్తేయాలని, రైతు ఉద్యమంలో అమరులైన 700 మందికి పైగా రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, ఆయా కుటుంబాలలో అర్హులైన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, లఖింపూర్ ఖేరీలో నిర్లక్ష్యంగా రైతుల పైకి జీపును నడిపి, అనేక మంది మరణానికి కారణమైన కేంద్ర మంత్రి కొడుకును శిక్షించాలని, విద్యుత్ బిల్లు – 2020ను ఉపసంహరించుకోవాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో రైతులు, కూలీలు, ఆదివాసీ ప్రాంతాల ప్రజలు, పశు పోషకులు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న మిగిలిన ముఖ్యమైన డిమాండ్ల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇంతకాలం వీటిపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా, హామీలను కూడా అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేసింది. కానీ పంజాబ్ కేంద్రంగా మళ్ళీ ఉద్యమాన్ని ప్రారంభించిన రైతులను మాత్రం తాను అధికారంలో ఉన్న హర్యానా రాష్ట్ర బోర్డర్‌లోనే ఆపి, దేశ రాజధానికి రాకుండా అడ్డుకోవడానికి బారికేడ్లు పెడుతున్నది, రోడ్లను తవ్వేస్తున్నది, రోడ్లపై మేకులు నాటుతున్నది, రోడ్లకు అడ్డంగా గోడలు కడుతున్నది. రైతుల ట్రాక్టర్లను శత్రు దేశాల ట్యాంకులుగా ప్రచారం చేస్తున్నది. రైతుల ప్రదర్శనలలో పాల్గొంటే ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుంటామని, భారీ జరిమానాలు విధిస్తామని బెదిరిస్తున్నది. నయా రామావతార్‌గా, 'విశ్వగురు'గా చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సాధారణ రైతులు అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పకుండా తప్పించుకుంటున్నాడు.

దేశంలో రైతు కుటుంబాల వాస్తవిక పరిస్థితిని అర్థం చేసుకున్నప్పుడే రైతుల ఉద్యమం, డిమాండ్లు అర్థమవుతాయి. దేశంలో కోట్లాది వ్యవసాయ కుటుంబాల సభ్యులకు ఇప్పటికీ ఆత్మగౌరవం ఉన్న మనుషులుగా గుర్తింపు లేదు. భారత పౌరులుగా వారికి హక్కులు లేవు. వ్యవసాయ కుటుంబాల కనీస ఆదాయాలకు గ్యారంటీ లేదు. సాగు చేసుకోవడానికి అవసరమైన స్వంత భూమి లేదు. సాగును జీవనోపాధిగా ఎంచుకున్న కౌలు రైతులకు ఏ రాష్ట్రంలోనూ సరైన గుర్తింపు లేదు. ప్రతి సంవత్సరం వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోతున్నాయి. కోట్లాది మంది రైతులకు వడ్డీలేని పంట రుణాలు, పెట్టుబడి రుణాలు అందడం లేదు. పంటల బీమా పథకాలు అమలుకావడం లేదు. పంట నష్ట పరిహారం అందడం లేదు. రైతులు పండించిన పంటలకు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులకు న్యాయమైన ధరలు దక్కడం లేదు.

> 2014లో మోదీ ప్రధాన మంత్రి అయ్యాక తన 2012 సిఫారసుకు, 2014లో బీజేపీ ఇచ్చిన హామీకి భిన్నంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయలేమని, ఆ సిఫారసు అమలు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు మళ్ళీ మొదలైన ఈ రైతు ఉద్యమాన్ని బలపరచడం, మద్దతునీయడం, భాగస్వాములు కావడం మనందరి బాధ్యత.

2006లో డాక్టర్ స్వామినాథన్ నేతృత్వంలోని వ్యవసాయ రంగ జాతీయ కమిషన్ అన్ని సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, పరిష్కారానికి అనేక సూచనలు చేసింది. కనీస మద్దతు ధరలకు సంబంధించి, సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు 50శాతం కలిపి (C2 + 50 శాతం) కనీస మద్దతు ధరను నిర్ణయించాలనేది ఈ కమిషన్ సిఫారసులలో ముఖ్యమైనది. నిజానికి ఆయన చేసిన సిఫారసులను పూర్తిగా అమలు చేస్తే మాత్రమే వ్యవసాయ కుటుంబాల సంక్షోభానికి సంపూర్ణ పరిష్కారాలు దొరుకుతాయి.

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేయలేదని, 2014 ఎన్నికల సందర్భంగా వందకు పైగా సభల్లో విమర్శించి, స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేస్తామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కూడా గత పదేళ్లుగా ఈ సిఫారసును అమలు చేయలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2012లోనే ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన ఒక కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మోదీ, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని తన కమిటీ తరపున స్పష్టంగా సిఫారసు చేశారు. కానీ 2014లో ప్రధానమంత్రి అయ్యాక తన 2012 సిఫారసుకు, 2014లో బీజేపీ ఇచ్చిన హామీకి భిన్నంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయలేమని, ఆ సిఫారసు అమలు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తుందని కేంద్ర ప్రభుత్వంగా సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. పైగా స్వామినాథన్ కమిషన్ సిఫారసును వక్రీకరిస్తూ, సమగ్ర ఉత్పత్తి ఖర్చులను (C2 ) కాకుండా, కేవలం పంట సాగు ఖర్చులకు (A2) కుటుంబ సభ్యుల శ్రమకు కొంత విలువను జోడించి, దానికి 50శాతం కలిపి కనీస మద్దతు ధరలను (MSP) ప్రకటిస్తున్నది.

నిజానికి వ్యవసాయంలో రైతులు పెట్టే అన్ని పెట్టుబడులనూ పంట ఖర్చుల ధరల నిర్ణాయక కమిషన్ (CACP) పరిగణనలోకి తీసుకోవడం లేదు. ముఖ్యంగా రైతు సాగు భూమికి ఏ విలువా వేయడం లేదు. రైతు పెట్టే ఇతర పెట్టుబడులకు (ట్రాక్టర్ కొనుగోలు, డ్రిప్ లాంటి సూక్ష్మ సాగు నీటి వ్యవస్థ ఏర్పాటు, సాగునీటి కోసం బోర్ వేయడం, బావి తవ్వడం, విద్యుత్ ట్రాన్స్‌ఫాం ఏర్పాటు, పొలంలో షెడ్డు వేయడం, నీటి కోసం దూర ప్రాంతాల నుంచి పైప్‌లైన్ వేసుకోవడం, పంట కోత, ఎండబెట్టడం, గ్రేడింగ్ చేయడం, క్లీనింగ్ చేయడం లాంటి వాటికి) అసలు విలువ ఇవ్వడం లేదు. వ్యవసాయ సీజన్‌లో రైతుకయ్యే రవాణా ఖర్చులను పట్టించుకోవడం లేదు. పంటల బీమా పథకం ప్రీమియం కూడా లెక్కింపులోకి తీసుకోవడం లేదు. కూలీలను దూరం నుంచి రప్పించుకుని పని చేయించుకోవడం కోసం పెట్టే రవాణా, భోజనం, మద్యం సరఫరా లాంటి వాటికి అయ్యే అదనపు ఖర్చులను కూడా ఉత్పత్తి ఖర్చులలో పరిగణనలోకి తీసుకోవడం లేదు.

దేశంలో కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం సహా 100కు పైగా పంటలు, ఇతర గ్రామీణ ఉత్పత్తులు వస్తుంటే, ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి కేవలం 23 పంటలకు మాత్రమే కేంద్రం కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నది. పత్తికి కూడా కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI), ప్రస్తుతం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరలు పలుకుతున్నాయనే పేరున, పత్తిని గత మూడేళ్లుగా సేకరించడం మానేసింది.

కేంద్రం ప్రకటించే ఈ ధరలకు ఇప్పటి వరకూ ఎటువంటి చట్టబద్ధత లేదు. అవి కేవలం సలహా ధరలుగా మాత్రమే ఉంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి నేరుగా, పంటలను కొనుగోలు చేసే సమయంలో మాత్రమే ఈ ధరలు రైతులకు అందుతున్నాయి. పంట నాణ్యత లేదనే పేరుతో, తేమ ఎక్కువ ఉందనే పేరుతో, ప్రభుత్వ రంగ కొనుగోలు సంస్థలు కూడా ధరలో కోతలు పెడుతూనే ఉన్నాయి.

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత లేకపోవడం వల్ల, దళారీ వ్యాపారులు, కంపెనీలు రైతులకు వాటిని చెల్లించకపోయినా వారిపై ఎటువంటి చర్యలను ప్రభుత్వాలు తీసుకోలేవు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులలో కానీ, ఈ–నామ్ లాంటి ఆన్‌లైన్ పోర్టల్‌పై కానీ రైతులకు కనీస మద్దతు ధరలు తప్పకుండా చెల్లించాలనే నియమం ఏమీ లేదు. దేశవ్యాప్తంగా అన్ని చోట్లా వ్యాపారులు, కంపెనీలు కుమ్మక్కై కార్టెల్‌గా ఏర్పడి, పంటలకు అతి తక్కువ ధరలనే చెల్లిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో నిజమైన రైతుల సమస్యలను, డిమాండ్లను మళ్ళీ మరోసారి ముందుకు తేవడం ద్వారా ప్రజలను సమీకరించి, తమ డిమాండ్లను సాధించుకోవడానికి ఈ ఎన్నికల సమయం సరైందని భావించిన కొన్ని రైతు, కూలీ సంఘాలు ఉమ్మడిగా ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపు ఇచ్చాయి. ఫలితంగా గత వారం రోజులుగా రైతుల ఎజెండా అనివార్యంగా ప్రజలలో చర్చకు వచ్చింది.

మన దేశంలో జాతీయ నమూనా సర్వే సంస్థ (NSSO) నివేదిక 2019 ప్రకారం వ్యవసాయ కుటుంబాల సగటు నెలసరి ఆదాయం కేవలం రూ.10,218 మాత్రమే. ఈ నివేదిక ప్రకారం దేశంలో 50శాతం రైతు కుటుంబాలు అప్పులో కూరుకుపోయి ఉన్నాయి.


రైతులు కొనసాగిస్తున్నది న్యాయమైన ఉద్యమం. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు మళ్ళీ మొదలైన ఉద్యమం. ఈ ఉద్యమాన్ని బలపరచడం, మద్దతునీయడం, భాగస్వాములు కావడం మనందరి బాధ్యత.

● కన్నెగంటి రవి
రైతు స్వరాజ్య వేదిక

# గ్రంథాలయ డిజిటలీకరణ వైతాళికుడు

'విజ్ఞాన సమాజ నిర్మాణానికి కావలసింది సమాచారం అందరికీ అందుబాటులోకి రావడం' అన్నది ప్రొఫెసర్ ఇనుకొండ రామారెడ్డి లక్ష్యం. 'విశ్వవిద్యాలయాల గ్రంథాలయాల్లో ఉన్న జ్ఞానసంపద డిజిటల్ గ్రంథాలయాల ద్వారా ప్రజలకు చేరాలి' అన్నది ఆయన ధ్యేయం. జనవరి 30న మరణించిన రామారెడ్డి భారత విశ్వవిద్యాలయాల గ్రంథాలయాలలో మొట్టమొదటిసారిగా ఆటోమేషన్, డిజిటలీకరణలకు శ్రీకారం చుట్టారు.

ప్రొఫెసర్ ఇనుకొండ రామారెడ్డి 1943 మే 5న కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1966లో ప్రారంభించిన గ్రంథాలయ శాస్త్ర డిప్లొమా కోర్సు మొదటి బ్యాచ్‌లో చేరిన నలుగురు విద్యార్థుల్లో రామారెడ్డి ఒకరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ పట్టా పొందిన తరువాత ధార్వాడ్‌లోని కర్నాటక విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎల్.ఎస్సీ, పిహెచ్.డి పూర్తి చేశారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణుడిగా రామారెడ్డి వృత్తి ప్రస్థానం 1966లో ప్రారంభమైంది. 1966 జనవరి నుంచి 1970 దాకా ఉస్మానియా మెడికల్ కళాశాలలో గ్రంథ పాలకుడిగా పని చేశారు. 1970–1978 మధ్య కాలంలో తొమ్మిదేళ్లపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. 1978 జనవరి మాసంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ సర్వీస్‌లో చేరిన ప్రొఫెసర్ రామారెడ్డి అధికారికంగా 2005లో పదవీ విరమణ పొందారు. అయితే అప్పటి ఉపకులపతి ప్రొఫెసర్ హరినారాయణ కోరిక మేరకు 2006 జనవరి 7వ తేదీ వరకు విధి నిర్వహణలో కొనసాగారు.



> భారతదేశ వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని గ్రంథాలయాల ఆటోమేషన్, డిజిటలీకరణలకు అంకితమై నిర్విరామ కృషిచేశారు రామారెడ్డి. గ్రంథాలయాల విధులు, సేవల పట్ల ఉన్న దృష్టి కోణాన్ని ఆయన పూర్తిగా మార్చివేశారు. అంతర్జాలానంతర యుగంలో గ్రంథాలయ పాలకుల మారిన పాత్రను గుర్తించడంలో, నిర్వచించడంలో, పరిచయం చేయడంలో వైతాళిక పాత్రను నిర్వహించారు.

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయంలోని కార్యకలాపాలన్నింటిని అక్కడ అందుబాటులో ఉన్న సిబ్బంది సమన్వయంతో 1995 నాటికి కంప్యూటరీకరణ పూర్తి చేయించారు. 1989లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి మొదటి కంప్యూటర్‌ను రామారెడ్డి కొన్నారు. అక్కడి కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ప్రొఫెసర్ నాగరాజా రావు రూపొందించిన ప్రోగ్రాం ఆధారంగా గ్రంథాలయాన్ని ఆటోమేషన్ చేయించడం మొదలుపెట్టారు.

1995 సంవత్సరాంతానికి LIBSYS సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి 1.5 లక్షల పుస్తకాల డాటాబేస్‌ను సిద్ధం చేశారు. 1996 నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయంలోని గ్రంథాలన్నీ పూర్తిగా ఆటోమేటెడ్ అయి, ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. OCLC, USA వారి జనరల్ కౌన్సిల్‌కి భారతదేశ విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికైన మొట్టమొదటి సభ్యుడు రామారెడ్డి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హిందీ, తెలుగు మరియు ఉర్దూ ప్రచురణలను Worldcatలో MARC21 ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేశారు. ఒక్కొక్క అప్‌లోడెడ్ రికార్డుకి మూడు డాలర్ల చొప్పున వసూలు చేయడం ద్వారా విశ్వవిద్యాలయానికి ఆర్థిక పరిపుష్టిని కల్పించారు. బయటివారి నిధులతో ఒక నమూనా డిజిటల్ గ్రంథాలయాన్ని వృద్ధి చేశారు.

గ్రంథాలయాల సిబ్బందికి ఆటోమేషన్ మరియు నెట్‌వర్కింగ్‌లో శిక్షణ అవసరాన్ని గుర్తించిన రామారెడ్డి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ అధికారులను ఒప్పించి 1998 నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్స్ ఇన్ లైబ్రరీ ఆటోమేషన్, నెట్‌వర్కింగ్ ఏడాది కోర్సును ప్రారంభింపజేశారు. గ్రంథాలయ సిబ్బందితో ప్రతి నెలా సమావేశాలు నిర్వహించడం, మధ్యస్థాయి సిబ్బందితో కార్యాచరణపై చర్చించడం, కిందిస్థాయి ఉద్యోగులను ప్రేరేపించడం, పని వికేంద్రీకరణ రామారెడ్డి విజయ రహస్యాలు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆటోమేటెడ్, డిజిటల్ గ్రంథాలయంలో 28 ఏళ్ళ సుదీర్ఘ కాలంపాటు బాధ్యతలు నిర్వహించిన రామారెడ్డి 2007 ఏప్రిల్‌లో థాయ్‌లాండ్‌లోని మహాసరఖమ్ విశ్వవిద్యాలయంలోని ఇన్ఫర్మాటిక్స్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా అధ్యాపక బాధ్యతలు చేపట్టారు.

'గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడికి ప్రాయోగిక పరిజ్ఞానం, బోధనాంశంపై సాధికారత, విద్యార్థులు యథార్థాన్ని అవగాహన చేసుకునే విధంగా ఉదహరణలు చెప్పడం, గ్రంథాలయ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అవసరం' అని ప్రొఫెసర్ రామారెడ్డి భావన. 2012 నుంచి టీసీఎస్, ముంబైకి విజిటింగ్ అధ్యాపకుడిగా పనిచేశారు. 2015 నుండి కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయానికి గ్రంథాలయ సలహాదారుడిగా ఉన్నారు.

ముంబైలోని ఎస్ఎన్‌డిటి మహిళా విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ హిల్ యూనివర్సిటీ, కర్నాటక విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయాల గ్రంథాలయ శాస్త్ర విభాగాల పాఠ్యప్రణాళికా మండలుల సభ్యుడిగా కొనసాగారు. డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి డిజిటల్ గ్రంథాలయాల పాఠ్యగ్రంథాలకు సంపాదకుడిగా వ్యవహరించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయశాఖ పూర్వవిద్యార్థిగా రామారెడ్డి విశ్వవిద్యాలయం పట్ల, మరీ ముఖ్యంగా గ్రంథాలయశాఖ పట్ల ఎంతో ఆత్మీయంగా ఉండేవారు. మహాసరకమ్ విశ్వవిద్యాలయం (థాయ్‌లాండ్) ఇన్ఫర్మాటిక్ శాఖతో, ఉస్మానియా గ్రంథాలయ శాఖ (2012–2017 నడుమ) అవగాహనా పత్రాలపై సంతకాలు చేయడంలో ఆయన కీలక భూమిక నిర్వహించారు.

తను సాధిస్తున్న విజయాల వెనుక సతీమణి ఊర్మిళారెడ్డి కృషి ఉందని చెప్పేవారు. ఆమె కూడా గ్రంథాలయ రంగంలో ఉన్నతమైన పదవుల్లో పనిచేస్తూనే కుటుంబ బాధ్యతలన్నీ చూసుకోవడం వలన రామారెడ్డి వృత్తిపరమైన పురోగతి సాధించారు. ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్వఉపకులపతులు ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి, ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా, ప్రొఫెసర్ హరినారాయణల సహకారాన్ని ఆయన గుర్తుచేసుకునేవారు.

భారతదేశ వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని గ్రంథాలయాల ఆటోమేషన్, డిజిటలీకరణలకు అంకితమై నిర్విరామ కృషిచేశారు రామారెడ్డి. గ్రంథాలయాల విధులు, సేవల పట్ల ఉన్న దృష్టి కోణాన్ని ఆయన పూర్తిగా మార్చివేశారు. అంతర్జాలానంతర యుగంలో గ్రంథాలయ పాలకుల మారిన పాత్రను గుర్తించడంలో, నిర్వచించడంలో, పరిచయం చేయడంలో వైతాళిక పాత్రను నిర్వహించారు.

■ డా. కందిమళ్ళ భారతి

## విశ్వగురు దిగిరాడా ఏమి!



ఇండియా గేట్ ముందు మోహరించిన రైతుల ట్రాక్టర్ల దర్పా
ఢిల్లీ నడిబొడ్డున కిసాన్ గేట్ నిలబెట్టినట్టుగా ఉంది.
నిజమే ఆధ్యాత్మిక రాజధాని సమ్మోహన కోలాహల వేళ
దేశ రాజధానిలో కార్పొరేట్ హాలాహలాన్ని మింగలేమని
కర్ణభీకర సూపర్సోనిక్ ఆయుధ ప్రయోగం మధ్య
రైతన్న రణ నినాదం....
ఇప్పుడు మీడియా మత్తులో తూగుతూ సోయి మరిచిన
జనాన్ని పట్టి లాగి కిసాన్ గేట్లో కూర్చోబెడుతుంది.
రండి! అన్నదాత పరబ్రహ్మ స్వరూపుడు
రాముని మించిన నిర్ విరామ కృషీవలుడు.
గజేంద్రమోక్షం ఆలకించిన శ్రీమహావిష్ణువు తీరు
అధికార తేరుపై సేద తీరు విశ్వగురు దిగిరాడా ఏమి!
నాగలి పట్టిన రైతు భూమి మీద బలరాముడు కదా!
సీత అంటే భూమాత కదా! ఎందుకు ఇంకా శీతకన్ను?
సీతారామ! బలరామ.. బాల రామా..
నీ నామమేదైతే ఏమి! పొక్కిలైన రైతు గుండెపై వాలు
రెక్కలు తెగిన క్షతగాత్ర జటాయువుకు
లేపనం పూయని అమానవీయం చాలు

– చెరుకు సుధాకర్

## నా పేరు రైతు.. నా పైరు కవాతు..!

మహమ్మారి గళానికి అమరిన అరదండమై
ఉరితాడును హత్తుకునే మొండెమై
కాలం కొయ్యకు వేళ్లాడుతూ
చిరుగుతున్న వస్త్రమై
మిన్నంటి రెపరెప లాడుతున్న
వ్యవసాయ కార్మికులం

కళ్ళనీ ఒళ్ళనీ భగ భగ మండించే
పంటనై మంటనై మండిన నేను
ఆరుగాలం స్వేదాన్ని ముద్దాడినా
ఆర్చి పేర్చిన పంటకు
గిట్టుబాటు లేక బ్రతుకుల్ని
కాటేసిన దృశ్యం

ఏపుగా పెంచి సున్నితంగా తుంచి
ఎండబెట్టి గల గలా గంపకెత్తి
బస్తాల్లో బానెడు ఆశల్తో కుక్కి
మార్కెట్ యార్డుల్లోకెల్తే
తల వేళ్లాడదీసిన పంట ధర
నా భరోసాను ముక్కలు చేసింది

నెత్తిన సూరీడు సూదిమొనతో గుచ్చినట్టు
సురుక్కు సురుక్కున పొడుస్తున్నా
నా మదిలో తొలుస్తున్న దొక్కటే
పంటంతా నా చెమట తూకానికైనా అమ్మాలి
చిల్లుపడ్డ కుండలో నీళ్లాగ నట్లే
మా బతుకెప్పుడూ నీరుగారుతూనే వుంది

విపణి శక్తులూ ప్రకృతి విపత్తులూ
మాయదారి కలుపు చట్టాలు
తల తాకట్టు పెట్టుకొమ్మన్నై
అన్నీ మమ్ముల్ని అమ్ముడు పొమ్మన్నై
అన్నీ మమ్మల్ని అవమానించినై
పంటను మా గుండె మంటనూ
నిలువునా తగలబెట్టుకొమ్మన్నై

వ్యవసాయానికి వెన్నుముకనై
అన్నపూర్ణ దేశంలో రాజునై రారాజునై
అక్షర పుటల్లో వర్ధిల్లిన నేను
ఇప్పుడు చేతుల్ని నెత్తి మీద
చరుచుకుంటూ ఏకరువు పెడుతున్నా
మిరప పండ్లను కస పిస
రోట్లో నూరిన కారం లెక్క
నిఖార్సుగా భగ భగ మండుతున్నా

కమ్ముకొచ్చిన కసాయి రక్కసిపై
ఉద్యమ మందును పూట పూటకూ
పిచికారీ చేస్తున్నా
బ్రతుకు పంట ఎందుకు
పచ్చగా పండదో వేచి చూస్తున్నా
ఇప్పటివరకూ
బలిపీఠంపై మోకరిల్లిన తల నాదే కావచ్చు
కానీ.. ఇప్పుడిక సమస్యలను
ఉరితీసే తలారీని నేనే..!
నా పేరు రైతు.. నా పైరు కవాతు..!

– కటుకోఝ్వల రమేష్
(రైతు ఉద్యమానికి సంఘీభావంగా)



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి సీతక్క, కలెక్టర్

# మహా జాతరకు పటిష్ట ఏర్పాట్లు

## గిరిజన కుంభమేళాను వైభవంగా జరుపుతాం

- రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మంత్రి సీతక్కతో కలిసి మేడారంలో పర్యటన
- మీడియా సెంటర్, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం
- జాతర నిర్వహణపై అధికారులతో సమీక్ష

మేడారం, ఫిబ్రవరి 19 : రెండేళ్లకోసారి జరిగే గిరిజన కుంభమేళా.. మేడారం మహాజాతరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, బుధవారం నుంచి జరిగే ఈ జాతరను వైభవంగా జరుపు తామని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి సోమవారం ఆయన మేడారంలో పర్యటించి.. గద్దెల పరిసరాల్లోని తాత్కా లిక విడిది గదిలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. సమ్మక్క సారలమ్మల దీవెల నలతో రాష్ట్రంలో అధికార మార్పు జరిగిందని, ప్రజల కోరుకున్న ప్రభుత్వం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మేడారం మహాజాతర ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు సుమారు 50 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను ముందస్తుగా దర్శించుకున్నారని, జాతర రోజుల్లో 2కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారందరికీ ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఓ వైపు అసెంబ్లీ నడుస్తున్నా సీతక్క నిత్యం జాతర పనులను పర్యవేక్షిస్తూ ఏర్పాట్లు చేయిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం మేడారం జాతరకు రూ.75కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తే.. ప్రస్తుతం ఖజానా ఖాళీగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రూ.110కోట్లు మంజూరు చేసిందన్నారు. మహాజాతరకు మరో రెండు కోట్ల మంది భక్తులు తరలివస్తారన్నారు. గత జాతరలో భక్తుల కోసం 3వేల బస్సులను నడిపితే ఈసారి తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూనే 6వేల బస్సులను నడుపుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 17కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. మహా జాతరలో 16 వేల మంది అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారని, నాలుగు వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించామన్నారు. గత జాతరల అనుభవం కలిగిన ఐదు గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్టు వివరించారు. జాతరకు అనుసంధానమయ్యే సుమారు 270కిలోమీటర్ల రోడ్లు నూతనంగా

మిగతా 7వ పేజీలో..



వనదేవతలను దర్శించుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి సీతక్క

## ఖర్చుల లెక్కలు ప్రజల ముందుంచుతాం..

- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

మేడారం మహాజాతరకు భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేసిన నిధుల లెక్కలను ప్రజల ముందు ఉంచుతామని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. జాతర పూర్తయిన వెంటనే ఖర్చులన్నీ వెల్లడిస్తామని, మిగులు డబ్బులతో శాశ్వత ఏర్పాట్లు చేపడతామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఇప్పటికే పెద్ద ఎత్తున భక్తులు మేడరం తరలివచ్చి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉంటూ నిరంతరం జాతర అభివృద్ధి పనులపై సలహాలు, సూచనలు చేస్తూ సహకరించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు రెండు నెలల నుంచి నిరంతరం విధుల్లో ఉండి భక్తుల సౌకర్యాల కల్పనలతో నిమగ్నమయ్యారని, జాతరకొచ్చే భక్తులు, వీఐపీలు.. అధికారులు, పోలీసులకు సహకరించాలని కోరారు. 1996లో సమ్మక్క సారలమ్మ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ పండుగగా గుర్తించాలని కోరారు. మేడారం మహాజాతర నిర్వహణకు సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పలుశాఖల అధికారులు తదితరులున్నారు.



తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

## చల్లని తల్లుల అగ్రంపహాడ్

- భక్తి శ్రద్ధలతో కొలిస్తే అనుగ్రహించే సమ్మక్క సారలమ్మ
- ఎత్తు బంగారం, పిల్లాపాపలతో తరలివస్తున్న భక్తులు

7

# లక్ష్యానికి చేరువలో..

- పన్నుల వసూళ్లలో వ్యవసాయ మార్కెట్ల ముందంజ
- రూ.438.58కోట్లకు గాను రూ.311.62కోట్ల వసూలు
- జనవరి నెలాఖరుకే 71శాతానికి చేరిక
- నూటికి నూరు శాతం లక్ష్యం చేరేలా ఉన్నతాధికారుల హుకుం
- చతికిల పడిన కొన్ని మార్కెట్లు



వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు, 110 వ్యవసాయ మార్కెట్లు పన్ను వసూళ్లలో లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి 31 వరకు 71 శాతం లక్ష్యాన్ని సాధించి విజయకేతనం ఎగరవేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. రీజియన్ పరిధిలో 2022- 2023 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.311.38 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-2024 ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.438.58కోట్లు పన్ను రూపేణ వసూలు చేయాలని నిర్ణయించగా జనవరి 31 వరకే రూ.311.62కోట్ల ఆదాయాన్ని ఆర్జించి 71 శాతం లక్ష్యాన్ని సాధించింది. ఇక ఫిబ్రవరి, మార్చి రెండు నెలలు మిగతా 29శాతం పన్ను వసూలు చేసి లక్ష్యాన్ని చేరి నూటికి నూరు మార్కులు కొట్టేయాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు, డీఎంవోలు వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించి కార్యదర్శులకు ఆదేశాలు, సూచనలు, సలహాలను ఇస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు భూపాల్‌పల్లి చిట్యాల మార్కెట్ పన్ను వసూళ్లలో 102 శాతం వసూలు చేసి ముందంజలో ఉంది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని 18 వ్యవసాయ మార్కెట్ల పనితీరును పరిశీలిస్తే..

- వరంగల్ జిల్లాలోని ఏనుమాముల మార్కెట్‌కు రూ.42కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ.29.50కోట్లు వసూలు చేసి 70శాతం లక్ష్యాన్ని చేరింది. నర్సంపేట మార్కెట్‌కు రూ.6.62కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.2.42కోట్లు వసూలు చేసి 37 శాతం లక్ష్యాన్ని చేరింది. నెక్కొండ మార్కెట్‌కు రూ.1.40కోట్లకు గాను రూ.73లక్షలు వసూలు చేసి 52శాతం లక్ష్యాన్ని చేరింది. వర్ధన్నపేట మార్కెట్‌కు రూ.2.25కోట్లకు గాను కేవలం రూ.32లక్షలు వసూలు చేసి 14 శాతానికి పడిపోయింది.
- హనుమకొండ జిల్లాలోని పరకాల మార్కెట్‌కు రూ.2.60కోట్లకు గాను రూ.కోటి16 లక్షలు వసూలు చేసి 45శాతం లక్ష్యాన్ని చేరింది. ఆత్మకూర్ రూ.కోటి14 లక్షలకు గాను రూ.35లక్షలు వసూలు చేసి 30 శాతం లక్ష్యాన్ని చేరింది.
- జనగామ జిల్లాలో జనగామ మార్కెట్ రూ.5.87 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.2.53 కోట్లు వసూలు చేసింది. ఘన్‌పూర్ రూ.2.57 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.కోటి48 లక్షలు వసూలు చేసింది. కొడకండ్ల రూ.కోటి88 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా రూ.కోటి 64లక్షలు వసూలు చేసింది. పాలకుర్తి రూ.82లక్షలకు గాను రూ.15లక్షలు వసూలు చేసింది.
- మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ మార్కెట్ రూ.6.88కోట్లు గాను రూ.5.95కోట్లు వసూలయ్యాయి. కేసముద్రం మార్కెట్ రూ.6.20కోట్లకు గాను రూ.5.47కోట్లు వసూలు చేసింది. తొర్రూరు మార్కెట్ రూ.3.96కోట్లకు గాను రూ.2.85కోట్లు వసూలు చేసింది.
- భూపాలపల్లి జిల్లాలో కాటారం మార్కెట్ రూ.2.83కోట్లు గాను రూ.కోటి34లక్షలు వసూలు చేసింది. చిట్యాల మార్కెట్ రూ.కోటి వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తి చేసి ముందంజలో ఉంది. భూపాలపల్లి మార్కెట్ రూ.3.15కోట్లకు గాను రూ.కోటి68లక్షలు వసూలు చేసింది. ములుగు జిల్లాలో ములుగు మార్కెట్ రూ.6.48కోట్లకు గాను రూ.4.55కోట్లు వసూలు చేసింది.

2023 -2024 జనవరి 31 వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు 110 మార్కెట్‌లు కలిపి రూ. 438.58 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటికి రూ.311.62కోట్లు వసూలు చేసి 71శాతం లక్ష్యాన్ని చేరింది. మిగిలిన రెండు నెలల్లో వందకు వందశాతం లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

**పన్ను వసూళ్లు ఇలా.. (రూ.కోట్లలో..)**

| జిల్లా | వసూలు చేయాల్సింది | వసూలు అయింది |
|---|---|---|
| వరంగల్ | 52.27 | 32.79 |
| హనుమకొండ | 3.74 | 1.51 |
| జనగామ | 11.14 | 5.82 |
| మహబూబాబాద్ | 16.96 | 14.27 |
| భూపాలపల్లి | 6.98 | 4.40 |
| ములుగు | 6.48 | 4.54 |

### ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలి

- మల్లేశం, వరంగల్ రీజియన్ జేడీ



ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలి. కిందిస్థాయిలో ఉన్న అధికారులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలి. ఇది నిరంతరం శ్రమిస్తే వచ్చే ఫలితం. అందుకే రోజు మార్కెట్లను సందర్శిస్తూ అక్కడి సాధక బాదకాలను ఆలకిస్తుంటాం. వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ మార్కెట్ ఫీజును వసూలు చేసేందుకు ప్రోత్సహిస్తాం. సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ అది ఎక్కడ కనిపించకుండా పనిచేసుకుంటూ ముందుకు వెళ్లడం వల్ల పనులు సులభతరమవుతాయి. పన్ను వసూళ్లలో ముందజలో ఉన్న వారికి శాఖ తరుఫున ప్రశంసపత్రాలు, అవార్డులు, అభినందనలుంటాయి.



వరంగల్ మేయర్‌పై

# అవిశ్వాసం?

- సొంతపార్టీ నేతలే రంగం సిద్ధం చేస్తున్నారంటూ ప్రచారం
- పార్టీలో ఉన్నా.. మారినా.. తగ్గేది లేదంటున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 19 : వరంగల్ మే యర్ గుండు సుధారాణిపై అవిశ్వాసానికి సొంత పార్టీ నేతలే సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆమె బీఆర్‌ఎస్‌లో ఉన్నా.. కాంగ్రెస్‌లో చేరినా తాము తగ్గే ది లేదన్నట్టుగా పావులు కదుపుతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డితో రహస్య సమావేశాలు జరిపారన్న వార్త చక్కర్లు కొట్టింది. దీంతో ఈ పరిణామాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డిని సంప్రదించింది. అందుకు స్పందించిన ఆయన.. 'అవును.. మా పార్టీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆమె మా పార్టీలో ఉన్నా.. కాంగ్రెస్‌లోని వెళ్లినా.. అవిశ్వాసం పెట్టడం ఖాయం. ఎన్నో కష్టాలకు ఓర్చి బీఆర్‌ఎస్ కార్యకర్తలు గుండు సుధారాణిని మేయర్ చేశారు. కానీ కాలనీ సమస్యలు కూడా పట్టించుకోకుండా కార్పొరేటర్లను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. ఆమె చేస్తున్న అవినీతిని బయట పెడతాం. ఇప్పటికే కార్పొరేటర్లతో రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. అందరి అభిప్రాయాలు తీసుకునే త్వరలో మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లో వెనక్కు తగ్గేది లేదు' అని స్పష్టం చేశారు. ఇప్పటికే మేయర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జరుగుతోందని, ఆమె పార్టీ మారినా, మారకపోయినా అవిశ్వాస తీర్మానం పెట్టితారుమని బెతున్నారు. బీఆర్‌ఎస్‌కు మెజారిటీ కార్పొరేటర్లున్నారని, అవసరమైతే మేయర్‌ను వ్యతిరేకించే కార్పొరేటర్లను కూడాగడతామని ధర్మారెడ్డి స్పష్టం చేవారు. మేయర్‌పై అవిశ్వాసం విషయంలో ధర్మారెడ్డి వ్యాఖ్యలు బీఆర్‌ఎస్‌లో ప్రకంపనలు సృష్టించేలా ఉండగా.. ధర్మారెడ్డితో కార్పొరేటర్ల మంతనాలు, జరుగుతున్న పరిణామాలపై బీఆర్‌ఎస్ అధిష్టానం ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

# మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



- సుమారు 80వేల బస్తాల వరకు అమ్మకానికి
- కళకళలాడిన మిర్చి యార్డులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. ఈ సీజన్‌లోనే ఎన్నడూలేని విధంగా సోమవారం సుమారు 80వేల బస్తాల అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌కు ఐదు రోజులపాటు వరుస సెలువులు రావడం, మరోపక్క సమ్మక్క, సారలమ్మ జాతరకు డబ్బుల అవసరం పడి తమ మిర్చి బస్తాలను అమ్మకానికి తీసుకువచ్చినట్లు రైతులు తెలిపారు. దీంతో మిర్చి యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శనమిచ్చాయి. కాగా, మార్కెట్‌కు ఐదు రకాల మిర్చి అమ్మకానికి వచ్చింది. తేజ రకం క్వింటాకు రూ.21వేయి, వండర్‌హాట్ రూ.21,500, యూఎస్.341 రూ.20,500, దీపిక రూ. 20వేలు, దేశీ రకం విర్చి రూ. 38,500లు, మిర్చిలో తాలు క్వింటాకు రూ.8,500 చొప్పున ధర పలికింది.

# పోలింగ్ శాతాన్ని పెంచాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 19: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతీవారం సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని వర్గాల ఓటర్లను ఎన్నికల్లో భాగస్వాములు చేసి ఓటు వేయించడం, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు ఎల్.రమేశ్, కె.శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారి ఎం.హరి ప్రసాద్, తహసీల్దార్లు విజయ్ కుమార్, భాస్కర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, నాయబ్ తహసీల్దార్లు సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు



జంపన్నవాగు వొడ్డున ఉన్న జంపన్నగద్దె

# సంపెంగ.. జనగంగ..

- జంపన్న రక్తతర్పణంతో మారిన సంపెంగ వాగు పేరు
- లక్షలాది మంది భక్తుల పుణ్యస్నానాలతో పులకరింత
- జోడు వంతెనలతో కుంభమేళాను మరిపించే జంపన్నవాగు
- నేడు గద్దెపైకి చేరుకోనున్న జంపన్న

7



వనదేవతలకు మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

# భక్తజన మేడారం..

## వనదేవతల దర్శనానికి తరలివస్తున్న లక్షలాది భక్తులు



మేడారం మహాజాతర బుధవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం భక్తులు భారీ సంఖ్యలో తరలొచ్చారు. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వనదేవతలను దర్శించుకోవడంతో గద్దెల పరిస రాలు రద్దీగా మారాయి. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో గద్దెల గేట్లను మూసివేసి బయట నుంచే దర్శనానికి అవకాశవిచ్చారు. వృద్ధులు, మహిళలు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి. మరోవైపు పుణ్యస్నానాలు ఆచరించే భక్తులతో జంపన్నవాగు తీరం కళకళలాడింది. - మేడారం

7





## జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!

**» 28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక**

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా... ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్టు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.

### పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.




ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటూరునాగారం ఐటీడీఏ పీవో సంతకం

### మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

### పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. విషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

### చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

## హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
# హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

**» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ**

**» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత**

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

## కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

**» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు**

**» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర**

**» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన**

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్నల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

**» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

### గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

### వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

### 825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

**» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు**

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

### టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

### ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

**» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి**

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.





## భక్తుల కోసం మినరల్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు

కాజీపేట, ఫిబ్రవరి 19: మేడారం వేళ్లే భక్తులకోసం కాజీపేటలో ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో సోమవారం కాజీపేట వాసవి క్లబ్ సభ్యులు మినరల్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రఘు మాట్లాడుతూ... బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం వినరల్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్లబ్ సభ్యులు మాదం శెట్టి సంపత్, కొడకండ్ల చంద్రశేఖర్, గంప సంపత్, మునిగేటి రాజు, చిదిరాల కిశోర్, సంతోష్ పాల్గొన్నారు.



వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేసిన వాసవీ క్లబ్ సభ్యులు

# ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం

### మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ గొప్ప పరిపాలనా దక్షుడు, కోట్లాది ప్రజల ఆరాధ్యుడని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో చత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి వినయభాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు మోటె చిరంజీవి, పులి రజనీకాంత్, జానకి రాములు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

● సుబేదారి : ప్రజల బాధను, భారాన్ని తన బాధ్యతగా స్వీకరించి ప్రజల స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు ఛత్రపత్తి శివాజీ అని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ అన్నారు. శివాజీ 394వ జయంతిని పురస్కరించుకుని బాలసముద్రంలోని ఆరె సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరె సంక్షేమ సంఘం సమీపంలో ఉన్న మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు సుమారు 200మందికి అల్పాహారం అందచేశారు.

● కాజీపేట : చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం కాజీపేటలో హిందూ వాహిణి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్ర కడిపికొండ ఆర్వోబీ నుంచి కాజీపేట చౌరస్తామీదుగా హనుమకొండకు చేరుకుంది. ఈ ర్యాలీలో పెసరు తిలక్ కుమార్, మర్కా సునీల్ కుమార్, పుష్కార్ కార్తిక్, సూర్యరెడ్డి తోపాటు ఆర్ఎస్ఎస్ నాయకుల పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వినయ్ భాస్కర్

● మడికొండ : మహరాజ్ ఛత్రపతి శివాజీ 395 జయంతిని పురస్కరించుకొని మడికొండలో సోమవారం శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివసేన సభ్యులు, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు దువ్వ వేణు, పొనగోటి వెంకట్రావు, బండ రాజు, గుడుగుల వినయ్ కుమార్, దార ధనుంజయ్, దుప్పెల్లి అరవింద్ పాల్గొన్నారు.

● ఐనవోలు : ఛత్రపతి శివాజీ జయంతిని సందర్భంగా సోమవారం వెంకటాపూరంలో శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఐనవోలు వరకు 100 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి సెంటర్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆరే క్షత్రియ సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు దామేరగిద్దే నేతాజీ ఉపాధ్యక్షుడు అంబీరు శ్రీనివాస్, కోశాధికారి మేజే చిరంజీవి, సంఘం మండల అధ్యక్షుడు కుసుంబ దేవేందర్, గౌరవ అధ్యక్షుడు మోరె సుబ్బారావుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మార్నేని మధుమతి పాల్గొని మాట్లాడారు. ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు దామెరగిద్దే శ్రీకాంత్ ఆధ్వర్యంలో వెంకటాపూరంలో మహాఅన్నదానం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు మోకిడి నరేష్, మోరే రాజు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి : ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకుని దేశ శ్రేయస్సు, రక్షణ కోసం కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. సోమవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు మారపెల్లి రాంచంద్రారెడ్డి, మేకల హరిశంకర్, తాళ్ల శ్యాంసుందర్, ఇమ్మడి కరుణాకర్, ఆలేటి సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

## కేయూ అడ్జంట్ ప్రొఫెసర్లకు హైకోర్టు నోటీసులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 19 : కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న 16 మంది రిటైర్డ్ అడ్జంట్ ప్రొఫెసర్లకు రాష్ట్ర హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. 2023 ఫిబ్రవరిలో యూజీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఉల్లంఘించి వర్సిటీలో అడ్జంట్ ప్రొఫెసర్లగా నియమితులయారని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అడ్జంట్ ప్రొఫెసర్లతో కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లు, రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

## నేడు నగరానికి సిరిసిల్ల రాజయ్య

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 19 : స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మంగళవారం నగరానికి రానున్నారు. ఇటీవలే ఆయన పదవి బాధ్యతలు చేపట్టిన సంగతి విధితమే. ఈ దశలో ఆయన తొలి సారిగా వరంగల్‌కు వస్తున్నారు.

## న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడి మృతి



రామారావు (ఫైల్)

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 19: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాంమ్రేడ్ రామారావు అలియాస్ కూరపాటి లింగమూర్తి (65) సోమవారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. గత పది రోజులగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు జిల్లా కమిటీ వెల్లడించింది. అమరుడైన లింగమూర్తికి జిల్లా కమిటీ విప్లవ జోహార్లు అర్పించింది. వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన లింగమూర్తి కార్మిక విప్లవ ఉద్యమంలో పని చేశారు. ప్రింటింగ్ అండ్ బైండింగ్ వర్కర్స్ యూనియన్ మొదలుకుని అజంజాహి మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడిగా పని చేశాడు. చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలో వ్యవసాయక విప్లవోద్యమ నిర్మాణం కోసం వరంగల్, ఖమ్మం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాల్లో పని చేశారు. ప్రభుత్వ నిర్బంధానికి గురై అనేకసార్లు జైలుకు వెళ్లి తిరిగి వచ్చారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం రహస్యంగా పని చేస్తూ హైదరాబాద్, నిజామాబాద్, పశ్చిమగోదావరి జిల్లాలో విప్లవ, ప్రజాసంఘాల నిర్మాణం కోసం పని చేశారు. విజయవాడలో రామారావుగా పేరు మార్చుకుని పార్టీ కార్యదర్శిగా ఐఆఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కమిటీ మెంబర్‌గా పని చేశారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో అమరత్వం పొందాడని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు వెల్లడించారు. హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు జరుగుతాయని పార్టీ వెల్లడించింది. జిల్లా, రాష్ట్ర పార్టీ తరుపున పలువురు నాయకులు లింగమూర్తికి విప్లవాభివందనాలు ప్రకటించారు.

## కేఎంసీ కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 19: కాకతీయ మెడికల్ కాలేజీలో నూతనంగా ప్రారంభించే మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్‌లో సైంటిస్ట్ బీ, సైంటిస్టు సీ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు అనుభవం గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 15లోగా దరఖాస్తులు కాలేజీ వెబ్‌సైట్‌లో సమర్పించాలని తెలిపారు.

## హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని నిట్ స్కాలర్స్ ధర్నా

కాజీపేట, ఫిబ్రవరి 19: నిట్ స్కాలర్స్‌కు హౌస్ రెంట్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చూస్తూ సోమవారం నిట్ పీహెడీ స్కాలర్స్ ధర్నా చేశారు. అడ్మిషన్ ఫార్మాట్‌లో హెఆర్‌ఏ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇవ్వకుండా తమను అన్యాయానికి గురిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్స్ ధర్నా నిర్వహించిన అనంతరం నిట్ డైరెక్టర్ బిధ్యాధర్ సుబుధికి వినతి పత్రం అందజేశారు.

## వేయిస్తంభాల గుడికి హుండీల బహూకరణ

హనుమకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన కోమాకుల చేతన్ ఆనంద్ శ్రావణి వారి తల్లిదండ్రులు కోమాకుల వెంకటేశ్వర్లు, సుజాత దంపతులు రూ.1.20 లక్షల విలువ చేసే హుండీలను కానుకగా సోమవారం అందచేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ సమక్షంలో ఈవోకు వీటిని అందచేశారు. శివరాత్రి ఉత్సవాల్లో భక్తులు కానుకలు సమర్పించేందుకు ఈ హుండీలు ఎంతో ఉపయోగపడతాయని ఈ వో తెలిపారు.

## నిట్, ఎంఎస్ఎంఈ మధ్య అవగాహన ఒప్పందం

కాజీపేట, ఫిబ్రవరి 19 : నిట్ వరంగల్, మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) మధ్య సోమవారం ఎంఓయూ కుదిరింది. ఈ మేరకు నిట్ డైరెక్టర్ బిధ్యాధర్ సుబుధి, హైదరాబాద్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప ఎంఓయూపై సంతకాలు చేసి ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ ఎంఓయూతో అధ్యాపకులు, విద్యార్థుల కోసం ఓరియంటేషన్, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ప్రొఫెసర్‌లు తెలిపారు. అంతకుముందు నిట్‌లో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ నిర్వహించారు.

## ఉద్యోగ కల్పనకు కృషి

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 19: ఎంజీఎం ఆస్పత్రిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని తెలంగాణ ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ 3194) నేత బత్తిని సుదర్శన్‌గౌడ్ తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రికి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బీఆర్ఎస్ అనుబంధ కార్మిక విభాగానికి రాజీనామా చేసి ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘంలో ఎంజీఎం బ్రాంచ్ అధ్యక్షురాలు జి.ప్రేమలత ఆధ్వర్యంలో 50 మంది సోమవారం చేరారు. కార్తీక్, ఫయిజ్ మొయినుద్దీన్, వీరేందర్, సిద్దయ్యచారి, గౌతమ్, రతన్, బిల్లా నవీన్ పాల్గొన్నారు.


## బదిలీ అధికారుల కృషి అభినందనీయం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 19: జిల్లాలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్, డీపీవో జగదీశ్వర్, డీటీసీ పురుషోత్తంలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బదిలీపై వెళుతున్న అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌వో వైవి.గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, ఆర్డీవో ఎల్.రమేష్, స్వీప్ నోడల్ అధికారి ఎం.హరిప్రసాద్, జిల్లా అధికారులు రాంరెడ్డి, మాధవీలత, చంద్రశేఖర్, అశోక్ కుమార్, శంకరయ్య, మధురిమ, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణరెడ్డి, వెంకటనారాయణ, వసంతలక్ష్మీ, నీరజ, సత్యనారాయణ, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మేడారానికి తరలిన బల్దియా సిబ్బంది

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 19 : పారిశుధ్య విధుల నిర్వహణకు వరంగల్ మహానగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది మేడారానికి తరలారు. సోమవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. మేయర్ గుండు సుధారాణి జెండా ఊపీ బస్సులను ప్రారంభించారు. 550 పారిశుద్ధ్య కార్మికులు, 30 మంది జవాన్లు, ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లు, స్వచ్ఛ ఆటోలు, టిప్పర్లు మేడారానికి కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

## డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్



కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 19: హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్‌గా డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ నుంచి బదిలీపై హనుమకొండకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వాహన యజమానులకు సకాలంలో సత్వర సేవలు అందించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు.

## ఎంపీ రవిచంద్రను సత్కరించిన మాజీ మంత్రి

హనుమకొండటౌన్, ఫిబ్రవరి 19: ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు రాజ్యసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారు కావడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ రవిచంద్రను సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి హైదరాబాద్‌లో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



రవిచంద్రను సత్కరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

## సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలి

● నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుద్ధి

● ఘనంగా మాంటిస్సోరి ప్రైమ్ స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 19: విద్యార్థులు జీవితంలో సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుద్ధి అన్నారు. సోమవారం ఎల్లాపూర్ వద్ద గల మాంటిస్సోరి ప్రైమ్ స్కూల్ వార్షికోత్సవం ఘన ంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. పరిసరాలపై అవగాహన పెంచుకుని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు అనంతరం పాఠశాల చైర్మన్ జోస్ నెడుంతుండం మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. పాఠశాల అధ్యక్షుడు గండ్ర సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీన్ జోస్, డైరెక్టర్లు బైజు వర్గీస్, నూకల శ్రీనివాసరావు, గండ్ర హరీష్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మేడారంలో మాస్కుల పంపిణీ

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 19 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం మేడారం జాతరలో మంత్రి సీతక్క సమక్షంలో మాస్కులను పంపిణీ చేశారు. ఐఎంఏ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో అవసరమై 50 వేల ప్రిస్క్రిప్షన్ పాడ్స్ అందజేసినట్లు తెలిపారు. ములుగు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శభరీస్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయ్ రావు, డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్, డాక్టర్ అప్పయ్య, డాక్టర్ మహ్మద్ అన్సర్, డాక్టర్ బింగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




మాస్కులు పంపిణీ చేస్తున్న ఐఎంఏ సభ్యులు

# హనుమకొండలో బాంబు పేలుళ్ల కలకలం

● బండరాళ్లు పడి కారు, బైక్ ధ్వంసం..

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 19: హనుమకొండలో రహస్యంగా జరుపుతున్న కట్టడాల్లో బాంబుపేలుళ్లు జరిగాయి. ఎవరికీ అనుమానం రాకుండా గేట్లకు తాళాలు వేసి ఆరు మాసాలుగా బండరాళ్లు పేలుస్తుండగా.. ఆదివారం జరిగిన భారీ పేలుళ్లలో పెద్దపెద్ద రాళ్లు ఎగిరి పక్కనే ఉన్న పిల్లల ఆసపత్రి ఎదుట ఉన్న కారు, ద్విచక్రవాహనంపై పడ్డాయి. ఈ ఘటనలో వాహనాలు కారు, బైకు దెబ్బతినగా.. ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. హనుమకొండ పోలీసు స్టేషన్ వెనుక భాగంలోని కాకాజీకాలనీ, జాశేశ్వరాలయం సమీపంలో హైదరాబాద్‌కు చెందిన ఓ పెద్ద పారిశ్రామికవేత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు గత ఆరు మాసాలుగా భూమిలో ఉన్న బండరాళ్లను తొలగించే పనిలో ఉన్నాడు. కొందరు మనుషలను ఏర్పాటు చేసుకుని ముందుగా అక్కడ చేసే పనులు ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు చుట్టూ రేకులతో ఎత్తుగా ప్రహరీ నిర్మించాడు. ఎవరికీ అనుమానం రాకుండా కొద్ది రోజులుగా రాళ్లను పేలుడు పదార్థాలతో పేలుస్తూ రాళ్లు గాలిలోకి ఎగురకుండా పెద్ద టైర్లను పేలుడు సంభవించే ప్రదేశంలో పెడుతున్నారు. అయినా పెద్దగా జరిగే పేలుడ వల్ల టైర్లను సైతం గాలిలోకి లేపి కింద పడవేస్తున్నట్టు గతంలో చుట్టుపక్కల ఉండే వారు 100 డయల్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని మిన్నకుండిపోయారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఏర్పాటు చేసిన బ్లాస్టింగ్‌లో పెద్దగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పెద్ద పెద్ద రాళ్లు చుట్టుపక్కల ఉన్న ఇళ్లు, కార్లపై ప డ్డాయి. ఈ పేలుడు శబ్దానికి చుట్టుపక్కల ఉన్న వారు బయటకు వచ్చి చూసి నివ్వెర పోయారు. ఈ ఘటనలో పక్కనే ఉన్న న్యూ డాల్ఫిన్ పిల్లల ఆస్పత్రి ఎదుట పార్కింగ్ చేసిన కారు, ద్విచక్రవాహ నం ధ్వంసమైయ్యాయి. వెంటనే ఆస్పత్రి డైరెక్టర్ కూచన సురేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. విచారణ కోసం అక్కడకు వెళ్లిన పోలీసులను సైతం కార్మికులు, సూపర్‌వైజర్ ఎదురుతిరిగి దురుసుగా ప్రవర్తించినట్టు చెప్పారు.



ధ్వంసమైన కారు అద్దాలు

# అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే నాయిని

వడ్డెపల్లి, ఫిబ్రవరి 19: అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని విశాల్ భవన్‌లో గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ రాఘవేంద్రనగర్ ఫేస్-2 అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొత్త కనకయ్య, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్‌రెడ్డిలు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాకప్పి సత్కరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు ఎస్టిమేట్లను వేయాలని మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సవిన్నరెడ్డి, అంజన్‌రావు, రాధాకృష్ణ, ఆర్.రాధాకృష్ణ ఉన్నారు.



ఎమ్మెల్యే నాయినికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ కమిటీ బాధ్యులు

## వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే



సమ్మక్క, సారలమ్మ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్, ఫిబ్రవరి19 : మండలంలోని నారాయణగిరి సమ్మక్క, సారలమ్మ దేవతలను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతరకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆయా సంబంధింత శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చే జాతర వరకు ఊరి నుంచి గుడి వరకు సీసీ రోడ్డు, లైటింగ్, అమ్మ వారి గద్దెల వరకు గచ్చు, టాయిలెట్స్, నీటి వసతులను ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన హైమ్యాక్స్ లైట్లను ఆయన ప్రారంభించిజాతర ఏర్పాట్ల కోసం కృషి చేసిన దాతలను ఆయన అభినందించారు. జానకీపురంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుర్సపెల్లిశ్రీధర్, అదే ప్రమాదంలో గాయాపడిన కుర్సపెల్లి అరుణ్ కుటుంబ సభ్యలను ఎమ్మెల్యే పరామర్శించారు. రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, రమేష్, రాజు, జాతర నిర్వహకులు పాల్గొన్నారు.

## జాతరకు రావాలని ఎమ్మెల్యే నాగరాజుకు ఆహ్వానం



ఎమ్మెల్యే నాగరాజుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ధర్మకర్తలు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 19: కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారు దామెరగుట్ట (ఉర్సు)ల వద్ద గల అమ్మవారిపేటలో ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును జాతర కమిటీ ధర్మకర్తలు ఆహ్వానించారు. సోమవారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జాతర ధర్మకర్తలు దాసి రాందేవ్, ఆవునూరి రాంమూర్తి, బొరి నాగరాజు, భైరి హరినాథ్, ఆవునూరి కుమారస్వామి, నవీన్, ఆవునూరి రామన్న, రాజేష్, గోపి, చింత ప్రకాశ్, స్వామి ఉన్నారు.

# వరంగల్ పోలీసులకు గుర్తింపు తీసుకురావాలి

● వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ● శిక్షణకు వెళుతున్న కానిస్టేబుళ్లతో సమావేశం



అభ్యర్థుల కిట్లు పరిశీలిస్తున్న సీపీ, పోలీసు అధికారులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 19 : వరంగల్ పోలీసులకు కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చే విధంగా శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి రావాలని కానిస్టేబుల్ శిక్షణకు వెళుతున్న అభ్యర్థులకు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు. స్టైఫండరీ ట్రెయినీ కానిస్టేబుళ్లగా ఎంపికై తొమ్మిది మాసాల శిక్షణ కోసం వెళుతున్న అభ్యర్థులతో కలిసి సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీ అంబర్ కిశోర్ ఝా హాజరై మాట్లాడారు. అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. మొత్తంగా 658 మంది అభ్యర్థులను కానిస్టేబుళ్లగా ఎంపిక చేయడం జరిగిందని ఇందులో 472 మంది పురుషులు, 186 మంది మహిళలు ఉన్నారన్నారు. అభ్యర్థులు తెలంగాణ పోలీసు అకాడమీతో పాటు అంబర్‌పేట, మేడ్చెల్, యూసుఫ్‌గూడా పోలీసు ట్రెయినీ కళాశాలలో 9 నెలల శిక్షణ పూర్తి చేయాలని చెప్పారు. శిక్షణా కాలంలో శారీరకంగా, మానసికంగా, వివిధ అంశాలపై అవగాహన కల్పించే తరహాలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం అభ్యర్థులకు అందించే శిక్షణ కిట్ (సామాగ్రి)ని పోలీసు అధికారులతో కలిసి సీపీ పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీధర్, సృజన్‌లు పాల్గొన్నారు.

### డీజీపీని కలిసిన సీపీ అంబర్ కిశోర్ ఝా

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పరిశీలన కోసం వచ్చిన రాష్ట్ర డీజీపీ రవిగుప్తను సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కలిశారు. హనుమకొండలోని పోలీసు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు డీజీపీకి గౌరవ వందనం చేశారు. డీజీపీ వెంట ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి ఉన్నారు. డీజీపీని కలిసిన వారిలో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, ఎస్బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఉన్నారు.



# సంపెంగ... జనగంగ!

- లక్షలాది మంది భక్తుల పుణ్యస్నానాలతో పులకరింత
- జోడు వంతెనలతో కుంభమేళాను మరిపించే జంపన్నవాగు
- నేడు గద్దెపైకి చేరుకోనున్న జంపన్న

మేడారం, ఫిబ్రవరి 19: మేడారం మహాజాతరలో తొలి మొక్కు జంపన్నకే. పుణ్యస్నానాలతో పాటు శివసత్తుల పూనకాలతో జంపన్నవాగు ఊర్రూతలూగుతుంది. జాతరకు వచ్చే ప్రతీ భక్తుడు జంపన్నవాగులో స్నానాలు చేసి, పక్కనే ఉన్న ఉన్న జంపన్న గద్దె వద్ద జాతరకు వచ్చే భక్తులు తొలి మొక్కు కూడా చెల్లిస్తారు. జాతరలో మొదట మంగళవారం గద్దెకు వచ్చేది కూడా జంపన్ననే.

### రక్తతర్పణంతో సంపెంగ వాగు..

కాకతీయులకు కప్పం కట్టలేని పరిస్థితులు ఎదురవడంతో ఆ రాజ్యంపై ప్రతాపరుద్రుడి కాలంలో మంత్రి యుగేంద్రుని ఆదేశాల మేరకు యుద్ధం ప్రకటించారు. ఈ యుద్ధంలో సారలమ్మ, పగిడిద్దరాజులు వీరమరణం పొందారు. సమ్మక్క చిలుకలగుట్టపైకి నెమలినార చెట్టు దగ్గర అదృశ్యమైనట్లుగా చెబుతారు. అయితే కాకతీయులతో వీరోచిత పోరాటం చేసిన జంపన్నకు తీవ్ర గాయాలవుతాయి. కాకతీయ సేనలను తుద ముట్టిస్తూనే తీవ్రగాయాలై పక్కనే ఉన్న సంపెంగ వాగులో పడి వీరమరణం పొందుతారు అనేది ప్రాచుర్యంలో ఉంది. దీంతో సంపెగ వాగు జంపన్న రక్తంతో ఎరుపు ఎక్కుతుంది. వీరుడికి మరణం ఉండదు.. ఉండకూడదు అని ఆదివాసీలు సంపెంగ వాగును జంపన్నవాగుగా నామకరణం చేసుకున్నారు. అప్పటి నుంచి సంపెంగ వాగు కాస్తా జంపన్నవాగుగా మారిందని ప్రచారంలో ఉంది. అలాగే జాతరలో తొలి రోజు బుధవారం సారలమ్మ గద్దెకు చేరుతుంది. మేడారం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి నుంచి సారలమ్మను బుధవారం సాయంత్రం గద్దెపైకి తీసుకవస్తారు. ఈ సమయంలో జంపన్నవాగుపై రెండు వంతెనలు ఉన్నా ఆదివాసీల సంప్రదాయం ప్రకారం జంపన్నవాగు నీళ్ల నుంచే నడుచుకుంటు సారలమ్మను గద్దెపైకి తీసుకవస్తారు. గద్దెకు చేరే సమయంలో సారలమ్మ తన తమ్ముడు జంపన్నను పలకిరిస్తూ వస్తుందని ఆదివాసీల విశ్వాసం.



జంపన్నవాగు పొడ్డున ఉన్న జంపన్నగద్దె

జంపన్న రక్తతర్పణంతో మారిన సంపెంగవాగు పేరు



జంపన్నవాగు జోడు వంతెనల వద్ద భక్తులు (ఫైల్)

### జోడు వంతెనలపై భక్తుల జోష్

మేడారం జాతరకు వచ్చే భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తా రు. 2002 జాతరకు ముందు జంపన్న వాగుపై ఎలాంటి వంతెనలు లేవు. దీంతో భక్తులు వాగు దాటి జాతరకు వచ్చేవారు. తాత్కాలికంగా పైపులను అమర్చి, వాటిపై ఇసుక బస్తాలను వేసి రోడ్డు వేసేవారు. అయితే 2002 లో అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.1.89 కోట్లతో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో నక్సలైట్లు అడ్డుకు న్నా స్థానికుల సహకారంతో 37 రోజు ల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. దీంతో భక్తుల రాకపోకలు పెరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకోని 2014లో మరో వంతెనను కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో 37రోజుల్లోనే నిర్మించారు. ఈ జోడు వంతెనలు మహజాతరకు వన్నె తెస్తున్నాయి. కాగా, ఈ జోడు వంతెనల నుంచి ఏటు చూసిన ఐదా రు కిలో మీటర్ల మేర భక్తులతో జంప న్నవాగు జనగంగగా మారుతుంది. ఇసుకేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసి పోతుంది. జంపన్నవాగుకు ఇరువైపు భక్తజనంతో పాటు శివస త్తుల సమ్మక్క అబ్బియో పూనకాలతో జంపన్నవాగు ఉప్పొంగుతుంది.



జంపన్న గుడిలో పూజలు చేస్తున్న పూజారి

### కన్నెపల్లి నుంచి గద్దెకు చేరనున్న జంపన్న..

జాతరలో తొలి ఘట్టం మంగళవారం మొదలు కానుంది. పోలేబో యిన వంశీయులు జంపన్నను గద్దెపైకి తీసుకవస్తారు. కన్నెపల్లి గ్రామంలోని పోలేబోయిన సత్యం ఇంట్లో పడిగే రూపంలో కొలువైన ఉన్న జంపన్నను ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయల ప్రకారం పూజలు నిర్వహించి అలంకరిస్తారు. ఆనంతరం డోలు, వాయిద్యాలు, ధూపదీపంతో వైభవంగా జంపన్న మంగళవారం సాయంత్రం గద్దెకు చేరుకుంటారు. జంపన్నవాగు ఒడ్డుపైన ఉన్న జంపన్న గద్దెపైకి చేర్చి భక్తులు పూజలు నిర్వహిస్తారు. సంతానం కోసం జంపన్నకు భక్తులు తొట్టెలు కట్టి.. ముడుపులు చెల్లిస్తారు. సంతానం కలగాలని మహిళలు వరం పడుతుంటారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసిన తరువాత తొలి మొక్కు జంపన్నకే చెల్లించుకుంటారు. ఆ తరువాతే గద్దెల వద్ద తల్లుల దర్శనానికి భక్తులు వెళ్లటం అనవాయితీగా వస్తోంది.

### భక్తుల కోర్కెలు తీర్చే దైవం జంపన్న..

**పోలెబోయిన సత్యం, జంపన్న ప్రధాన పూజారి**



మేడారం వచ్చే భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, జంపన్న గద్దె వద్ద తొట్టి కట్టి ముడిపులు చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని విశ్వసిస్తారు. మేడారం గద్దెలతో పాటు జంపన్న గద్దెల ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేయాలి.



# అప్డేట్ కాని మేడారం పోర్టల్

- జాతర తేదీలు మాత్రమే కొత్తవి.. వివరాలన్నీ పాతవే..
- ముఖ్యమంత్రి ఫొటో మాత్రమే మార్పు
- మారని కీలక కార్యక్రమాలు, సేవల సమాచారం

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 19 : మేడారం మహాజాతరకు సంబంధించిన అధికారిక పోర్టల్ ఇంకా అప్డేట్ కాలేదు. పాత వివరాలే ఇంకా దర్శనమిస్తున్నాయి. జాతర ప్రాముఖ్యత, తేదీలు, ఆన్‌లైన్ దర్శనం, ప్రసాదం సేవలు తదితర అంశాలు పాతవే కనిపిస్తున్నాయి. గూగుల్‌లో మేడారం జాతర అని సర్చ్ చేస్తే ముందుగా కనిపించేది ఈ వెబ్‌సైట్. సర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్‌లో ఇది మొదటి స్థానంలో ఉంది. అంతటి ప్రాధాన్యమున్న ఈ సైటులో ప్రస్తుత జాతర వివరాలు అప్డేట్ చేయకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### తేదీలు కొత్తవి.. డేటా పాతదే..

మేడారంజాతర.కమ్ పేరుతో ఉన్న వెబ్‌సైట్ ప్రస్తుత జాతరకు సంబంధించి తేదీలను మాత్రమే అప్డేట్ చేశారు. తేదీల వారీగా వాటిపై క్లిక్ చేస్తే ఆ రోజు జాతరలో ప్రత్యేకత, జరిగే కార్యక్రమాల గురించి పూర్తి సమాచారం ఉండాలి. అయితే.. ఆ వెబ్‌సైట్‌లో ప్రస్తుత జాతర తేదీలు ఉన్నా వాటిపై క్లిక్ చేస్తే 2022 జాతరకు సంబంధించిన వివరాలే దర్శనవిస్తున్నాయి. ఇవే కాకుండా జాతరకు సంబంధించి ఏ శాఖకు ఎంత బడ్జెట్ కేటాయించరనే వివరాలు సైతం పాతవే కనిపిస్తున్నాయి.

### 'అప్డేట్ సూన్'.. అన్నింటికీ ఇదే ట్యాగ్

భక్తుల వసతికి సంబంధించి జాతర పోర్టల్‌లో హరిత హోటల్‌తో పాటు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గుడారాల ద్వారా రూములను అద్దెకు ఇస్తారు. వీటితో పాటు ప్రత్యేక సూట్స్‌ను అందుబాటులో ఉంచుతారు. అయితే.. వీటికి సంబంధించిన డేటా కూడా అప్డేట్ చేయలేదు. వీటితోపాటు జాతరలో కీలక బాధ్యతలు నిర్వర్తించే పోలీసు, మెడికల్, ఆర్టీసీ శాఖలకు సంబంధించి హెల్ప్‌లైన్ నంబర్లు కూడా అందుబాటులోకి రాలేదు. టోల్‌ఫ్రీ నంబర్ల స్థానంలో కూడా అప్డేట్ సూన్ అనే ట్యాగ్ తగిలించి వదిలేశారు. ఈ పోర్టల్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు, ఫొటో మాత్రం అప్డేట్ చేశారు. కానీ పోర్టల్, దానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన మొబైల్ యాప్ కూడా పాతదే ఉండటం.. అందులోనూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోనే దర్శనమివ్వడం జాతర పట్ల ఆ శాఖ అధికారులకు ఉన్న ఆసక్తి ఎమిటనేది స్పష్టమవుతోంది. ఆన్‌లైన్ యుగంలోనూ జాతర పోర్టల్ ఆఫ్‌లైన్‌గానే మిగిలిపోవడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం జాతర అప్డేట్స్‌నూ జాతర పేరుతో ఉన్న ఎక్స్, ఫేస్‌బుక్ సోషల్ తదితర మీడియా ప్లాట్‌ఫాంలోనూ అపేట్స్ ఇవ్వలేదు.

### అప్డేట్ చేస్తే ఎంతో ప్రయోజనం

మేడారంజాతర.కమ్ పోర్టల్‌లో జాతర ప్రాశస్త్యం, ప్రస్తుత తేదీలతోపాటు మేడారంలో ఉన్న వసతులు, ఎక్కడెక్కడ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయనే వివరాలు అప్డేట్ చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భక్తులు అంటున్నారు. పోర్టల్‌లో జాతర ప్రసాదం, వనదేవతల సేవలకు సంబంధించిన డైరెక్ట్ లింకులు లేదా మీ-సేవా ద్వారా బుక్‌చేసుకునే విధానం అప్డేట్ చేయాలని అంటున్నారు. ఆర్టీసీ బస్సుల వివరాలు, ఏరూట్లో ఎన్ని సర్వీసులు ఉన్నాయి.. ఒక్కో భక్తుడికి మేడారం చేరుకునేందుకు ఎంత ఖర్చు? అనే వివరాలు పొందుపర్చాలని కోరుతున్నారు. జాతరలో హెలిక్యాప్టర్ సేవలు అందుబాటులో ఉన్న దృష్ట్యా వాటి వివరాలు కూడా పోర్టల్‌లో అప్డేట్ చేస్తే ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జాతర కోసం పోలీసుల ప్రత్యేక యాప్




తాడ్వాయి, ఫిబ్రవరి 19: ఈనెల 21నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర కోసం ములుగు జిల్లా పోలీసు శాఖ భక్తుల భద్రత, సౌలభ్యం కోసం విస్తృత ఏర్పాట్లు చేసింది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక మొబైల్ యాప్‌ను హైదరాబాద్‌కు చెందిన విమాక్స్ ఈ-సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా రూపొందించింది. మేడారం వచ్చే భక్తులకు తెలియాల్సిన వివరాలు, ప్రయాణం, సూచనలు తదితర అంశాలు ఉంచారు. అందరికీ అర్థమయ్యేలా ఈ యాప్ తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుంది.

### యాప్‌లోని అంశాలు...

మేడారం జాతర విశిష్టత, చరిత్ర, జాతర కార్యక్రమ సరళి, తేదీలు, రోజువారీ కార్యక్రమాల వివరాలతోపాటు జాతర జరిగే నాలుగురోజుల్లో ఉండే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండడానికి సొంత, ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులకు వేర్వేరు మార్గాలు, అలాగే రావడానికి, తిరిగి వెళ్లడానికి వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి సొంత, ప్రైవేట్ వాహనాల ద్వారా వచ్చేవారు ఏయే మార్గాల ద్వారా రావచ్చు, ఎక్కడి నుంచి ఎంతదూరం ఎక్కడెక్కడా దారి మళ్లింపులు ఉంటాయి, ఏ మార్గాల ద్వారా వచ్చేవారికి ఏ పార్కింగ్ స్థలాలు అందుబాటులో ఉంటాయి, ఏమార్గం ద్వారా వచ్చిన వారు తిరిగి ఏ మార్గం ద్వారా తమ గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు అనే వివరాలు పొందుపర్చారు. దారిలో పాటించాల్సిన సూచనలు, మ్యాప్‌లు, ప్రస్తుత స్థానం నుంచి ప్రత్యక్ష గూగుల్ మ్యాప్ ద్వారా మేడారం చేరుకోవడానికి దారి సూచనలు ఉంచారు. అలాగే మేడారం చుట్టుపక్కల ఉన్న 30 కిలో మీటర్లకుపైగా పార్కింగ్ స్థలాలను భూ ఉపరితలాన్ని అనుసంధానం చేసి (జియో ట్యాగింగ్) యాప్ వాడేవారు ఉన్న స్థలం నుంచి అక్కడికి గూగుల్ మ్యాప్ ద్వారా చేరుకునేవిధంగా సూచనలు అందించడం, పార్కింగ్ సామర్థ్యం, పార్కింగ్‌స్థలం విస్తీర్ణత వంటి అంశాలు, ఆపార్కింగ్ స్థలం నుంచి అమ్మవార్ల గద్దెలకు సుమారు దూరం, పార్కింగ్ స్థలాల నుంచి ఆర్టీసీవారు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సదుపాయం నుంచి సుమారు దూరం వంటి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచారు.

అలాగే ఆర్టీసీ బస్సుల ద్వారా, రైలుమార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచారు. భక్తులు ముఖ్యంగా తెలుసుకోవాల్సిన జాతర ప్రదేశాలైన జంపన్నవాగు, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, అమ్మవార్ల గద్దెల దర్శనం, క్యూలైన్ల వివరాలు ఉన్నాయి. అదేవిధంగా తప్పిపోయే వారి సహాయార్థం ఈసారి ప్రత్యేకంగా సహాయ, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి వారి ఫొటోలు, వివరాలు తెలుపడానికి అతిపెద్ద తెరలను భక్తులకు కనపడేవిధంగా పలు ప్రదేశాలలో ఏర్పాటుచేసి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పర్యవేక్షించనున్నారు. అటువంటి సహాయక కేంద్రాల వివరాలు, అదేవిధంగా ఎవరైనా తమ వారు తప్పిపోయినా, తప్పిపోయిన వారు కనిపించినా ఈయాప్ ద్వారా ఫొటో, వారి ప్రదేశం వివరాలతో సమాచారం అందించొచ్చు. ఇవే కాకుండా భక్తులకు ఏమైనా ఇబ్బందులు, సంఘటనలు ఎదురైతే వాటిని కూడా పోలీసులకు ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. జాతర ప్రాముఖ్యత, రద్దీ దృష్ట్యా పౌరులు ఎలాంటి జాగ్రత్తలు ట్రాఫిక్‌పరంగా, భద్రతపరంగా తీసుకోవాలి, ఒక్కసారి ఈయాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినా వీలైనంత ఎక్కువ సమాచారాన్ని చూడగలిగేలా, జాతర పరిసరాల్లో ఉన్న పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ పార్కింగ్, జంపన్నవాగు, దర్శనం ప్రదేశాల మధ్య దారిని ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే చూసుకునేలా ఈ యాప్‌ను రూపొందించారు. జాతర సమయంలో వచ్చే భక్తులకు అధిక రద్దీ కారణంగా ఇంటర్నెట్ కనెక్షన్, మొబైల్ సిగ్నల్స్ లేకున్నా జాతర ముఖ్య ప్రదేశాల మధ్య ఇది దారి చూపించడం ఉపయోగకరంగా ఉంటుంది.

మేడారం ప్రవేశం, నిష్క్రమణ, చుట్టుపక్కల ప్రదేశాల మార్గాలు, రహదారులు సూచించే మార్గసూచిక మ్యాప్, అత్యవసర సమాచారం, సలహాలు, సూచనలు అందించడం, ఇతరులకు పంచుకోవడం వంటి సదుపాయాలతోపాటు ఎప్పటికప్పుడు పోలీసులు పౌరులకు నేరుగా సమాచారం అందించడానికి వీలుగా ప్రకటనల శీర్షికను కూడా పొందుపర్చారు.

## జంపన్నవాగు వద్ద గజ ఈతగాళ్లు సిద్ధం



జంపన్నవాగు వద్ద సిద్ధంగా ఉన్న గజ ఈతగాళ్లు

తాడ్వాయి, ఫిబ్రవరి 19: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని మత్స్యశాఖ ఆధ్వర్యంలో 200 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు మహాజాతరకు కోటికిపైగా భక్తులు తరలిరానుండడంతో భక్తులు పవిత్ర స్నానాలు చేసేందుకు జంపన్నవాగులోకి దిగడం ఆనవాయితీ. ఇందులో భాగంగా భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు వాగులో లోతైన ప్రదేశాల్లో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. కొంగలమడుగు, పడిగాపురం, ఊరట్టం, మేడారం, కన్నెపల్లి, తదితర ప్రాంతాల్లో గల జంపన్నవాగు వెంట గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ఏది ఏమైనప్పటికీ ఈ జాతరలో పుణ్యస్నానాలు చేసే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన రెస్క్యూటీంలో బయ్యక్కపేట గ్రామానికి చెందిన పిట్టల రాజేష్, రాకేష్, రాజు, రజనీకాంత్, రంజిత్, చందు, చొప్పరి హరీశ్, శ్రీకాంత్, పెద్దబోయిన సమ్మయ్య తదితరులు ఉన్నారు.

# జాతరలో దొంగల గ్యాంగులు

- ఇప్పటికే 16 చోట్ల చేతివాటం
- పోలీసుల అదుపులో 22 మంది అనుమానితులు
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిష్టవేసిన దొంగలు
- చిరు వ్యాపారుల ముసుగులో జేబుదొంగలు
- అప్రమత్తత అవవసరమంటున్న పోలీసులు



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 19 : వారు మంచి మంచి దుస్తులు వేసుకుని హుందాగా కనిపిస్తారు. వారిని చూసి దొంగలు అని ఎవరూ ఊహించలేరు. అలాంటి వ్యక్తులు రద్దీ ఉన్న ప్రాంతాలను ఎంచుకుని భక్తులతో కలసిపోతారు. అందరు నమ్మే విధంగా నటిస్తూ చివరికి అందిన కాడికి దోచుకుంటారు. ఇదంతా మేడారం జాతరలో దొంగల ముఠాలు ఎంచుకున్న మార్గం. మేడారం జాతర వస్తుండంటే తెలంగాణ రాష్ట్రంతో పాటు చుట్టు పక్క రాష్ట్రాల నుంచి దొంగతనాల్లో ఆరితేరిన కొందరు ముఠాలుగా ఏర్పడి ఇక్కడకు ముందుగానే చేరుకుని చేతివాటం చూపిస్తారు. అయితే ఇప్పటికే జాతరలో బంగారం, పర్సులు, సెల్‌ఫోన్లు, బ్యాగులు, బంగారు గొలుసుల దొంగతనాలకు పాల్పడే మగ, ఆడ దొంగల గ్యాంగులు జాతరలో ప్రవేశించినట్టు మేడారం సీసీఎస్, నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ నెల 21న సారలమ్మ 22న సమ్మక్క తల్లుల గద్దెలపై ఆసీనులు కావడం 23న భక్తులు మొక్కులు ముట్టజెప్పే ఘట్టం మొదలు కావడానికి కొద్ది రోజుల మాత్రమే ఉన్నాయి. ఈ మూడు ప్రధాన రోజుల్లో భక్తులు మొక్కులు సమర్పించుకునే హడావుడిలో ఉంటే.. దొంగలు తమ చేతివాటం చూపించే అవకాశాలు మెండుగా ఉన్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులు పోగొట్టుకున్న తర్వాత చేసేదేం ఉండదని సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు భక్తులు ఉంటున్న ప్రదేశాల్లో సంచరిస్తే 100 డయల్ గానీ మేడారం సీసీఎస్ ఔట్‌పోస్టులో గానీ సమాచారమివ్వాలని సూచిస్తున్నారు.

### పాత దొంగల అరెస్టు.. నిఘా బృందాల ఏర్పాటు..

ఈ సారి మేడారం జాతరలో దొంగలకు చెక్ పెట్టేందుకు పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తున్నట్టు సీసీఎస్ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉన్న ఫింగర్ ప్రింట్ ట్రేసింగ్ మిషన్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం జాతరలో 65 మిషన్లను అన్ని విభాగాల పోలీసు అధికారుల వద్ద ఉంచారు. జాతరలో విధులు నిర్వర్తించే సిబ్బందితో పాటు భక్తులకు అనుమానం వచ్చి పోలీసులకు అప్పగించిన వారిని అదుపులోకి తీసుకుని అక్కడే చెక్ చేస్తారు. అనుమానితుడి ఫింగర్ ప్రింట్స్ మిషన్ ద్వారా పరీక్షించి అతడు అసలు నేరస్తుడా కాదా? నేరస్తుడు అయితే ఎక్కడి వాడు? కొత్తనేరస్తుడా ? పాత నేరస్తుడా ? ఏ ప్రాంతానికి చెందిన వాడు? అని ఒక్క నిమిషంలో గుర్తిస్తారు. దొంగతనం చేయకున్నా అనుమానం వస్తే అదుపులోకి తీసుకుని పరీక్షించి క్యాంపునకు తరలిస్తారు. ఇప్పటికే 22 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. అందులో 16 మంది పాత నేరస్తులు ఉండగా వారిని కమాండ్ కంట్రోల్ రూంకు తరలించి విచారిస్తున్నట్టు తెలిసింది.

### నాలుగు సెక్టార్లుగా విభజించి నిఘా..

మేడారం జాతరలో దొంగతనాలను నివారించేందుకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరను నాలుగు సెకార్లుగా విభజించి విధులు నిర్వర్తిస్తారు. జాతరలో తల్లుల గద్దెలు ఇన్నర్ విభాగం, గద్దెల బయట ఔటర్ ప్రాంతంతో పాటు జంపన్నవాగు, బస్ స్టేషన్‌లో పోలీసులు మఫ్టీలో ఉండి దొంగలను గుర్తిస్తారు. ప్రధానంగా గద్దెల వద్ద తల్లులను దర్శించుకునే సమయంలో భక్తులు బిజీ బిజీగా ఉన్న సమయంలో దృష్టిమరల్చి చైన్‌స్నాచింగ్, పర్సులు, గొలుసులు, మూటలు, సెల్‌ఫోన్లు దోచుకుంటారు. ఈ క్రమంలో వారిని పోలీసులు సీసీ కెమెరా ద్వారా గుర్తించి కమాండ్ కంట్రోల్ రూం నుంచి అందరినీ అప్రమత్తం చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుంటారు. ఫింగర్‌ప్రింట్ సేకరణ ద్వారా దొరికిన వారి వివరాలు వెలికి తీసి వారి ఫోన్‌డాటా ఆధారంగా మిగతా దొంగల ఆచూకీ తెలుసుకుని పట్టుకునే ప్రయత్నం చేస్తారు.

### రాష్ట్ర, అంతర్రాష్ట్ర దొంగల తిష్ట

ఈ సారి జాతరలో ప్రదానంగా విజయవాడ, రాజమండ్రి, స్టూవర్టుపురం, గుంటూరు, కర్నూల్, హైదరాబాద్ వడ్డెరబస్తీ, చత్తీస్‌గడ్, ఒడిసా, రాజస్థాన్, బిహార్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున దొంగలు జాతరలో ప్రవేశించారని భక్తులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ప్రజలు పాత దొంగలను గుర్తించేందుకు గద్దెలు, జంపన్నవాగు, ఐటీడీఏ గెస్ట్‌హౌస్, కన్నెపల్లి, చిలుకలగుట్ట రోడ్డు ప్రాంతాల్లో ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని, అనుమానం వస్తే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ సారి జాతరకు మహిళా దొంగలు ఎక్కువగా వచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రధానంగా మహిళల మెడలో బంగారం ఎక్కువగా తస్కరించే ప్రమాదం ఉందని మహిళలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# చల్లని తల్లుల అగ్రంపహాడ్

- అనుగ్రహించే దైవాలు సమ్మక్క, సారలమ్మ
- ఎత్తు బంగారం, పిల్లాపాపలతో తరలివస్తున్న భక్తులు
- దర్శించుకుని తన్మయం చెందుతున్న భక్తులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో రెండవ మేడారంగా పేరుగాంచిన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ దర్శనానికి భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఎత్తు బంగారంతో పిల్లా పాపలతో తరలివస్తున్నారు. సోమవారం ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు నల్లగొండ, సూర్యాపేట, సికింద్రాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవతలు గద్దెపైకి వచ్చిన తర్వాత దర్శించుకుని నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉండి జాతర ఉత్సవాలను తిలకించి అమ్మవార్ల అనుగ్రహం పొందిన అనంతరం తిరుగుప్రయాణమవుతామని భక్తులు తెలుపుతున్నారు.

### కళకళలాడుతున్న సమ్మక్కసారలమ్మ తోరణాలు

జాతరకు వచ్చే భక్తులకు కనువిందు చేసేవిధంగా వరంగల్ నుంచి నేరుగా అగ్రంపహాడ్ జాతరకు వచ్చే దారి అక్కంపేటలో ఏర్పాటు చేసిన తోరణం విద్యుత్ కాంతులతో కనువిందు చేస్తోంది. అలాగే జాతీయ రహదారి 163 దుర్గంపేటలో ఉన్న మరో తోరణం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది.



తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

### జాతరలో గారడీల జోరు

సుదీర్ఘ ప్రాంతాల నుంచి వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనంతోపాటు జాతరలో గారడీల ఆటలను భక్తులు ఎంతో ఆసక్తితో తిలకిస్తున్నారు. రకరకాల పాములతో పాటు గారడీ విద్యలతో భక్తులను అలరిస్తున్నారు.

### భక్తులకు సకల సేవలు అందిస్తాం..

**- ఎండోమెంట్ ఈవో శేషగిరి**

కోరిన కోర్కెలు తీర్చే సమ్మక్క సారలమ్మ వనదేవతలపై ఎంతో నమ్మకంతో వచ్చే బక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పిస్తాం. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్నానాల ఘట్టాలు ఏర్పాటు చేయడం జరిగింది. విడిది కోసం చెట్ల కింద ఉండవచ్చు. వ్యవసాయ బావి, విద్యుత్ 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశాం. పోలీసు నిఘా నిరంతరం కొనసాగుతోంది.

## మహాజాతరకు పటిష్ఠ ఏర్పాట్లు

3వ పేజీ తరువాయి

నిర్మించామన్నారు. ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### మంత్రుల ప్రత్యేక పూజలు

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు మంత్రులను డోలు వాయిద్యాలతో వారికి ఘన స్వాగతం పలికారు. గద్దెకు చెరుకున్న మంత్రులు నిలువెత్తు బంగారం (బెల్లం), కొబ్బరికాయలు, పూలు, పండ్లు, పసుపు కుంకుమ సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారికి పూజారులు ప్రసాదాలు, పసుపు కుంకుమలను అందించి కండువాలు కప్పి సత్కరించారు.

### జాతర నిర్వహణపై అధికారులతో సమీక్ష

మేడారం పర్యటనలో భాగంగా మంత్రులు మీడియా సెంటర్, ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. హరిత హోటల్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. జాతరలో భక్తులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుకున్నారు. సెక్టార్లు, జోన్లవారీగా అధికారుల విధుల గురించి తెలుకున్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగు పుణ్యస్నానాలు, కల్యాణకట్టల్లో తలనీలాలు, గద్దెల వద్ద దర్శనాలు, సౌకర్యవంతంగా ఉండాలన్నారు. భక్తులు అధికంగా తరలి వచ్చే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిరంతరం సౌకర్యాలపై దృష్టి సారించి జాతర విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన ప్రాంతాలలో వారు సేవలందించాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత ఎంతో ముఖ్యమని పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వనదేవతలను దర్శించుకున్న డీజీపీ



వనదేవతలను దర్శించుకుంటున్న డీజీపీ రవిగుప్తా

డీజీపీ రవి గుప్త సోమవారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఎస్పీ శబరీష్, ఐపీఎస్ అధికారులు స్వాగతం పలకగా.. వనదేవతల గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించి జాతరలో పోలీసు శాఖ చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించారు. పలు అంశాలపై అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు.


ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 20 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

# ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు విశ్వనాథ్ అవార్డ్



మహానటుడు అక్కినేని నాగేశ్వరరావుకు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు మధ్య ఉన్న అనుబంధం చాలా ప్రత్యేకం. అక్కినేని నటించిన ఎన్నో చిత్రాలకు విశ్వనాథ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశారు. అంతేకాదు ఏయన్నార్ నటించిన 'ఆత్మగౌరవం' సినిమాతోనే ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. వీరిద్దరి అనుబంధాన్ని స్మరించుకుంటూ అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు ప్రతి ఏడాది రెండు నగదు అవార్డులను ఇవ్వాలని విశ్వనాథ్ కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోలోని అక్కినేని విగ్రహం దగ్గర నాగార్జున, అమలతో విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర తన భార్య లక్ష్మి, కుమారుడు ప్రణవ్ కలసి సమావేశమై ఈ నిర్ణయం ప్రకటించారు. విశ్వనాథ్ సౌండ్ రికార్డిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, తర్వాత దర్శకుడు అయ్యారు కనుక ఆయన పేరిట సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాల్లో అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు విద్యార్థులకు ఇకపై ప్రతి ఏడాది చెరో పాతిక వేల రూపాయలు అవార్డ్ రూపంలో అందజేస్తారు.

# ధనుష్ @ 50 రాయన్



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ ధనుష్ నటిస్తున్న 50వ చిత్రానికి 'రాయన్' అనే పేరు నిర్ణయించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నారు. దర్శకుడిగా ఆయనకు ఇది రెండో సినిమా. యువ కథానాయకుడు సందీప్ కిషన్ మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. కాళిదాస్ జయరామ్ కీలక పాత్ర లో నటిస్తున్నారు. ఈ ముగురూ ఉన్న 'రాయన్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ధనుష్ ఫుడ్ ట్రక్ ముందు నిలబడి ఉంటే, సందీప్ కిషన్ వాహనం లోపల, కాళిదాస్ దానిపైన కనిపించారు. ధనుష్ ఆప్రాన్ మీద రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది. ఎస్ జె సూర్య, సెల్వరాఘవన్, అపర్ణా బాలమురళి, దుషార విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఓం ప్రకాశ్ డీవోపీ. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పీటర్ హెయిన్ వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాదే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.



# మలయాళంలో హిట్.. ఇప్పుడు తెలుగులో

మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'భ్రమయుగం' ఇటీవల మలయాళంలో విడుదలై విజయం సాధించింది. చాలా కాలం తర్వాత పూర్తి బ్లాక్ అండ్ వైట్‌లో తయారైన ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ అధినేత సూర్యదేవర నాగవంశీ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 23న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఉన్న వైవిధ్యమైన కథాంశం, మమ్ముట్టి అద్భుత నటన మలయాళ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. విమర్శకుల ప్రశంసలు పొందాయి. అందుకే అక్కడ ఈ సినిమాకు అద్భుతమైన స్పందన వచ్చింది. తెలుగు ప్రేక్షకులను కూడా ఈ చిత్రం అలరిస్తుందని నిర్మాత చెబుతున్నారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకుడు.

# జాన్వీతో జంటగా...





ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంట తెలుగు తెరపై ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. చిరంజీవి, శ్రీదేవిలానే రామ్‌చరణ్, జాన్వీకపూర్ కలసి నటిస్తే చూడాలనేది మెగా అభిమానుల కోరిక. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో ఈ కాంబినేషన్ సెట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. ఇన్నాళ్లకు ఈ క్రేజీ కాంబినేషన్ సెట్టయింది.

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం ( ఆర్‌సీ 16-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నారు. ఈ విషయాన్ని జాన్వీ తండ్రి బోనీకపూర్ సోమవారం ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'త్వరలోనే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాన్వీ పాల్గొంటుంది. రామ్‌చరణ్ లాంటి హీరోతో నటించడం జాన్వీకి మంచి అవకాశం. నా భార్య శ్రీదేవి లానే నా కూతురు కూడా విభిన్న భాషల్లో నటించి పేరు తెచ్చుకోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. అలాగే తమిళ హీరో సూర్యతోనూ జాన్వీ ఓ చిత్రంలో నటిస్తున్నట్లు బోనీకపూర్ చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంతోనే ఆమె హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్‌ఛేంజర్' చిత్రం షూటింగ్‌లో రామ్‌చరణ్ పాల్గొంటున్నారు. ఏప్రిల్ నుంచి 'ఆర్ సీ 16' షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

# ఘనంగా బాఫ్టా అవార్డుల వేడుక

ప్రతిష్ఠాత్మక 77వ బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ అవార్డ్స్ (బాఫ్టా) ప్రదానోత్సవం లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. 'ఓపెన్‌హైమర్' చిత్రం మెజారిటీ పురస్కారాలను కొల్లగొట్టింది. క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు (సిలియన్ మర్ఫీ), ఉత్తమ చిత్రం సహా మరో ఏడు విభాగాల్లో పురస్కారాలను గెలుచుకుంది. ఆ తర్వాతి స్థానంలో 'పూర్ థింగ్స్' చిత్రం ఐదు బాఫ్టా పురస్కారాలను గెలుపొందింది. ఉత్తమ నటిగా ఎమ్మా స్టోన్ నిలిచారు. బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొనే ఈ కార్యక్రమానికి ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె సహ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దీపిక చీరకట్టులో కనిపించి వేదికపై సందడి చేశారు. 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' చిత్రం ఉత్తమ ఆంగ్లేతర చిత్రాల కేటగిరీలో విజేతగా నిలవగా, దర్శకుడు జొనాథన్ గ్లేజర్‌కు దీపికా పదుకొనే పురస్కారాన్ని అందజేశారు.








ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు, హీరో ఆశిష్ రెడ్డి, అద్వితా రెడ్డిల వివాహం ఇటీవల జైపూర్‌లోని లీలా ప్యాలెస్ హోటల్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ వివాహ వేడుకకు బంధువులు, సన్నిహితులతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ జంట తమ మొదటి చిత్రాన్ని సోషల్ మీడియా లో షేర్ చేసింది. ఈ నెల 23న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు దిల్ రాజు, శిరీష్. 'రౌడీ బాయ్స్' చిత్రంతో హీరోగా పరిచయమైన ఆశిష్ ప్రస్తుతం సెల్ఫిష్ చిత్రంలో నటిస్తున్నారు.

# ఊహించని క్లైమాక్స్‌తో కమర్షియల్ కథ



వినూత్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇంద్రాణి'. యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టీఫెన్‌పల్లం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వెరోనికా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై స్టాన్లీ సుమన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నా సోదరుడు చెప్పిన కథతో ఈ సినిమాను తెరకెక్కించాం. షూటింగ్ పూర్తయ్యాక వీఎఫ్ఎక్స్ కోసమే ఏడాది పాటు కష్టపడ్డాం. ఈ సినిమా క్లైమాక్స్ ఎవరూ ఊహించలేని విధంగా ఉంటుంది' అన్నారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన మంచి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ ఇదని నిర్మాత చెప్పారు. సినిమా ఓ దృశ్యకావ్యంలా ఉంటుంది, టైమ్ మెషీన్, రోబో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తాయి అని కబీర్ దుహాన్ సింగ్ తెలిపారు. గరీమా కౌశల్, ప్రతాప్ సింగ్, అజయ్, సప్తగిరి ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సాయికార్తీక్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: చరణ్ మాధవనేని.

# ఒక పథకం ప్రకారం విడుదలకు సిద్ధం



సాయిరామ్ శంకర్, అసీమా నర్వాల్, శ్రుతీ సోధీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విజయన్ దర్శకత్వం వహిస్తూ, గార్లపాటి రమేశ్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిరామ్ శంకర్ పవర్‌ఫుల్ అడ్వకేట్ పాత్ర పోషించారు. సముద్రఖని పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా వినోద్ విజయన్ మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన థ్రిల్లర్. గోపిసుందర్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణ. సిద్ శ్రీరాం పాడిన పాటలకు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది' అన్నారు. భానుశ్రీ, పల్లవి గౌడ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి.



# కాలం సూపుల గాలంరా

చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమార స్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'కాలం సూపుల గాలంరా' అంటూ సాగే గీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "షరతులు వర్తిస్తాయి' సినిమాను ప్రేక్షకులు ఎలాంటి షరతులు పెట్టకుండా చూసి విజయవంతం చేయాలి' అని కోరారు. ఈ గీతానికి గోరేటి వెంకన్న సాహిత్యాన్ని అందించగా, రామ్ మిర్యాల ఆలపించారు. అరుణ్ చిలువేరు సంగీతం అందించారు. మానవ సంబంధాల్లోని మార్పులను ప్రతిబింబించే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ వనమాలి, శేఖర్ పోచంపల్లి.

# సరికొత్త కథాంశంతో...



విశ్వ కార్తిక్, ఆయూషి పటేల్ జంటగా నటించిన 'కలియుగం పట్టణం' చిత్రం షూటింగ్ పూర్తయింది. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'టాలీవుడ్‌లో ఇలాంటి కాన్సెప్ట్‌తో ఏ సినిమా రాలేదు. సరికొత్త పాయింట్‌తో సందేశాన్ని మిళితం చేసి కుటుంబ సమేతంగా చూసే విధంగా చిత్రాన్ని రూపొందించాం.. గ్యారీ బీ హెచ్ వంటి టాప్ టెక్నీషియన్ మా సినిమాకు ఎడిటర్‌గా పని చేశారు' అని చెప్పారు. కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ 'కడప జిల్లాలో 45 రోజుల పాటు షూటింగ్ జరగడంతో చిత్రం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి 22న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సాహిత్యం! చంద్రబోస్, భాస్కరభట్ల, ఫొటోగ్రఫీ: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాడ, నిర్మాతలు: డాక్టర్ కె. చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్.

# ఇద్దరు మిత్రుల కథ

ఆశిష్ గాంధీ, అశోక్, వర్ష, ప్రీతిక హీరోహీరోయిన్లుగా రూపుదిద్దుకున్న చిత్రం 'హద్దు లేదురా'. రాజశేఖర్ రావి దర్శకుడు. వీరేశ్ గాజుల నిర్మాత. సోమవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో చిత్రం టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ 'నేను నటించిన 'నాటకం' టీజర్ ఇక్కడే లాంచ్ అయింది. ఆ సినిమా పెద్ద హిట్ అయింది. అలాగే 'హద్దు లేదురా' కూడా సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నాను. సినిమా బాగా వచ్చింది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'భారతంలో శ్రీకృష్ణార్జునులు స్నేహంగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించుకున్నారు. అలాగే ఇద్దరు స్నేహితులు కూడా వారికి వచ్చిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారో అనే కథాంశంతో ఈ సినిమా తీశాం. ముఖ్యంగా క్లైమాక్స్ అద్భుతంగా వచ్చింది. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ వారికి మా సినిమా నచ్చడం ఆనందంగా ఉంది. గీత రచయిత కమల్ కుమార్ అద్భుతమైన ఐదు పాటలు ఇచ్చారు. వారు మనమధ్య లేకపోయినా ఆయన రాసిన పాటలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. త్వరలో పాటలను విడుదల చేస్తాం' అన్నారు. 'స్నేహం నేపథ్యంలో వచ్చిన సినిమాలన్నీ హిట్ అయ్యాయనీ, 'హద్దు లేదురా' కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని మరో హీరో రోహిత్ చెప్పారు.



# సమాజానికి ఉపయోగపడే 'మైరా'



కన్నడంలో గుర్తింపు పొందిన స్మైల్ శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా చిత్రం 'మైరా'. చిన్న జీయర్ స్వామిని కలసి చిత్రం స్క్రిప్ట్‌కు పూజ చేయించి వారి ఆశీస్సులు తీసుకున్నారు శ్రీను. ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్రస్తుత సమాజానికి మైరా లాంటి చిత్రాలు ఎంతో అవసరం అని చిన్న జీయర్ స్వామి చెప్పారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ 'తెలుగులో ఈ సినిమా తీసి కన్నడంలోకి డబ్ చేస్తాం. ఓ స్టార్ హీరోయిన్ ఇందులో నటిస్తారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని చెప్పారు. స్వామిజీ ఆశీస్సులు లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# పదమూడో నంబర్ ఇంట్లో...



'కాలింగ్ బెల్', 'రాక్షసి' వంటి హారర్ థ్రిల్లర్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకొన్న దర్శకుడు పన్నా రాయల్ తాజా చిత్రం 'ఇంటినంబర్ 13'. డిఫరెంట్ మిస్టీరియస్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. నవీన్‌బాబు, శివాంగి మెహ్రా, ఇర్ఫాన్, నికిషా, ఆనందరాజ్, తనికెళ్ల భరణి తదితరులు నటించిన ఈ చిత్రాన్ని హేసన్ పాషా నిర్మించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇంతవరకూ వచ్చిన హారర్ సినిమాలకు ఇది పూర్తి విభిన్నం. సినిమాలో ప్రతి పది నిముషాలకూ ఓ ట్విస్ట్ ఉంటుంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉండడంతో హాలీవుడ్ టెక్నీషియన్లతో వర్క్ చేయించాం. సినిమా బాగా వచ్చింది' అన్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చే సినిమా ఇదని నిర్మాత తెలిపారు.

# నిశ్చితార్థం అయిన మర్నాడే.. మృత్యు ఒడికి!

- దంతాలు సరిచేయించుకోవడానికి వెళ్లి యువకుడి మృతి
- లేజర్ చికిత్స చేయించుకున్నాక నొప్పి, వాంతులు
- కడుపునొప్పి, ఫిట్స్‌తో స్పృహతప్పడంతో ఆస్పత్రికి
- దారిలోనే కన్నుమూత.. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): "అబ్బాయికి పెళ్లి కుదిరింది. నిశ్చితార్థం కూడా అయింది. ఇక త్వరలోనే పెళ్లి.. కోడలు ఇంటికి వస్తుంది" అని ఆ తల్లిదండ్రులు ఆనందిస్తున్న సమయంలోనే వారి కుమారుడు మృత్యువాత పడ్డాడు! నిశ్చితార్థం అయిన మరునాడే.. పలు వరుస సరిచేయించుకోవడానికి డెంటల్ ఆస్పత్రికి వెళ్లిన కుమారుడు చనిపోయాడని తెలిసి ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో జరిగిందీ ఘటన. మిర్యాలగూడ నరస్వతినగర్‌కు చెందిన రాములు, సరస్వతి దంపతులు కూకట్‌పల్లి హైదర్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు లక్ష్మీనారాయణ, మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డిగ్రీ చదివి వ్యాపారం చేసుకుంటున్న లక్ష్మీనారాయణకు ఇటీవలే పెళ్లి కుదిరింది. ఈ నెల 15వతేదీ ఘనంగా నిశ్చితార్థ వేడుకలు నిర్వహించారు. 16వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు.. లక్ష్మీనారాయణ తన కింది పళ్ల వరుస సరిచేయించుకోవటానికి ఎఫ్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్‌కు వెళ్లాడు. సాయంత్రమైనా అతడు తిరిగి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. కానీ, అవతల వారి కుమారుడికి బదులు వేరెవరో ఫోన్ ఎత్తారు. తాను అపోలో ఆసుపత్రి నుంచి మాట్లాడుతున్నానని.. లక్ష్మీనారాయణ మృతి చెందాడని తెలిపాడు. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన లక్ష్మీనారాయణ తల్లిదండ్రులు, తోబుట్టువులు అపోలో ఆసుపత్రికి వెళ్లారు! అక్కడ నిర్జీవంగా ఉన్న అతణ్ని చూసి హృదయవిదారకంగా రోదించారు. కుమారుడి మృతిపై అనుమానం ఉందంటూ తండ్రి రాములు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా డెంటల్ ఆస్పత్రిలోని సీసీ టీవీ ఫుటేజ్‌ని తనిఖీ చేశారు. దాని ప్రకారం.. లక్ష్మీనారాయణకు వైద్యులు అనస్తీషియా ఇచ్చి లేజర్ చికిత్స చేశారు. ఆ చికిత్స తరువాత లక్ష్మీనారాయణ తీవ్రమైన నొప్పితో బాధపడ్డాడు. అదే సమయంలో అతనికి రెండుమూడు సార్లు వాంతులు అయ్యాయి. వాష్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన తరువాత కడుపునొప్పితో కిందపడిపోయాడు. ఫిట్స్ రావటంతో ఆస్పత్రిలో ఉన్నవారు అతడి చేతిలో తాళంచెవులు పెట్టారు. అంబులెన్స్‌ను రప్పించి అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరేలోపే అతడు మృతి చెందినట్లు అపోలో వైద్యులు ధ్రువీకరించారు. ఎఫ్ఎంఎస్ ఆస్పత్రి నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మృతి చెందాడని, న్యాయం చేయాలని రాములు డిమాండ్ చేస్తున్నారు.

## వాళ్లు వైసీపీ గూండాలే..!

అనంతపురం క్రైం/కల్యాణదుర్గం, ఫిబ్రవరి 19 : ఆంధ్రజ్యోతి అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి దిగిన వారు వైసీపీ గూండాలే అనేది తేలిపోయింది. శ్రీకృష్ణపై దాడి జరిగి 24 గంటలు దాటిపోయినా ఇప్పటివరకూ పోలీసులు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు. కానీ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఫొటోలను, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమైన దృశ్యాలను చూసిన జనం... నిందితులను గుర్తించగలుగుతున్నారు. ఆంధ్రజ్యోతి పరిశీలనలో వారి నుంచి దీనికి సంబంధించిన సమాచారం బయటకు వచ్చింది. దాడి చేసినవారిలో మంత్రి ఉషశ్రీచరణ్ అనుచరుడు గొల్ల అశోక్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అనుచరుడు బండి రవి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుయాయి మిద్దె ఎర్రిస్వామి ఉన్నట్టు చెబుతున్నారు. గొల్ల అశోక్‌ది కల్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామం. ఇతను పీడీఎస్ బియ్యం సేకరించి అక్రమంగా కర్ణాటకకు తరలిస్తుంటాడు.

## వనమా అనర్హత పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. 2019 అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ సమయంలో వనమా తప్పుడు అఫిడవిట్ సమర్పించారంటూ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ వనమా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. పదవీకాలం ముగిసినప్పటికీ ఆరేళ్ల అనర్హత వేటు వేయాల్సిన నిబంధనలు ఉన్నాయని, దాని ప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని జలగం వెంకట్రావ్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ధర్మాసనం కేసుపై నాన్ మిస్‌లీనియస్ డే (మంగళ, బుధ, గురువారాలు)లో ఒక రోజున విచారణ చేపడతామని తెలిపింది.

## ఏపీ ఎన్నికల బరిలో తెలంగాణ విశ్రాంత ఐపీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పోటీ చేసేందుకు తెలంగాణ విశ్రాంత ఐపీఎస్ పూర్ణచంద్ర రావు సిద్ధమయ్యారు. బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. గురువారం పార్టీలో చేరిన అనంతరం తదుపరి రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తారు. విజయవాడ లేదా ఏలూరులోని ఏదో ఒక పార్లమెంట్ స్థానం నుంచి ఆయన బరిలో దిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గతించిన చరిత్ర: సజ్జల

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీల్లో సీపీఎస్‌ను రద్దు చేయలేకపోయాం. మద్యపాన నిషేధాన్ని అమలు చేయలేకపోయాం' అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అంగీకరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... త్వరలోనే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. తప్పు చేస్తే కేసులు పెడతారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పైనా ఇదే తరహాలో క్రిమినల్ కేసు నమోదైంది. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని మా పార్టీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి ఎందుకుకోరారో నాకు తెలియదు. అది పార్టీ అభిప్రాయం కాదు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశం గతించిన చరిత్ర' అని సజ్జల అన్నారు.

## కులోన్మాద హత్యకేసులో నలుగురికి రెండు యావజ్జీవాలు

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు జిల్లాలో పదేళ్ల క్రితం జరిగిన కులోన్మాద హత్య కేసులో నలుగురికి రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 2014లో ఆదివరాహనత్తం ప్రాంతంలో వేర్వేరు కులాలకు చెందిన సీత, శరవణన్ అనే యువతీ యువకులు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. శరవణన్ కులానికి చెందినవారు ఈ ప్రేమవివాహం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చారు. ఆ నేపథ్యంలో సీతను దారుణంగా హతమార్చి రహస్యంగా మృతదేహాన్ని కాల్చివేశారు. ఆ హత్యకేసులో సీత భర్త శరవణన్‌ను, అతడి తల్లి, చెల్లెలు, బావకు యావజ్జీవ శిక్షలు పడ్డాయి.

# జర్నలిస్టులపై దాడులకేనా 'సిద్ధం'?

## ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం.. రాష్ట్రమంతా రగిలిన జర్నలిస్టులు

- ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనల వెల్లువ
- జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు

(న్యూస్ నెట్‌వర్క్,ఆంధ్రజ్యోతి)

" ఏపీలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందా? లేక నియంత పాలన సాగుతోందా? చివరకు ముఖ్యమంత్రి సభల్లో పాల్గొనే జర్నలిస్టులకు కూడా రక్షణ కరువైంది. తక్షణం నిందితులను అరెస్టు చేసేలా డీజీపీ చర్యలు తీసుకోవాలి" అంటూ జర్నలిస్టులు ముక్తకంఠం వినిపించారు. జర్నలిస్టులపై దాడులు చేయడానికేనా 'సిద్ధం' అంటున్నారని ఆగ్రహించారు. జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రమంతా నల్లబ్యాడ్జీలు ధరించి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే నేతృత్వంలో విజయవాడలో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు రోడ్డెక్కారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి జరిగి 24 గంటలు దాటిపోయినా, ఇంతవరకు నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదు. దీనిపై రాష్ట్రమంతా జర్నలిస్టులు ఆగ్రహంతో రగిలిపోయారు. విజయవాడలో జరిగిన నిరసన కార్యక్రమంలో దాడి దృశ్యాలను ప్రదర్శిస్తూ, వైసీపీ మూకల దాడులను నిరసిస్తూ ర్యాలీలో పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, సీనియర్ నాయకులు ఎస్కే బాబు మాట్లాడారు. ఏపీయూడబ్ల్యూజే కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, టీడీపీ, వామపక్ష పార్టీలు నిరసన తెలిపాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లో వర్కింగ్ జర్నలిస్టులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు రోడ్డెక్కాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొనిపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో జర్నలిస్టు నాయకులు నిరసనలు చేపట్టి, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశాయి. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితర నేతలు రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో అంబేడ్కర్ జంక్షన్ వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన తెలిపారు. నరసన్నపేటలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నీలంరాజు నిరసనల్లో పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, వామపక్షాలు, రాజకీయ పార్టీలు ఆగ్రహించాయి. మాజీమంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, ఉరవకొండ ఎమ్మెల్యే, పయ్యావుల కేశవ్ తదితరులు ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆధ్వర్యంలో అనంతపురం సిటీలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలో వివిధ జర్నలిస్టు సంఘాలు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. సంఘీభావంగా టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం,కాంగ్రెస్ పార్టీల నేతలు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ జర్నలిస్టులు నిరసన ప్రదర్శన చేశారు. వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో తెదేపా నేత చెన్నోజు రఘుబాబు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.






హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, కర్నూలులో ధర్నా చేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

### శ్రీకృష్ణకు అపోలోలో చికిత్స

అనంతపురం, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఆదివారం వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. దాడి తర్వాత ఆయనను అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. శ్రీకృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్‌కు తరలించారు. ఆస్పత్రిలో శ్రీకృష్ణను మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి పరామర్శించారు.

### దాడి అమానవీయం: అనంత ఎస్పీ

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అమానవీయమని అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ అన్నారు. దాడి వీడియోను తాను చూశానని, 'వెరీ బ్యాడ్' అని వ్యాఖ్యానించారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ తనను కలిసిన ఏపీయూడబ్ల్యూజే నేతల వద్ద ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# ప్రభుత్వం వచ్చాక అన్ని పదవుల్లో వాటా

- అవసరమైతే త్యాగాలకూ సిద్ధంగా ఉండాలి
- ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన నేతలతో పవన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజలు వచ్చే ఎన్నికల్లో విస్పష్టమైన తీర్పు ఇవ్వబోతున్నారని, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. జనసేన పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కేలా చూసే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. మూడు రోజుల విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. కూటమిని విజయం దిశగా నడిపించేందుకు క్షేత్రస్థాయిలో బలంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈసారి వ్యక్తిగత గెలుపుకంటే సమష్టి విజయం కోసమే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అవసరమైతే త్యాగాలకు కూడా సిద్ధంగా ఉండాలన్నారు. పొత్తులో భాగంగా అన్నింటా మూడో వంతు జనసేనకు స్థానాలు లభిస్తాయన్నారు. సాధారణ ఎన్నికల్లోనే కాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వచ్చే అవకాశాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. స్థానిక ఎన్నికలు, ప్రాథమిక సహకార సంఘాలు, ఇతర కీలక నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానాలు జనసేనకు వస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సుస్థిర పాలన అవసరమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొనే కూటమి నిర్ణయాలు తీసుకుంటుందని వివరించారు. పార్టీ బలోపేతం కోసం, ఎన్నికల నిర్వహణకు తన కష్టార్జితం నుంచి రూ.10 కోట్లు పార్టీ నిధిగా ఇస్తున్నట్లు పవన్ ప్రకటించారు.

# ఢిల్లీ లిక్కర్ స్కాం నిందితుడికి వైసీపీ టికెట్!

- నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా శరత్‌చంద్రారెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న పెన్నాక శరత్ చంద్రారెడ్డి ఉరఫ్ అరబిందో శరత్‌చంద్రారెడ్డికి వైసీపీ వీరతాడు వేసింది. ఆయనకు నెల్లూరు లోక్‌సభ స్థానం టికెట్‌ను కేటాయించినట్టు సమాచారం. ఈయన వైసీపీ కీలక నేత వి. విజయసాయిరెడ్డి బంధువు. తొలుత నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డిని జగన్ ప్రకటించారు. కానీ నెల్లూరు లోక్‌సభ పరిధిలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చాలని వేమిరెడ్డి ప్రతిపాదించారు. దీనికి సీఎం జగన్ అంగీకరించలేదు. నెల్లూరు సిటీ అభ్యర్థి విషయంలోనూ వేమిరెడ్డి మాటను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రస్తుత నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ సన్నిహితుడు ఖలీల్ అహ్మద్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. మరోవైపు ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కు క్వార్ట్జ్ గనులు అప్పగించడంపైనా వేమిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో వేమిరెడ్డి ఆకస్మికంగా పార్టీని వీడారు. దీంతో శరత్ చంద్రారెడ్డిని నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలన్న యోచనలో ఉన్నారని వైసీపీ వర్గాల్లో చర్చసాగుతోంది.

# విప్ అడ్లూరికి తప్పిన ప్రమాదం

- కారు బోల్తా పడటంతో గాయాలు
- ఫోన్ చేసి పరామర్శించిన సీఎం రేవంత్

ఎండపల్లి/ధర్మారం/రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 19: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు పెను ప్రమాదం తప్పింది. కారు బోల్తా పడగా ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి అడ్లూరి తన కారులో ధర్మపురికి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారిపేట వద్ద వెల్గటూర్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న లారీ ఎదురుగా రావడంతో దానిని తప్పించబోయి ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న వాహనం చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అయితే ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఎమ్మెల్యే తల, చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. కారులోని డ్రైవర్, ఇద్దరు గన్‌మెన్‌లు కూడా స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే అడ్లూరిని కరీంనగర్‌లోని అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అడ్లూరిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. కరీంనగర్ నుంచి లక్సెట్టిపేట వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అడ్లూరిని సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్లూరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సీఎం సూచించారు. ఇటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆస్పత్రికి చేరుకొని అడ్లూరిని పరామర్శించారు. కాగా, తన ఆరోగ్యం బాగానే ఉందని కార్యకర్తలు, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని అడ్లూరి ఓ ప్రకటన విడుదల చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విప్ అడ్లూరి

# ఏసీబీ వలలో మరో అవినీతి చేప

- రూ. 84వేలు లంచం తీసుకుంటూ
- రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన మహిళా అధికారి

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలలో మరో అవినీతి చేప చిక్కింది. రూ.84 వేలు లంచం తీసుకుంటూ ఓ మహిళా అధికారి పట్టుబడ్డారు. కె. జగజ్యోతి.. మాసాబ్ ట్యాంక్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఇంచార్జీ సూపరింటెండెంట్)గా పని చేస్తున్నారు. లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న నిజామాబాద్ జిల్లా నామ్‌దేవ్ వాడ ప్రాంతానికి చెందిన బోడుకం గంగన్నకు తాను చేసిన ఓ పనికి సంబంధించిన బిల్లుతో పాటు గాజుల రామారంలో జువైనెల్ బాయ్స్ హాస్టల్ భవన నిర్మాణ నిమిత్తం బిల్లుల విషయంలో జగజ్యోతి సంతకాలు అవసరమయ్యాయి. దాంతో ఈ విషయమై గంగన్న ఆమెను సంప్రదించగా, ఆమె లంచం డిమాండ్ చేశారు. గంగన్న ఏసీబీ అధికారులను ఆశ్రయించగా అధికారులు పథకం రచించారు. ఈ క్రమంలో సోమవారం రూ.84 వేలు లంచంగా ఇస్తానని జగజ్యోతికి గంగన్న సమాచారం ఇచ్చాడు. సోమవారం మధ్యాహ్నం జగజ్యోతి తన కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు.



పట్టుబడిన జగజ్యోతి



ప్రభాకర్, శ్రీకాంత్, భీమయ్య(ఫైల్)

# ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

- బైక్‌పై ఉన్న నలుగురిలో ముగ్గురి మృతి
- మెదక్ జిల్లా గడిపెద్దాపూర్ వద్ద ప్రమాదం

అల్లాదుర్గం, ఫిబ్రవరి 19: మెదక్ జిల్లా మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ సమీపంలో 161వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. ద్విచక్రవాహనంపై ఉన్న మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన గడ్డం ప్రభాకర్(30), గడ్డం భీమయ్య(22), అల్లాదుర్గం శ్రీకాంత్(20), తుడం మైసయ్య(తుడుం మాస్) సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం నాగులపల్లిలో ఓ నిశ్చితార్థానికి వెళ్లారు. వేడుకల అనంతరం ఒకే ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, గడిపెద్దాపూర్ వద్ద ఎదురుగా వచ్చిన ఓ కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రభాకర్, భీమయ్య, శ్రీకాంత్ అక్కడికక్కడే మరణించారు. మైసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుల్లో ఒకరైన ప్రభాకర్‌కు వివాహం కాగా భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభాకర్ అన్న కుమారుడైన భీమయ్య, శ్రీకాంత్ అవివాహితులు.

# మేడారంలో నిధుల మేత!

(మొదటి పేజీ తరువాయి)

పైగా కేటాయించారు. వీటిలో తాత్కాలిక మరుగుదొడ్లకే రూ.28 కోట్లు, పారిశుధ్యం పేరుతో రూ.32 కోట్లు, ఇసుక చదును, డ్రెస్సింగ్ రూమ్‌లు, బీవోటీలు తదితర తాత్కాలిక పనులకు రూ.25 కోట్లు, మట్టిరోడ్లకు రూ.15 కోట్ల చొప్పున ఈ ఆరేళ్లలో 100 కోట్లు వృథాగా ఖర్చు చేశారనే ఆరోపణలున్నాయి.

## తాత్కాలిక పనులకే భారీగా నిధుల ఖర్చు

మేడారం జాతర నిధులంటే సమ్మక్క ఫలహారమే అనే టాక్ ఉంది. శాశ్వత పనులకు కాకుండా తాత్కాలిక పనులకే అధిక నిధులు కేటాయింపు ఆనవాయితీగా వస్తుంది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ జాతరకు తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేపడతారు. నాణ్యత ఉండదు. నాలుగు రోజుల కోసం చేపట్టే ఈ పనుల్లో కాంట్రాక్టర్లకు కాసుల పంటే. ఒక్కో మరుగుదొడ్డిపై 50 శాతం లాభం ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది జాతరకు ఆర్‌డబ్ల్యూఎస్‌కు రూ.13.45 కోట్లు కేటాయించారు. వీటిలో 5,600 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు రూ.4.03 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. వీటికి కావాల్సిన జియో షీట్లు, ఫ్రేమ్‌లను ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. కేవలం బేసిన్, పునాది, గుంతలు ఏర్పాటు చేయాలి. 20 మరుగుదొడ్లు కలిపి ఒక యూనిట్. ఒక్కో యూనిట్‌కు రూ.1,44,000 చెల్లిస్తున్నారు. అంటే ఒక్కో మరుగుదొడ్డికి రూ.7,200 కేటాయించారు. తాత్కాలిక పనులతో నిధులన్నీ నీళ్లపాలవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. పైగా ఈ పనులన్నీ కూడా నామినేషన్ పేరుతో ప్రజాప్రతినిధుల బినామీలే చేస్తుండటంతో అధికారులు నాణ్యత గురించి మాట్లాడే సాహసం చేయడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి.

| తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేటాయించిన నిధుల వివరాలు | |
|---|---|
| సంవత్సరం | నిధులు (రూ.కోట్లలో) |
| 2016 | 150.50 |
| 2018 | 85.55 |
| 2020 | 75 |
| 2022 | 75 |
| 2024 | 105 |
| మొత్తం | 491.05 |

## ఆరితేరిన బినామీలు

జంపన్నవాగులో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.5.94 కోట్లతో పనులు చేపట్టారు. వీటిలో 14బావుల్లో ఇన్‌ఫిల్టరేషన్, పూడికతీత, నీటి క్లోరినేషన్, 43 మోటార్లు బిగింపు తదితర వాటితో పాటు 9 చోట్ల ఇసుక చదును చేయటం లాంటివి ఉన్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరులే ఈ పనులు చేస్తున్నట్లు టాక్. వీటికి రూ.2.50 కోట్లు కూడా ఖర్చు కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ అండ్ బీకి రూ.4 కోట్లు కేటాయించగా, బీఆర్ఎస్‌కు చెందిన మరో మాజీ ఎమ్మెల్యే అనుచరులే ఎక్కువ పనులు చేస్తున్నారు. మేడారం నుంచి తాడ్వాయికి 10 కి.మీ. రోడ్డు, పస్రా నుంచి మేడారం వరకు 2 కి.మీ. రోడ్డు మరమ్మతులతో పాటు హోర్డింగ్‌లు, చిత్రాలు తదితర వాటికే ఈ నిధులు ఖర్చు చేస్తున్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల బినామీలు జాతర పనుల్లో ఆరితేరిపోయారని, అంచనాలు పెంచేసి అధికారులతో కుమ్మక్కై నిధులకు కన్నం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్తు, దేవాదాయ శాఖ పనుల్లోనూ భారీగా అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

## జంపన్నవాగులో కాసుల పంట!

పారిశుధ్యం కోసం రూ.7.84 కోట్లు కేటాయించారు. ఈ నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జాతరలో ఎక్కడ చూసిన చెత్తాచెదారం, జంతువుల వ్యర్థాలే. జాతర ముగిసిన తరువాత మమ అనిపించటం తప్ప చేసే పని ఉండదు. నీటి పారుదల శాఖకు రూ.6.11 కోట్లు కేటాయించారు. జంపన్నవాగులో 354 బ్యాటరీ ఆఫ్ ట్యాప్ (బీవోటీ)లు, 152 మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, వాగులో 2.3 కి.మీ. మేర ఇసుక చదును చేయడం, 29 ఊటబావుల్లో పూడిక తీయడానికి ఈ నిధులు ఖర్చు చేస్తున్నారు. పాత పైపులైన్లకే కనెక్షన్ ఇచ్చి కొత్తగా బిల్లుల పొందటం కాంట్రాక్టర్లకు, వారికి సహకరించటం అధికారులకు అలవాటేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి పారుదల శాఖ పనులైతే జంపన్నవాగులో లక్షలు ఏరుకోవటమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టే పనులకు రూ.5.25 కోట్లు కేటాయించారు. అయితే ఎక్కడెక్కడ ఏం పని చేస్తున్నారో చెప్పకుండా ఇంజనీరింగ్ అధికారులు దాటవేస్తున్నారు.

## ఆడిటింగ్, క్వాలిటీ తనిఖీలు లేవు

మేడారం జాతర పనులంటేనే కాంట్రాక్టర్లకు పండుగ. నిధులను ప్రభుత్వం ముందుగానే జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేస్తుంది. అధికారులు వేసిన అంచనా ప్రకారమే నిధులు మంజూరు చేస్తారు. పనులపై ఎలాంటి ఆడిటింగ్ చేయరు. దీంతో పాటు కాంట్రాక్టర్లకు అనుకూల అధికారులే కొలతలు తీసి బిల్లులు తయారు చేస్తారు. ఆయా శాఖల్లో కొంతమంది ఉన్నతాధికారులతో పాటు కిందిస్థాయి అధికారులతో ముందే పర్సంటేజీల ఒప్పందం ఉంటుంది కాబట్టి కొలతల్లోనే ఎక్కువగా చూపించి బిల్లులు అదే స్థాయిలో కాజేస్తారనే ఆరోపణలున్నాయి. ఇక పనుల్లో క్వాలిటీ తనిఖీ చేసే నాథుడు ఉండరు. జాతర ప్రారంభమయ్యే రోజు వరకు కూడా పనులు పూర్తి కావు. ఇది కాంట్రాక్టర్ల 'ముందు జాగ్రత్త'లో భాగమేననే ఆరోపణలున్నాయి. ఏదైనా పాడైతే భక్తులు విరగ్గొట్టారు.. చెడగొట్టారు అనే సాకులు చెప్పేస్తారు. పనులపై ఎవరైనా ఫిర్యాదు చేసినా విజిలెన్స్ విచారణకు అవకాశం ఉండదు. దీంతో మేడారం పనులంటే కాంట్రాక్టర్లకు పండుగే అంటుంటారు.

# ఎమ్మెస్పీకి పంచవర్ష ప్రణాళిక!

## పప్పులు, మొక్కజొన్న, పత్తి పంటలను ఐదేళ్లపాటు కనీస మద్దతు ధరకు కొంటాం

» రైతులతో చర్చల్లో కేంద్రం ప్రతిపాదన.. తిరస్కరించిన రైతు నేతలు



రైతు నేతలతో చర్చలో అర్జున్, గోయల్, నిత్యానంద్. చిత్రంలో భగవంత్‌మాన్

చండీగఢ్, ఫిబ్రవరి 19: 'చలో ఢిల్లీ' పేరిట ఆందోళన చేస్తున్న రైతుల ముందుకు 'పంచవర్ష ప్రణాళిక' ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వం వచ్చింది. పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటలను ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా ఐదేళ్లపాటు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కి కొనుగోలు చేస్తామని ముగ్గురు కేంద్ర మంత్రులతో కూడిన బృందం ప్రతిపాదించింది. అయితే, కేంద్రం చేసిన ఈ ప్రతిపాదనను రైతు నేతలు తిరస్కరించారు. కేంద్ర ప్రతిపాదనతో రైతులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. చలో ఢిల్లీని బుధవారం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిజానికి, ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఆందోళన చేస్తున్న రైతులతో కేంద్రం జరిపిన నాలుగో విడత చర్చలు ముగిశాయి. ఆదివారం రాత్రి 8.15 గంటలకు ప్రారంభమైన ఈ చర్చలు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. కేంద్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, పియూష్ గోయెల్, నిత్యానంద్ రాయ్.. రైతు నేతలతో చర్చించారు. రైతు నేతలతోపాటు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కూడా పాల్గొన్నారు. చర్చల తర్వాత గోయెల్ మాట్లాడుతూ.. రైతు నేతలు లేవనెత్తిన పలు అంశాలపై సానుకూలంగా చర్చించామని చెప్పారు. పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటనలను ఐదేళ్లపాటు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రతిపాదించినట్టు చెప్పారు. నేషనల్ కోపరేటివ్ కన్జుమర్స్ ఫెడరేషన్ (ఎన్‌సీసీఎఫ్), నేషనల్ అగ్రికల్చర్ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఏఎఫ్ఈడీ) వంటి సహకార సంఘాలు.. ఆయా పంటలు వేసే రైతులతో ఐదేళ్ల కాలానికి ఒప్పందం చేసుకుంటాయని గోయెల్ తెలిపారు. అలాగే కొనుగోలు పరిణామానికి ఎలాంటి పరిమితి ఉండబోదని, దీనికోసం ఓ పోర్టల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అయితే, రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ సోమవారం రాత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రతిపాదనపై తమ సంఘాలతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని లేదా చలో ఢిల్లీ బుధవారం శాంతియుతంగా కొనసాగేందుకు ప్రభుత్వం సహకరించాలని రైతు నేత సర్వాన్ సింగ్ పంధేర్ పేర్కొన్నారు. కాగా, రైతులతో మరోసారి చర్చించే అవకాశం ఉందా..? అన్న ప్రశ్నకు కేంద్ర మంత్రి గోయెల్ సమాధానమిస్తూ.. తమ ప్రతిపాదనలపై రైతులు చర్చించి ఆందోళన విరమిస్తే... వారు కోరినట్టుగానే ప్రభుత్వం వారితో చర్చిస్తుందని చెప్పారు.

## ఈడీ విచారణకు కేజ్రీవాల్ ఆరోసారీ డుమ్మా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వరుసగా ఆరోసారి ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. తాజాగా ఇటీవల ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు సోమవారం ఆయన ఈడీ విచారణకు హాజరు కావాల్సి ఉండగా ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఏడోసారి కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. తొలుత జారీ చేసిన నోటీసులను కేజ్రీవాల్ పట్టించుకోకపోవడంతో ఆయన తప్పు చేసినట్టు స్థానిక కోర్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిందని, దీంతో ఆయనకు తాజాగా నోటీసులు జారీ చేయనున్నామని ఈడీ వర్గాలు వెల్లడించాయి.

## జై శ్రీరామ్ జెండా తొలగించిన కమల్‌నాథ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ ఢిల్లీలోని తన ఇంటిపై నుంచి జై శ్రీరామ్ అని రాసి ఉన్న జెండాను తొలగించారు. గతేడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ఘోర పరాజయం చవిచూసింది. దాంతో అధిష్ఠానం ఆయన్ను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ పదవి నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో కమల్‌నాథ్ ఆయన కుమారుడు బీజేపీలో చేరతారనే వార్తలొచ్చాయి. ఆ వార్తలను ఆయన ఖండించనప్పటికీ ఇంటిపై నుంచి 'జైశ్రీరామ్' జెండాను మాత్రం సోమవారం తొలగించారు. కాగా కమల్‌నాథ్ బీజేపీలో చేరతారన్న వార్తలను కాంగ్రెస్ వర్గాలు కొట్టిపారేశాయి.

## బెంగాల్ సీఎస్, డీజీపీలకు 'సుప్రీం'లో ఊరట

న్యూఢిల్లీ, కోల్‌కతా, ఫిబ్రవరి 19: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర అధికారులకు లోక్‌సభ హక్కుల కమిటీ జారీ చేసిన నోటీసులపై సోమవారం సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. తన పట్ల దుష్ప్రవర్తనతో వ్యవహరించారంటూ బీజేపీ ఎంపీ సుకాంత్ మజుందార్ చేసిన ఫిర్యాదు మేరకు సభా హక్కుల సంఘం నోటీసులు ఇవ్వగా దాన్ని సవాలు చేస్తూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాంతో వారికి ఊరట కలిగేలా న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఘర్షణలు జరుగుతున్న సందేశ్‌కాలీ గ్రామానికి వెళ్లడానికి గతవారంలో మజుందార్ ప్రయత్నించగా ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. అధికారులు తన హక్కులకు భంగం కలిగించారంటూ ఆయన ఈనెల 15న సభాహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. అదే రోజు సభా హక్కుల సంఘం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి భగవతి ప్రసాద్ గోపాలిక, డీజీపీ రాజీవ్ కుమార్, ఉత్తర 14 పరగణాల జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చింది.

## యూపీలో కాంగ్రెస్‌కు 17 ఎంపీ స్థానాలిస్తాం

### సరేనంటేనే రాహుల్ యాత్రకు అఖిలేశ్: సమాజ్‌వాదీ పార్టీ

లఖ్‌నవూ, ఫిబ్రవరి 19: విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వాముల నడుమ దాగుడుమూతలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా యూపీలో కాంగ్రెస్‌తో సమాజ్‌వాదీ పార్టీ సీట్ల బేరాలాడుతోంది. మొత్తం 80ఎంపీ స్థానాలకు గతంలో 11 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు ఇస్తామని ప్రతిపాదించిన ఆ పార్టీ.. ఇప్పుడా సంఖ్యను 17కి పెంచింది. ఇదే తమ తుది నిర్ణయమని.. ఇందుకు అంగీకరిస్తేనే తమ అధినేత అఖిలేశ్ యాదవ్ మంగళవారం రాయ్‌బరేలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో పాల్గొంటారని సమాజ్‌వాదీ ముఖ్య అధికార ప్రతినిధి రాజేంద్ర చౌధరి సోమవారమిక్కడ స్పష్టం చేశారు. కాగా 11 స్థానాలకు సమాజ్‌వాదీ తన అభ్యర్థులను ప్రకటించింది. గత నెల 30న 16 మంది అభ్యర్థులతో సమాజ్‌వాదీ తొలి జాబితా విడుదల చేసింది.

## 'ఆధార్'ల డీయాక్టివేషన్‌పై ప్రధానికి మమత లేఖ

కోల్‌కతా, ఫిబ్రవరి19: పశ్చిమ బెంగాల్‌లోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన వారి ఆధార్ కార్డులను కేంద్రం డీయాక్టివేట్ చేస్తోందని రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ముందు ఇలాంటి చర్యల వల్ల సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆటంకం కలుగుతుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె ప్రధానికి లేఖ రాశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, ఓబీసీవర్గాల వారి ఆధార్ కార్డులు డీయాక్టివేట్ అయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా యూఐడీఏఐ సదరు వ్యక్తుల కు నేరుగా లేఖలు జారీ చేసిందని మమత పేర్కొన్నారు. కాగా ఆధార్ నంబర్లు డీయాక్టివేట్ కాలేదని, డేటాబేస్ అప్‌డేషన్‌లో భాగంగా తలెత్తిన సాంకేతిక లోపం వల్లే అలా జరిగిందని యూఐడీఏఐ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

## ఫ్రాన్స్ పాస్‌పోర్టు అత్యంత శక్తిమంతం

» 84 నుంచి 85వ స్థానానికి పడిపోయిన ఇండియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి19: ఆయాదేశాల పాస్‌పోర్టు బలాబలాలను ఆధారంగా హెన్లీ సంస్థ పాస్‌పోర్టు ర్యాంకులను విడుదల చేసింది. ఫ్రాన్స్ పాస్‌పోర్టు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. ఫ్రాన్ పాస్‌పోర్టుతో వీసాలేకుండా 194 దేశాలకు ప్రయాణించవచ్చు. గతేడాది ఇండియా పాస్‌పోర్టుతో వీసాలేకుండా 60 దేశాలు అనుమతించగా ఈ ఏడాది ఆ సంఖ్య 62కు పెరిగింది. అయితే ర్యాంకింగుల్లో 84 నుంచి 85కు పడిపోయింది. పాకిస్థాన్ తన 106వ స్థానాన్ని నిలబెట్టుకుంది. మాల్దీవులు 58వ స్థానంలో ఉంది. ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో వరుసగా జర్మనీ, ఇటలీ, జపాన్, సింగపూర్, స్పెయిన్ ఉన్నాయి.

## నా భర్తను పుతిన్ చంపేశారు: నావల్నీ భార్య

మాస్కో, ఫిబ్రవరి 19: మూడ్రోజుల క్రితం తన భర్తను దేశ అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ చంపేశారని అలెక్సీ నావల్నీ భార్య యులియా నావల్నయా సోమవారం ఆరోపించారు. రష్యా ప్రతిపక్షనేత అలెక్సీ నావల్నీ ఈ నెల 16న జైలులో హఠాన్మరణం పాలైన సంగతి తెలిసిందే. నావల్నీ పనులను తాను కొనసాగిస్తానని, మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం కొనసాగిస్తానని సోమవారం ఓ వీడియోలో యులియా నావల్నయా తెలిపారు. తనకు మద్దతుగా నిలవాలని నావల్నీ మద్దతుదారులను ఆమె కోరారు. ఇదిలా ఉండగా.. నావల్నీ హఠాన్మరణంపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజాగా ఓ వార్తా పత్రిక కథనం చర్చనీయాంశంగా మారింది. మార్చురీకి వచ్చేసరికి నావల్నీ తల, ఛాతిపై గాయాలున్నట్టుగా ఓ వైద్య నిపుణుడిని ఉటంకిస్తూ రష్యా పత్రిక కథనం వెలువడటంతో ఆయన మరణించిన పరిస్థితులపై అనుమానాలు బలపడుతున్నాయి.

## అయోధ్యకు పిలవకుండా రాష్ట్రపతిని అవమానించారు

ప్రతాప్‌గఢ్, ఫిబ్రవరి 19: రాష్ట్రపతి సహా దళితులు, వెనుకబడిన వర్గాలకు చెందిన వారిని అయోధ్య ఆలయ ప్రతిష్ఠాపన వేడుకకు ఆహ్వానించకుండా అవమానించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. పారిశ్రామికవేత్తలు, అమితాబ్ బచ్చన్ వంటి వారందరినీ ఆహ్వానించారని రాహుల్ పేర్కొన్నారు. దీనిద్వారా దేశంలోని 73 శాతంగా ప్రజలకు ఏ ప్రాముఖ్యతా లేదని మోదీ తేల్చి చెప్పినట్లు అయిందని రాహుల్ విమర్శించారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా రామ్‌పూర్ ఖాస్ అసెంబ్లీ నియోజకవర్గంలోని లాల్‌గంజ్ ఇందిరా చౌక్ వద్ద సోమవారం జరిగిన సభలో రాహుల్ మాట్లాడారు. దేశ జనాభాలో 73 శాతంగా ఉన్న దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజన ప్రజలను బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. రైతుల జేబులు కొట్టి ధనవంతుల జేబులు నింపుతున్నారంటూ మోదీపై రాహుల్ ధ్వజమెత్తారు. యువతకు ఉపాధి కల్పించడంలో, మహిళలకు భద్రత ఇవ్వడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలను ప్రధాని మోదీ వేధిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. లాల్‌గంజ్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు రాహుల్‌కు స్వాగతం పలికారు.


# కాలచక్రం ఇప్పుడు మనవైపు!

## ఎన్నో రంగాల్లో మన దేశం ఫస్టు.. ప్రపంచానికి దిక్సూచిగా మారింది

» 'భారత్' దేవాలయ నిర్మాణ బాధ్యతను దేవుడు నాకు అప్పగించాడు: మోదీ

» యూపీలో కల్కిధామ్ గుడికి శంకుస్థాపన

సంభల్/లఖ్‌నవూ, ఫిబ్రవరి 19: కాలచక్రం ఇప్పుడు భారత్ వైపు తిరిగిందని ప్రధాని మోదీ అన్నారు. మన దేశం ఎన్నో రంగాల్లో మొదటి స్థానంలో నిలిచిందని.. ప్రపంచానికి ఉదాహరణగా, దిక్సూచిగా నిలుస్తోందని తెలిపారు. సోమవారం యూపీలోని సంభల్‌లో శ్రీ కల్కి ధామ్ ఆలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్వయంగా మోదీ వద్దకు వెళ్లి ఆహ్వానించినందుకే ఈ ఆలయ నిర్మాణ ట్రస్టు చైర్మన్, కల్కిధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రమోద్ కృష్ణమ్‌ను పార్టీ నుంచి కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. గత నెల 22న అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కొత్త జీవన చక్రం మొదలైందని తాను చెప్పానని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'అయోధ్యారాముడు వేల సంవత్సరాలు ప్రభావితం చేశాడు. అదే విధంగా అయోధ్యలో బాలక్‌రామ్ ప్రతిష్ఠాపనతో వచ్చే వెయ్యేళ్లకు భారత కొత్త ప్రయాణం ప్రారంభమైంది. భారత్ అనే జాతిస్వరూప ఆలయాన్ని నిర్మించే బాధ్యతను భగవంతుడు నాకు అప్పగించాడు. ఈ కర్తవ్య నిర్వహణలో సాధు సంతులు నాకు ఆశీస్సులు అందించాలి. ఓవైపు తీర్థయాత్రా స్థలాలను అభివృద్ధి చేస్తున్నాం. మరోవైపు నగరాల్లో హైటెక్ మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఆలయాలతోపాటు దేశవ్యాప్తంగా కొత్త వైద్య కళాశాలలు కూడా నిర్మిస్తున్నాం. విదేశాల్లో ఉన్న మన ప్రాచీన శిల్పసంపదను తిరిగి స్వదేశానికి తీసుకొస్తున్నాం. ఇదే సమయంలో రికార్డు స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. కాలచక్రం మారుతోందనడానికి.. నవశకం మన తలుపులు తడుతోందనడానికి ఈ మార్పే నిదర్శనం. మనం దానిని నిండుహృదయంతో స్వాగతిద్దాం' అని పేర్కొన్నారు. తొలి సారి భారత్ ఇతర దేశాలను అనుసరించడం లేదని.. తానే ఉదాహరణగా నిలుస్తోందని తెలిపారు. టెక్నాలజీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో అవకాశాల కేంద్రంగా భారత్ ఆవిర్భవించిందన్నారు. మనదేశానికి 'ఇన్నోవేషన్ హబ్'గా గుర్తింపు లభించిందని తెలిపారు. మొదటిసారి మన దేశం ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరామని గుర్తుచేశారు. 'గత నెలలో అయోధ్యలో రామ్‌లల్లాకు ప్రాణప్రతిష్ఠ చేశాం. ఐదు శతాబ్దాల ఎదురుచూపులకు తెరపడింది. ఆ దైవానుభవం, ఆ ఆధ్యాత్మిక భావన ఇప్పటికీ ఉద్వేగభరితం చేస్తోంది. అలాగే అరబ్ గడ్డపై అబూదాబీలో అతి భారీ దేవాలయాన్ని ప్రారంభించాం. విశ్వనాథ్ ధామ్ పురోగతిని, కాశీ పునరుజ్జీవాన్ని, ఉజ్జయిని మహాకాల్ మహాలోక్ వైభవాన్ని తిలకిస్తున్నాం. సోమనాథ్ అభివృద్ధిని, కేదార లోయ పునర్నిర్మాణాన్ని కూడా చూస్తున్నాం. వారసత్వంతో కూడిన అభివృద్ధి అనే మంత్రాన్ని పాటిస్తున్నాం. ఓటమి నుంచి కూడా విజయాన్ని అందుకోగల దేశం ఇండియా. ఎన్నో సార్లు దాడులు, దండయాత్రలకు గురైంది. మరే దేశంపైన గానీ, సంస్కృతిపైన గానీ ఇలాంటి దాడులు కొనసాగి ఉంటే అది పూర్తిగా నాశనమయ్యేది. కానీ వాటిని మనం తట్టుకుని శక్తిమంతంగా ఎదిగాం' అని తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రవచించిన జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగానికి కలిపితే ఏర్పడే రూపమే ప్రధాని మోదీ అని ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి కూడా పాల్గొన్నారు.



కల్కిధామ్ గుడికి శంకుస్థాపన చేస్తున్న మోదీ

### వ్యవసాయంలో కొత్త పుంతలకు చేయూత

వ్యవసాయంలో కొత్త పుంతలు తొక్కేలా రైతులకు కేంద్రం చేయూతనిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని భోజన బల్లలపై భారతీయ ఆహార ఉత్పత్తులు ఉండేలా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు మరోసారి భారీ ఉద్యమానికి సమాయత్తమైన తరుణంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. సోమవారమిక్కడ రూ.10 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టే 14 వేల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉత్పాదకత, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్‌ప్రాసెసింగ్, గృహనిర్మాణం, ఆతిథ్యం, వినోదం, విద్య, స్థిరాస్తి రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులివి. తర్వాత ఇన్వెస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలు అద్భుత ఆహారమని.. ఈ రంగంలో పెట్టుబడులకు ఇదే అనువైన సమయమని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో గంగానదీతీరాన పెద్దఎత్తున ప్రకృతి సాగు జరుగుతోందని ప్రస్తావించారు. ఇది రైతులకు లాభసాటిగా ఉండడమే గాకుండా పవిత్ర జలాల పవిత్రతను సంరక్షిస్తుందన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ రంగ పారిశ్రామికవేత్తలు రైతులతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## లోకం తీరు




### భర్త అంత్యక్రియలపై
## ఇద్దరు భార్యల గొడవ

» వివాదానికి మద్రాస్ హైకోర్టు తెర

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భర్తకు అంత్యక్రియలు తమ మతం ప్రకారమే జరపాలంటూ ఆయన ఇద్దరు భార్యలు పట్టుపట్టగా... సమస్యకు మద్రాస్ హైకోర్టు వినూత్న పరిష్కారం చూపింది. భౌతికకాయానికి హిందూమతం ప్రకారం సంప్రదాయ పూజలు నిర్వహించి, ముస్లిం మతం ప్రకారం ఖననం చేయాలని సూచించింది. కారైక్కుడి బర్మాకాలనీ వళ్లువర్ నగర్‌కు చెందిన బాలసుబ్రమణ్యన్ అలియాస్ అన్వర్ హుస్సేన్(59) రాష్ట్ర రవాణా శాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన 36 ఏళ్ల క్రితం శాంతి అనే మహిళను వివాహం చేసుకోగా, వారికి ఒక కుమార్తె ఉంది. శాంతితో ఏర్పడిన విభేదాల కారణంగా ఆమె నుంచి విడిపోయిన బాలసుబ్రమణ్యన్.. తిరుపాలకుడి ప్రాంతానికి చెందిన సయ్యద్ అలిఫాతిమా అనే మహిళను 28 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. అనంతర కాలంలో అతను ముస్లిం మతం స్వీకరించి అన్వర్ హుస్సేన్‌గా పేరు మార్చుకున్నారు. పది రోజుల క్రితం గుండెపోటుతో మదురైలోని ప్రభుత్వాసుపత్రిలో చేరిన అన్వర్ హుస్సేన్.. రెండు రోజుల క్రితం మరణించారు. దీంతో ముస్లిం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించేందుకు భార్య ఫాతిమా ఏర్పాట్లు చేయగా.. మొదటిభార్య శాంతి వచ్చి తమ స్వగ్రామంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తామని పట్టుబట్టారు. పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో న్యాయస్థానంలో తేల్చుకోవాలంటూ.. మృతదేహాన్ని కారైక్కుడి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. భార్యలిద్దరూ హైకోర్టు మదురై ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వామినాథన్.. అన్వర్ హుస్సేన్ భౌతికకాయానికి హిందూ మతం ప్రకారం సంప్రదాయపూజలు నిర్వహించి, ముస్లిం మతం ప్రకారం ఖననం చేయాలని సూచించారు.

### ఇప్పటికైతే శరద్ వర్గానికి
## అదే పేరు

» ఎన్‌సీపీ-శరద్‌చంద్ర పవార్‌గా కొనసాగింపు.. సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) వివాదం విషయంలో సోమవారం సుప్రీంకోర్టు కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రస్తుతానికి శరద్ పవార్ వర్గం తమ పార్టీ పేరును ఎన్‌సీపీ-శరద్‌చంద్ర పవార్‌గా కొనసాగించుకోవచ్చని తెలిపింది. ఈ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించే విషయమై వారం రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి సూచించింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆధ్వర్యంలోనిదే నిజమైన ఎన్‌సీపీ అని ఈ నెల ఆరో తేదీన ఎన్నికల సంఘం ప్రకటించింది. శరద్ పవార్ వర్గాన్ని ఎన్‌సీపీ-శరద్‌చంద్ర పవార్‌గా పేర్కొంటూ మరుసటి రోజైన ఏడో తేదీన మరో ఉత్తర్వులు ఇచ్చింది. ఇది తాత్కాలిక ఏర్పాటు అని, రాజ్యసభ ఎన్నికలు జరిగే ఈ నెల 27 వరకే ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు తమ వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకూడదంటూ ప్రత్యర్థి అజిత్ పవార్ కూడా కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరాలు చెప్పేందుకు అజిత్ పవార్ వర్గానికి వారం రోజుల గడువు ఇచ్చింది. దానిపై వివరణ ఇచ్చేందుకు శరద్ పవార్ వర్గానికి మరో రెండు వారాల సమయం ఇచ్చింది. విచారణ సందర్భంగా జస్టిస్ విశ్వనాథన్ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. పాకిస్థాన్ ఎన్నికలతో పోల్చడం సరికాకపోయినా అక్కడ బ్యాట్ గుర్తు కావాలని ఒకరు అడిగారు, దాన్ని ఇవ్వలేదు, తరువాత చాలా జరిగిందని అన్నారు. ఓటరు మాటకు విలువ ఇవ్వాలని వ్యాఖ్యానించారు. కోర్టు ఆదేశాలపై శరద్‌పవార్ హర్షం వ్యక్తం చేశారు.

### రిటర్నింగ్ అధికారిపై
## చర్యలు తప్పవు!

### అనిల్ మాసిహ్‌ను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనన్న సుప్రీంకోర్టు

» చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలపై తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఎనిమిదిమంది కౌన్సిలర్ల బ్యాలెట్ పేపర్లపై 'ఎక్స్' అని రాసి, వారి ఓట్లు చెల్లకుండా చేసిన రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఒక రిటర్నింగ్ అధికారి జోక్యం చేసుకోవడం ఘోరమైన విషయమని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లను ఇప్పటికే కొనేస్తున్నందున మరోసారి ఎన్నిక జరపడం కంటే.. ఏ రాజకీయ పార్టీతోనూ అనుబంధం లేని మరో రిటర్నింగ్ అధికారితో అవే ఓట్లను తిరిగి లెక్కించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. పంజాబ్-హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆధీనంలో ఉన్న బ్యాలెట్ పేపర్లను మంగళవారం తమ ముందు ప్రవేశపెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వాటిని మంగళవారం పరిశీలించనున్నట్టు తెలిపింది. దీంతోపాటు కౌంటింగ్ రోజు ఏం జరిగిందో రికార్డయిన వీడియో మొత్తాన్నీ పరిశీలిస్తామని పేర్కొంది. ఆ రికార్డులన్నింటినీ సురక్షితంగా ఢిల్లీకి తీసుకొచ్చేందుకు ఒక జుడీషియల్ అధికారిని నియమించాలని పంజాబ్-హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అసలు మొత్తం ఎన్నికల క్రమంలోనే అవకతవకలుండడం వల్ల రాజకీయ పార్టీలు కౌన్సిలర్లను కొనేస్తున్నాయని జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన బీజేపీ నేత మనోజ్ సోంకర్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. అదే సమయంలో ఆప్ కౌన్సిలర్లు పూనం దేవి, నేహా ముసావత్, గురుచరణ్ కాలా బీజేపీలో చేరడం గమనార్హం. ఈ ముగ్గురూ సోమవారం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్‌తావడే సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

ఒక రిటర్నింగ్ అధికారిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నల వర్షం కురిపించడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి. చండీగఢ్ మునిసిపాలిటీలో నామినేటెడ్ సభ్యుడైన బీజేపీ నేత అనిల్ మాసిహ్ మేయర్ ఎన్నిక కోసం జరిగిన ఓటింగ్‌లో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. కాగా, అనిల్ మాసిహ్ రాజకీయ వేదికపై లేరని, న్యాయస్థానం ముందున్నారని గుర్తుంచుకోవాలని సీజేఐ స్పష్టం చేశారు.

### స్వతంత్ర భారతంలో ఇదే తొలిసారి..

ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. సీసీటీవీలో రికార్డయిన వీడియోను తాము చూశామని సీజేఐ తెలిపారు. కెమెరా వైపు చూస్తూ బాలట్ పేపర్లపై 'ఎక్స్' అని రాయడం గురించి అనిల్‌ను ప్రశ్నించారు. కొన్ని బ్యాలెట్ పేపర్లపై 'ఎక్స్' అని రాసి ట్రేలో పెట్టిన విషయం తాము గమనించామన్నారు. దీంతో తాను ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై 'ఎక్స్' అని రాసి, పక్కన పెట్టేసిన విషయాన్ని అనిల్ అంగీకరించారు. అసలెందుకు 'ఎక్స్' గుర్తులు వేయాల్సి వచ్చిందని సీజేఐ నిలదీశారు. ఏ చట్టం ప్రకారం అలా చేశారని ప్రశ్నించారు. 'రిటర్నింగ్ అధికారిగా ప్రతి బ్యాలెట్ పేపర్ పై సంతకం మాత్రమే చేయడం మీ పని కాదా!' అని అడిగారు. రిటర్నింగ్ అధికారిగా తన విధులను ఉల్లంఘించినందున అనిల్‌పై ప్రాసిక్యూషన్ తప్పదన్నారు.

### రాజ్యసభ ఎన్నికల్లో
## ఎన్డీయే అడ్డదార్లు

### కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజ్యసభ ఎన్నికల్లో విజయం కోసం ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు అడ్డదారులు తొక్కుతున్నాయని, తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభ పెడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి ఫోన్‌చేసి పలు ఆఫర్లు ఇస్తున్నారని అన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమేనని బెదిరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్‌కు 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, మరో ఇద్దరు ఇండిపెండెంట్ల మద్దతు కూడా తమకే ఉందని శివకుమార్ చెప్పారు. ఈ లెక్కన బరిలో నిలబడ్డ ముగ్గురు అభ్యర్థులు తొలిరౌండులోనే గెలవడం ఖాయమన్నారు. శాసనసభలో తగిన బలం లేకపోయినా ప్రతిపక్షాలు రెండో అభ్యర్థిని బరిలోకి దించడం వెనుక బేరసారాల వ్యూహమే ఉందని తెలిపారు.

## సిద్దరామయ్యకు సుప్రీంలో ఊరట

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత హోదాలో రాస్తారోకో చేసి, వివాదంలో చిక్కుకున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు సుప్రీంకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. హైకోర్టు ధర్మాసనం విధించిన జరిమానా, మార్చి 6న ప్రత్యేక కోర్టు ముందు హాజరుకావాలనే తీర్పును సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేసింది. కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఆత్మహత్యకు నిరసనగా 2022లో నాటి విపక్షం బెంగళూరు నగరంలో రాస్తారోకో చేసింది. ఈ వ్యవహారంలో సిద్దరామయ్య, రణదీప్ సూర్జేవాలా సహా పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైంది. కేసును విచారించిన కర్ణాటక హైకోర్టు.. సీఎం సిద్దరామయ్యకు, మరికొందరికి రూ.10వేల ప్రకారం జరిమానా విధించింది. హైకోర్టు తీర్పును సీఎం సిద్దరామయ్య సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

# పతనం అంచున హమాస్

## ఇప్పటికే కీలక కమాండర్ల మృతి

» లొంగు'బాట'లో చాలా మంది ఫైటర్లు

» ఇజ్రాయెల్ శపథం నెరవేరుతోందా?

"హమా‌స్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం..! ప్రతి హమాస్ ఉగ్రవాదిని వేటాడి చంపేస్తాం..!!" గత ఏడాది అక్టోబరు 7న హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు చేసిన శపథం ఇది..! గాజాపై అక్టోబరు 28 నుంచి భూతల దాడులు ప్రారంభించిన ఇజ్రాయెల్.. మధ్యలో సంధికాలంలో(ఆరు రోజులు) తప్ప.. 115 రోజులుగా నిరాటంకంగా పోరాటం చేస్తూనే ఉంది. ఓ క్రమ పద్ధతిలో హమాస్ అగ్రనేతలను మట్టుబెడుతూ వస్తోంది. ముఖ్యంగా అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేశాక.. ఆ దృశ్యాలను లైవ్‌లో చూస్తూ.. 'థాంక్స్ గీవింగ్' ప్రార్థనలు చేసిన ముఖ్య నాయకులను తొలుత టార్గెట్‌గా చేసుకుంది. ఈ క్రమంలో హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యులు జకారియా అబూ ముమ్మార్, ఎలైట్ ఫోర్స్ కమాండర్ అలీ అల్ ఖాదీ, హమాస్ ఆర్థిక విభాగం నేత జవాద్ అబూ షమ్మలా తదితర కీలక హమాస్ నేతలను ఐడీఎఫ్ తుదముట్టించింది. గత నెల లెబనాన్‌లో ఉన్న హమాస్ నేత సలేహ్ అల్-అరౌరీని హతమార్చడంతో హమాస్ పూర్తిగా బలహీనపడ్డట్లయింది. దీంతో మిగిలిన హమాస్ కమాండర్లు ఐడీఎఫ్‌కు లొంగిపోతున్నారు.

### పంటికింద రాయిలా.. ఆ ఐదుగురు!

ఇప్పటి దాకా ఇజ్రాయెల్ కీలక హమాస్ కమాండర్లను తుదముట్టించినా.. పలు బ్రిగేడ్‌ల నాయకులు లొంగిపోయినా.. ఓ ఐదుగురు మాత్రం పంటికింద రాయిలా మిగిలిపోయారు. వారిలో తొలి స్థానంలో ఇస్మాయిల్ హనియే ఉన్నారు. ఈయన 2017 నుంచి హమాస్ పొలిటికల్ బ్యూరో అధిపతిగా కొనసాగుతున్నారు. గతంలో గాజాస్ట్రిప్‌ను హమాస్ స్వాధీనం చేసుకోవడంలో, అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడిలో ఇతను కీలక సూత్రధారి. ఆయన తర్వాతి స్థానంలో ఖలీద్ మెషాల్ ఉన్నారు. ఇక హమాస్ సైనిక విభాగం-పొలిటికల్ బ్యూరో మధ్య సంధానకర్తగా పనిచేస్తున్న ఫాతిమా హమాద్ ఇప్పుడు తుర్కియేలో తలదాచుకుంటున్నారు. ఇజ్రాయెల్‌పై దాడిలో కీలకంగా వ్యవహరించిన యాహ్యా సిన్వార్ కూడా ఇజ్రాయెల్‌కు చిక్కడు-దొరకడు అన్నట్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతని వ్యూహాలు అత్యంత క్రూరంగా ఉంటాయి. ఇక ఇజ్రాయెల్‌కు దొరకకుండా ముప్పుతిప్పలు పెడుతున్న మూసా అబూ మర్జౌక్ జోర్డాన్‌లో ఉన్నారు. ప్రవాసం నుంచే ఇతను పొలిటికల్ బ్యూరో సీనియర్ సభ్యుడిగా పనిచేస్తున్నారు. హమాస్ అగ్రనేత అల్-ఖాసం మహమ్మద్ అల్-డైఫ్ కూడా ఇజ్రాయెల్‌కు మింగుడుపడడం లేదు.

- సెంట్రల్ డెస్క్



### లెబనాన్‌లోనూ టన్నెల్స్ నెట్‌వర్క్

గాజాలో హమాస్ సొరంగాల నెట్‌వర్క్ మాదిరిగానే.. దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లా కిలోమీటర్ల మేర టన్నెల్స్‌తో భూగర్భంలో తలదాచుకునేలా భారీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు కొన్నేళ్ల క్రితమే ఈ సొరంగాలను నిర్మించినట్లు ఫ్రెంచ్ మిలటరీ స్కూల్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ రీసెర్చ్ వెల్లడించింది. గాజాలోని ఇసుక నేలల్లో సొరంగాలుండగా.. హిజ్బుల్లా టన్నెల్స్ మాత్రం కొండలను తొలిచి నిర్మించినట్లు వివరించింది.

## బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత ఇందిరమ్మదే!

» సేవాలాల్ జయంతి వేడుకల్లో మంత్రి పొంగులేటి



కూసుమంచి, ఫిబ్రవరి 19: బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో సోమవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాన్యుడిగా పుట్టి అసమాన్యుడిగా ఎలా ఎదగాలో ఆచరించి చూపిన మహానుభావుడు సేవాలాల్ అని కొనియాడారు. అందుకే సేవాలాల్ జయంతిని ప్రభుత్వం ఫిబ్రవరి 15 సెలవుదినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయని, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని ఆయన పేర్కొన్నారు.

## ఉద్యోగ నియామకాల్లో ఆడబిడ్డలకు అన్యాయం

» రాష్ట్ర ప్రభుత్వం జీవో 3ని రద్దు చేయాలి

» సోనియా, ఖర్గేలకు ఎమ్మెల్సీ కవిత లేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామకాల్లో మహిళలకు నష్టం కలిగించే జీవో 3ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ అధికారం చేపట్టిన కాంగ్రెస్ తెలంగాణ ఆడబిడ్డలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ జీవో వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆమె లేఖ రాశారు. ఉద్యోగావకాశాల్లో మహిళల హక్కులను హరించేలా రోస్టర్ పాయింట్లు లేని హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మీరైనా చెప్పండి.. జీవో 3ని వెనక్కు తీసుకోమని ఆదేశించండి.. అంటూ సోనియా, ఖర్గేలకు రాసిన లేఖలో కోరారు. ఈ సందర్భంగా సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. రిజర్వేషన్ల స్ఫూర్తిని పక్కనపెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అంటూ కొత్త జీవో తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరుగుతుందని, ఈ అంశంపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

## శివాజీ స్ఫూర్తితో మోదీపై పోరాడుదాం: నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో రైతు వ్యతిరేకి అయిన మోదీపై తిరుగుబాటు చేద్దామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ పిలుపునిచ్చారు. శివాజీ మహరాజ్ జయంతి వేడుకల సందర్భంగా సోమవారం మగ్దుం భవన్‌లో ఛత్రపతి ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాల కోసం శివాజీ తన పాలనలో అనేక సంస్కరణలను అమలు చేశారని చెప్పారు. రైతులను నేరుగా పిలిపించుకుని వారి సమస్యలు తెలుసుకునే వారని వివరించారు. పంట దిగుబడి ఆధారంగా పన్నులు వసూలు చేసేవారని పేర్కొన్నారు. అందుకు భిన్నంగా నేడు మోదీ రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. రైతుల హక్కులను కాపాడుకునేందుకు రైతాంగం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## పింఛన్ డబ్బుల్లో కోత విధిస్తే కఠిన చర్యలు

» వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి ఉత్తర్వులు

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మర్పల్లి, ఫిబ్రవరి 19: ఇంటి పన్ను వసూళ్ల పేరిట పింఛన్ డబ్బుల్లో కోత విధించే గ్రామ పంచాయతీ కార్యదర్శులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్ సొమ్ములో ఇంటి పన్ను పేరిట కోతలపై 'నోటికాడ కూడు లాగేస్తున్నారు..' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు పింఛన్ సొమ్ములో ఇంటి పన్ను మినహాయించుకుని మిగిలిన డబ్బులు ఇవ్వడాన్ని సీరియస్‌గా పరిగణించారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంధ్యారాణి ఆదేశించారు.

## నీటిపారుదలశాఖపై శ్వేతపత్రం విడుదలకు ముందే విపక్షం చేతికి

» బీఆర్ఎస్ కట్టప్పల చర్యేనని భావిస్తున్న ప్రభుత్వం

» సర్కారు సీరియస్.. త్వరలో శాఖలో కొందరి బదిలీ?

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందే నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం విపక్షం చేతిలోకి చేరిందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. శాసనసభలో శ్వేతపత్రంపై అంశాల వారీగా చర్చకు బదులు.. పలు పేజీల్లో చిన్నాచితక తప్పులను విపక్షం ప్రధానంగా ఎత్తిచూపడం వెనుక లీకేజీనే ప్రధాన కారణమని నిర్ణయానికి వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి నమ్మినబంట్లు(కట్టప్పలు), నీటిపారుదలశాఖలోని అధికారులు విపక్షానికి శ్వేతపత్రం అందించడమే కాకుండా, ఆ పత్రాల్లోని దోషాలను మార్కుచేశారని ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేస్తోంది. వీరు ఎవరై ఉంటారా.. అని రెండు రోజులుగా శాఖలో విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో శాఖలో మరింత మందికి స్థానచలనం తప్పదని సమాచారం.

## త్వరలో ఢిల్లీకి కేసీఆర్..?

» పలువురు జాతీయ పార్టీ నేతలను కలిసే అవకాశం!

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలోనే ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఆయన మొదటిసారి దేశరాజధాని పర్యటనకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీల మధ్య పొత్తు ఉంటుందంటూ సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు అలాంటిదేమీ లేదంటూ.. అటు బీజేపీ నేతలు, ఇటు బీఆర్ఎస్ నేతలు కొట్టిపారేస్తున్నారు. ఇరు పార్టీల మధ్య పొత్తుల ప్రసక్తే లేదంటూ రెండు పార్టీలు మీడియా సమావేశాలు పెట్టి మరీ ప్రకటించుకుంటున్నాయి. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎంపీలతో కలిసి కేసీఆర్ ఢిల్లీలో వివిధ జాతీయ పార్టీల నేతలను కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. కేసీఆర్ ఢిల్లీ వెళ్లే సమాచారాన్ని పార్టీ శ్రేణులు ధ్రువీకరించనప్పటికీ.. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంశంపై జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

### కేటీఆర్ అమెరికా పర్యటన

మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటనకు వెళ్లారు. తన సతీమణి శైలిమాతో కలిసి అమెరికాలోని తన కుమారుడిని చూసేందుకుగాను సోమవారం బయలుదేరి వెళ్లిన ఆయన బుధవారం తిరిగి వస్తారని సమాచారం.

## మెడికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఎన్.వాణి



హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మెడికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఎన్.వాణిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీఎంఈ డాక్టర్ త్రివేణిని ఆ బాధ్యతల నుంచి తప్పించి, అడిషనల్ డీఎంఈ హోదాలో సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వాణిని నియమించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది డిసెంబరు 21న డీఎంఈగా ఉన్న రమేశ్‌రెడ్డిని తప్పించి, సీనియారిటీ లిస్టులో మొదటి స్థానంలో ఉన్న త్రివేణికి డీఎంఈగా బాధ్యతలు అప్పగించారు. మరోవైపు సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం కలకలం రేపింది. వైద్యశాఖలో అవినీతిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. తక్షణ చర్యలకు సర్కార్ ఉపక్రమించింది. అందులో భాగంగానే మార్పులు చేర్పులు చేసేందుకు సిద్ధం అయినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.

# గొర్రెల పంపిణీ అక్రమాలపై చర్యలేవి?

» 'కాగ్' నివేదిక ఆధారంగా గత అక్రమాలపై సర్కారు వైఖరి ఏంటన్నది ఉత్కంఠ..

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరించబోయే వైఖరిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పథకాన్ని ప్రారంభించిన తొలి మూడేళ్లలో (2017-20 మధ్యకాలంలో) భారీగా అవినీతి, అక్రమాలు జరగటం, కేసులు కూడా నమోదు కావటం, తాజాగా 'కాగ్' నివేదిక వెలువడిన నేపథ్యంలో అక్రమాలకు బాధ్యులైన అధికారులపై చర్యలుంటాయా? ప్రభుత్వం ఎలాంటి వైఖరి అనుసరిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి ఇప్పటివరకు 4.25 లక్షల మంది గొల్ల, కురుమలకు యూనిట్లు పంపిణీ చేసింది. లబ్ధిదారుల వాటాధనం పోగా ఇప్పటివరకు రూ.3,386 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం ఖర్చు చేసింది. అయితే ఇతర రాష్ట్రాల్లో గొర్రెల ఎంపిక, రవాణా, లబ్ధిదారులకు అప్పగింతలో భారీగా అక్రమాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే 2017-18లో వెటర్నరీ శాఖకు చెందిన 40 మంది అధికారులపై కేసులు నమోదు చేశారు. నామమాత్రంగా చర్యలు తీసుకున్నారు.కొందరిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఆ సమయంలో గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఉన్నతాధికారిపై కూడా ఆరోపణలు వచ్చాయి. కానీ కొద్దిరోజుల్లోనే జిల్లా అధికారులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకున్నారు. నిధులు రికవరీ, శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. 2017 నుంచి 2020 వరకు మూడేళ్ల వ్యవధిలోనే 3.67 లక్షల యూనిట్ల గొర్రెల పంపిణీ జరిగింది. అంటే అక్రమాలన్నీ మొదటి విడతలోనే జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. కానీ ప్రభుత్వ విచారణ దీనిపై జరగటం లేదు. ఇక ఇటీవల రూ.2 కోట్ల నిధులు దారి మళ్లాయి. ఏపీలో గొర్రెలు విక్రయించిన యజమానులకు కాకుండా బోగస్ ఖాతాలకు నిధులు మళ్లించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కొద్దిరోజుల కిందే కేసు నమోదైంది. ఆ కేసును తాజాగా ఏసీబీకి కూడా అప్పగించారు. అయితే అందరి దృష్టి ఈ కేసుపైనే ఉంది. కానీ పశుసంవర్ధకశాఖలో తొలి విడతలో జరిగిన అక్రమాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇటీవల 'కాగ్' నివేదికలోనూ పలు అక్రమాలు బహిర్గతమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో ఒక ద్విచక్ర వాహనంపై 126 గొర్రెలు తరలించినట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక టాటా ఇండికా కారులో 68 గొర్రెలు, ఖమ్మం జిల్లాలో 84 గొర్రెలను అంబులెన్స్‌లో, నల్లగొండలో 126 గొర్రెలను ఒక ఆటోలో తరలించినట్లు కాగ్ విచారణలో తేలింది.

### సమగ్ర విచారణ జరుపుతుందా..?

ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపిస్తుందా? 'కాగ్' నివేదిక ఆధారంగా ఏమైనా చర్యలు తీసుకుంటుందా? ఏసీబీ కేసుకే పరిమితమవుతుందా? అనే చర్చ సాగుతోంది.

# కిషోర్.. కబ్జాలను ఉపేక్షించొద్దు

**ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్లను స్వాధీనం చేసుకోండి.. మునిసిపల్ కార్యదర్శికి సీఎం రేవంత్ ఆదేశం**

» సీఎం సమీక్షలో మొదటి అంశంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'కిషోర్.. ఏం జరుగుతోంది.. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కాలనీలోనే హుడా ప్లాట్‌లను కబ్జా చేయడమేంది.. ఎంతో విలువైన ప్లాట్లను కబ్జా చేస్తే ఇన్నాళ్లు ఏం చేస్తున్నారు.. ప్రభుత్వ భూములు, స్థలాల కబ్జాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు.. ఎమ్మెల్యే కాలనీలో ఆ రెండు ప్లాట్లను వెంటనే స్వాధీనం చేసుకోవాలి" అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నానక్‌రామ్‌గూడాలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హెచ్ ఎండీఏ ఇతర అధికారులతో మొట్టమొదట బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో హెచ్ఎండీఏ ప్లాట్లు అక్రమించడంపై 'దర్జాగా కబ్జా' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఉండే ప్రాంతంలోనే ప్రభుత్వ స్థలాలు కబ్జా కావడమేమిటని ఆరా తీశారు. వెంటనే ఆయా ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలని, ఆ రెండు ప్లాట్లను వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. హెచ్ఎండీఏ భూములు, ప్లాట్లు ఇంకా ఏ ఏ ప్రాంతాల్లో కబ్జాకు గురయ్యాయో గుర్తించాలని, అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే కబ్జాదారులు కోర్టుకెక్కిన అంశాన్ని ఈ సందర్భంగా అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. న్యాయపరంగా కేసులను ఎదుర్కొంటనే స్థలాలను స్వాధీ నం చేసుకోవాలని సీఎం ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

### సమతా కుంభ్ మహోత్సవానికి రండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చిన్న జీయర్ స్వామి భేటీ అయ్యారు. సోమవారం సీఎం నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 20 నుంచి మార్చి 3వరకు జరిగే "సమతా కుంభ్- 2024" శ్రీరామానుజాచార్య - 108 దివ్యదేశాల ద్వితీయ బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ రేవంత్‌ను ఆహ్వానించారు.



కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా కుమారుడు ఆదిత్య వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

### రేపు కోస్గికి సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట: సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 21న నారాయణపేట జిల్లాలోని కోస్గికి రానున్నారు. ఇంతకు ముందు రెండుసార్లు ముఖ్యమంత్రి వస్తారని అధికారులు ఏర్పాట్లు చేయగా.. పలు కారణాలతో పర్యటన రద్దయింది. తాజాగా బుధవారం సీఎం పర్యటన ఖరారైంది. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వెలువడుతుందని జిల్లా అధికారులు చెప్పారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గానికి తొలిసారి రానుండటంతో ఆయన వరాలు కురిపిస్తారని నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కోస్గి మునిసిపల్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో మయాంక్ మిత్తల్ సమీక్ష నిర్వహించారు.

### హస్తినలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల రీత్యా ఢిల్లీకి చేరుకున్నారు. సోమవారం సాయంత్రం, హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో ఢిల్లీకి చేరుకున్న ఆయన మంగళవారం పలువురు కేంద్రమంత్రులతో భేటీ అయ్యే అవకాశం ఉందని తెలిసింది. కేంద్రమంత్రులు నిర్మలాసీతారామన్, అశ్వినీ వైష్ణవ్, హర్దీప్‌సింగ్ పురీలను కలుస్తారని సమాచారం.అలాగే, కాంగ్రెస్ ముఖ్య నేతలతోనూ సమావేశమవుతారని తెలిసింది. కాగా, సోమవారం రాత్రి కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా కుమారుడి వివాహానికి రేవంత్ హాజరయ్యారు.మంగళవారం సాయంత్రం సీఎం తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

## మూసీ ప్రక్షాళనకు సిద్ధమవండి

(మొదటిపేజీ తరువాయి)

పలు సూచనలిచ్చారు. మూసీని ప్రక్షాళన చేయించడానికి సిద్ధమవ్వాలని, దీన్ని అత్యంత ప్రాధామ్యంగా తీసుకోవాలని ఆదేశించారు. తొలిదశలో 55 కిలోమీటర్ల ప్రతిపాదిత అభివృద్ధి పనులకు పరీవాహకం, సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రతిబంధకాలేంటి? మూసీ అభివృద్ధికి, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఎంత భూమి అవసరం అవుతుంది? పరిహారం చెల్లించాల్సి వచ్చే నివాస ప్రాంతాలెన్ని ఉన్నాయి? అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు. మూణ్నెల్లలో కసరత్తు పూర్తవ్వాలన్నారు. "మూసీలోకి నీటిని తీసుకువచ్చే మార్గాలెన్ని ఉన్నాయి? నదిని పూర్తిగా శుభ్రం చేసి మంచి నీటి నిల్వకు చర్యలు తీసుకోవాలి. అందుకోసం జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి నీటిని మళ్లించాలి. ఇందుకోసం తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయండి" అని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో అభివృద్ధి జరిగాక.. ఒకవేళ వరదలు వస్తే.. దాని తీవ్రత ఎంత ఉంటుందని, ఆ ప్రభావిత ప్రాంతాలు ఎన్ని ఉంటాయని ప్రశ్నించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్‌టీపీ)ల నుంచి కూడా శుద్ధి చేసిన నీటిని ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా మూసీకి మళ్లించాలని సీఎం ఆదేశించారు. దానికి అధికారులు స్పందిస్తూ.. ప్రస్తుతం మూసీ పరీవాహక ప్రాంతాల్లో 31 ఎస్‌టీపీల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆగస్టు నాటికి ఆ పనులు పూర్తవుతాయని వివరించారు. అయితే.. అదనపు ఎస్‌టీపీలను నిర్మించి.. వాటి సంఖ్యను 39కి పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

### తొలి దశకు రూ.10 వేల కోట్లు?

మూసీ ప్రక్షాళనతోపాటు.. తొలి దశ అభివృద్ధి పనులకు సుమారు రూ.10 వేల కోట్ల బడ్జెట్ అవసరం అవుతుందనే ప్రాథమిక అంచనాలను అధికారులు సీఎం ముందు పెట్టినట్లు తెలిసింది. మూసీ ప్రక్షాళన, భూసేకరణ, చేయాల్సిన పనులకు సంబంధించిన డిజైన్లకు ఆమోదం లభించాక ఏయే పనులకు ఎంత మేర నిధుల అవసరం అని తేలే అవకాశాలున్నాయి. ఈ సమీక్షలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మెట్రో వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ మునిసిపల్ కార్యాలయం ఎదురుగా మాజీ మేయర్ మేకల కావ్య, ఇతర కార్పొరేటర్లు

## జవహర్‌నగర్‌లో బీఆర్ఎస్ మేయర్ ఔట్

» మేయర్ సహా అంతా బీఆర్ఎస్ కార్పొరేటర్లే

» అయినా నెగ్గిన అవిశ్వాసం

జవహర్ నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. అధికార కాంగ్రెస్‌లోకి ఇప్పటికే వలసలు జోరందుకున్న తరుణంలో.. ఇప్పుడు మరో సిటింగ్ మేయర్ స్థానాన్ని అనూహ్యంగా చేజార్చుకోవాల్సి వచ్చింది. మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్యపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో అసమ్మతి కార్పొరేటర్లు విజయం సాధించారు. ఇప్పుడు కొత్త మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. దాంతో, వారంతా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా? కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తారా? అన్న దానిపై ఆసక్తి నెలకొంది. జవహర్ నగర్ కార్పొరేషన్లో మొత్తం 28 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరంతా బీఆర్ఎస్ తరఫున గెలిచినవారే. వీరిలో ఒకరు గతంలో మరణించారు. మిగిలిన 27 మందిలో 20 మంది మేయర్‌పై అవిశ్వాసాన్ని ప్రకటించారు. మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు బల నిరూపణ ప్రక్రియ మొదలైంది. దాదాపు 40 రోజులుగా క్యాంపులో కొనసాగుతున్న 19 మంది అసమ్మతి కార్పొరేటర్లు, ఇటీవల కాంగ్రెస్‌లోకి వెళ్లిన కార్పొరేటర్ నీహారిక గౌడ్‌తో కలసి నేరుగా కార్యాలయానికి చేరుకున్నారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 20 మంది చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లయింది. కాగా, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు సుధీర్‌రెడ్డి కనుసైగల్లోనే క్యాంపు రాజకీయాలు నడిచాయి. అవిశ్వాసం ప్రవేశపెట్టిన కార్పొరేటర్లు.. కాంగ్రెస్‌లో చేరుతురా? లేక బీఆర్ఎస్‌లో కొనసాగుతారా? అన్న దానిపై సస్పెన్స్ నెలకొంది. మేయర్ ఎన్నిక తేదీ ప్రకటించిన తర్వాత దీనిపై స్పష్టమైన ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా మంజువాణి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ జి. మంజువాణి నియమితులయ్యారు. సీనియర్ అధికారిణిగా ఉన్న మంజువాణికి అదనంగా తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ పోస్టును కూడా అప్పగించారు. ఇప్పటివరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ ఎస్. రాంచందర్.. టీఎస్ఎల్‌డీఏ(తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) సీఈవోగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# బీఆర్ఎస్ దగ్గర ఏముంది?

(మొదటిపేజీ తరువాయి)

కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ దమ్మున్న పార్టీ అని, రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకూ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు అంటూ ఎవరైనా మాట్లాడితే రెండు చెంపలపై కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానాన్ని కూడా గెలుచుకుంటామని చెప్పారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కనీసం 25 మంది కొత్తవారిని పార్టీలో చేర్చుకోవాలని జాతీయ అధ్యక్షుడు నడ్డా సూచించారని కిషన్‌రెడ్డి తెలిపారు. యాత్రల సందర్భంగా కూడా చేరికలు ఉంటాయన్నారు. పార్టీ మొదటి పార్లమెంటరీ బోర్డు భేటీలో తెలంగాణ అభ్యర్థులు కొంతమంది ఉంటారని తెలిపారు. విచారణకు పిలిచినవారందరినీ అరెస్టు చేయరని ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుపై ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

### యాత్ర పోస్టర్, సీడీల ఆవిష్కరణ

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రారంభమయ్యే విజయ సంకల్ప యాత్ర పోస్టర్, పాటల సీడీలను కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. యాత్ర మార్చి 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి విజయ సంకల్ప యాత్ర వాహనాలను ప్రారంభించారు. రాష్ట్రంలో 5 విభాగాలుగా యాత్ర జరుగుతుందన్నారు. సమ్మక్క సారక్క జాతర సందర్భంగా వరంగల్ వైపు జరిగే యాత్ర మూడు రోజులు ఆలస్యంగా ప్రారంభమవుతుందని చెప్పారు. మంగళవారం నుంచి 4 యాత్రలు కొనసాగుతాయన్నారు. అన్ని యాత్రల్లో రోడ్‌షోలు మాత్రమే ఉంటాయని వివరించారు. 5 యాత్రలు 5,500 కి.మీ. మేర కొనసాగుతాయని.. 17 పార్లమెంటు నియోజకవర్గాల ప్రజలను కలుస్తామని కిషన్‌రెడ్డి వెల్లడించారు.



విజయ సంకల్ప యాత్ర వాహనాన్ని నడుపుతున్న కిషన్‌రెడ్డి

### నారాయణపేటలో పాల్గొననున్న కిషన్‌రెడ్డి

నారాయణపేట జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యే యాత్రలో కిషన్‌రెడ్డి పాల్గొననున్నారు. ఉదయం 9గంటలకు కృష్ణా నదిలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం కృష్ణ గ్రామంలో యా త్రను ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటలకు మాగనూర్ మండలం మీదుగా మక్తల్ టౌన్‌లో రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఉట్కూరు మండలంలో రైతులతో ముఖాముఖీలో పాల్గొంటారు. రాత్రి నారాయణపేటలోనే బస చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## కాళ్ల బేరానికి వచ్చినా పొత్తు పెట్టుకోం: లక్ష్మణ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుకు బీఆర్ఎస్సోళ్లు కాళ్ల బేరానికి వచ్చినా తాము ఒప్పుకోబోమని ఆ పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అడ్రస్ తెలంగాణలో గల్లంతయ్యిందన్నారు. తన అధికారిక నివాసంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చచ్చిన పాము అని, ఆ పార్టీ బతికి బట్ట కట్టే పరిస్థితి లేదన్నారు. ఆవిర్భావం నుంచి ఆ పార్టీ తమతో పొత్తు పెట్టుకున్న దాఖలాలే లేవని చెప్పారు. బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. 17 ఎంపీ సీట్లలో ఒంటరిగా పోటీ చేస్తామని, 10 సీట్లు, 35% ఓట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మోదీకి తెలంగాణలో ఎవరూ సరితూగరన్నారు. గతంలో పరస్పర ఆరోపణలు చేసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రస్తుతం సర్దుబాటు చేసుకుంటున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్.. బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందాల మేరకు సహకరించుకుంటున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీజేపీకి 370 లోక్‌సభ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇండియా కూటమి కౌరవ సైన్యమని విమర్శించారు. మోదీ హయాంలో దేశంలో రెండు రోజులకో పాఠశాల, వారానికో యూనివర్సిటీని కేంద్రం స్థాపించిందని ఆయన చెప్పారు.

## 6,000 కోట్లతో సోలార్ ప్యానెళ్ల పరిశ్రమ

(మొదటిపేజీ తరువాయి)

ఐదేళ్లలో 11 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ఫ్యాబ్ సిటీలోని ఆ పరిశ్రమ ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వ అధికారులు, సంస్థ ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రెన్యూసిస్‌కు కర్ణాటక, మహారాష్ట్రలో తయారీ యూనిట్లు ఉన్నప్పటికీ అతిపెద్ద తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో హైదరాబాద్ సోలార్ పరికరాల తయారీకి కేంద్రంగా మారుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఇందుకోసం సమగ్ర ఇంధన పాలసీని రూపొందిస్తున్నామని ప్రకటించారు. భారీ పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

### అపోలో మైక్రోసిస్టమ్స్‌కు శంకుస్థాపన

టిఎస్ఐఐసీ ఏరోస్పేస్ పార్కులో అపోలో మైక్రోసిస్టమ్స్ సంస్థ కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ ఫర్ ఇంజినీయస్ డిఫెన్స్ సిస్టమ్స్(ఐపీఐడీఎస్) యూనిట్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.210 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోయే అపోలో మైక్రోసిస్టమ్స్ పరిశ్రమ క్లిష్టమైన రక్షణ, అంతరిక్ష సాంకేతికతలపై పని చేస్తుందని తెలిపారు. ఆయా రంగాల్లో స్వదేశీ సాంకేతికత అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో అపోలో మైక్రో సిస్టమ్స్ వ్యాపార సామర్థ్యం పెరిగిందన్నారు. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 800 మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. మహేశ్వరం హార్డ్‌వేర్ పార్క్, ఫ్యాబ్‌సిటీలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనను ప్రభుత్వం తగిన సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వ హయాంలో.. సీఎంఆర్ఎఫ్ నిధుల గోల్‌మాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)కి సంబంధించి భారీగా అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎలాంటి బిల్లులూ లేకుండా పెద్ద ఎత్తున ఈ నిధులను దుర్వినియోగం చేసినట్లు ప్రభుత్వం గుర్తించింది. దాదాపు రూ.150 కోట్ల మేర స్కామ్ జరిగినట్లు అంచనా వేస్తోంది. ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్సలకు చెల్లింపులు చేయలేని పేదవారికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద కొంత మేర బిల్లులు చెల్లించే సంగతి తెలిసిందే. చికిత్స చేయించుకున్న తర్వాత సీఎంఆర్ఎఫ్ కింద సహాయం కోరుతూ బిల్లులను సమర్పిస్తే..అందులో ఎంతోకొంత విడుదల చేయడం ఒక పద్ధతి. రోగి చికిత్సకు ముందే దానికయ్యే బిల్లును చెల్లిస్తామంటూ ఆస్పత్రికి ప్రభుత్వం 'లెటర్ ఆఫ్ క్రెడిట్' ఇవ్వడం రెండో పద్ధతి. ఈ రెండు పద్ధతుల్లోనూ నిధుల దుర్వినియోగం జరిగినట్లు.. ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు వచ్చాయి. సాధారణంగా.. ముందు చికిత్స పొందిన వారు ఆస్పత్రి ఇచ్చే బిల్లులను సీఎంవోలోని సీఎంఆర్ఎఫ్ విభాగంలో సమర్పించాలి. ఆ తర్వాతే చెక్కులు జారీ చేస్తారు. కానీ, దీనికి విరుద్ధంగా సీఎంఆర్ఎఫ్ విభాగంలో ఎలాంటి బిల్లులనూ సమర్పించకుండానే సొమ్మును డ్రా చేసినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఈ సొమ్మును ఎక్కువగా బీఆర్ఎస్ కార్యకర్తలకే మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పించారన్న ఆరోపణలున్నాయి. త్వరలోనే పూర్తి వివరాలను సీఎంవో బయటపెట్టనున్నట్టు సమాచారం.

## ఇక తెలంగాణకు నీళ్లు ఇవ్వొద్దు

» వాటాకు మించి వాడేశారు.. కృష్ణాబోర్డుకు ఏపీ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి 2023-24 సంవత్సరానికి గానూ తెలంగాణ వాటాకు మించి నీటిని వాడేసిందని ఆంధ్రప్రదేశ్ ఆరోపించింది. ఇక ముందు ఈ జలాశయాల నుంచి నీటిని తరలించకుండా తెలంగాణను అడ్డుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి లేఖ రాశారు. 2023-24 వాటర్ ఇయర్‌లో రెండు జలాశయాల్లో 80 టీఎంసీల నీటి లభ్యత ఉందని గుర్తించిన బోర్డు.. ఏపీకి 45 టీఎంసీలను, తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయించింది. అయితే ఇప్పటికే తెలంగాణ 35.089 టీఎంసీలు వినియోగించుకుందని లేఖలో ఏపీ తెలిపింది. ఈనేపథ్యంలోనే ఏపీ లేఖపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే నివేదించాలని కోరుతూ ఆ లేఖను తెలంగాణకు బోర్డు పంపించింది.

## మార్కెట్‌లకు పోటెత్తిన ఎర్ర బంగారం

» ఖమ్మంకు లక్ష, వరంగల్‌కు 80 వేల బస్తాల రాక

» వరంగల్ మార్కెట్‌లో మిర్చి, పత్తికి రికార్డు ధర



వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మంమార్కెట్/వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లకు ఎర్ర బంగారం (మిర్చి) పోటెత్తింది. ఖమ్మం మార్కెట్‌కు సోమవారం సుమారు లక్ష మిర్చి బస్తాలు అమ్మకానికి రాగా.. ఏనుమాముల మార్కెట్‌కు 80 వేల బస్తాలు వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైన తరువాత పంట ఇంత భారీ మొత్తంలో రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు వరుస సెలవులతో పాటు మరో రెండ్రోజుల్లో మేడారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పంటను భారీగా అమ్మకానికి తెస్తున్నారు. ఏనుమాముల మార్కెట్‌లో తేజ రకం క్వింటాలుకు రూ.21 వేలు, వండర్‌హాట్‌కు రూ.21,500, యూఎస్ 341కు రూ.20,500, దీపిక రూ.20 వేలు, దేశీ రకానికి రూ.38,500, మిర్చిలో తాలుకు రూ.8,500 చొప్పున ధర పలికింది. ఖమ్మం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.15 వేల నుంచి రూ.19 వేల వరకు ధర పెట్టి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇటు ఏనుమాముల మార్కెట్‌లో పత్తి ధర అమాంతం పెరిగి, క్వింటాల్ రూ.7,010 చేరింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే మార్కెట్‌కు కేవలం 1,200 పత్తి బస్తాలే వచ్చాయని.. ధరలు పెరగడం సహజమేనని వ్యాపారులు చెబుతున్నారు.

## సీసీఐ సెంటర్లు కొనసాగించాలి

» రైతుల వద్ద ఇంకా 71 లక్షల క్వింటాళ్ల పత్తి

» సీసీఐ సీఎండీకి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని సీసీఐ సీఎండీకి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం లేఖ రాశారు. గడువు ముగిసిందని సీసీఐ కేంద్రాలను ఎత్తివేస్తున్నారని, రైతుల వద్ద ఇంకా సుమారు 71 లక్షల క్వింటాళ్ల పత్తి నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో మూడో విడత పత్తి పికింగ్ చేస్తున్నారని, ధరలు పెరుగుతాయనే కారణంతో మొదటి, రెండో పికింగ్‌లో తీసిన పత్తిని కూడా రైతులు నిల్వచేసుకున్నారని వివరించారు. ప్రపంచ మార్కెట్లో పత్తికి డిమాండ్ పెరిగిందని, ఈ సందర్భంలో సీసీఐ సెంటర్లు ఎత్తివేస్తే మార్కెట్లో ధరలు తగ్గే ప్రమాదముంటుందని, దాంతో రైతులకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలకు తగినట్లుగా పత్తి లేకపోతే సీసీఐ నిబంధనల ప్రకారం ధరలు నిర్ణయించి కొనాలని తుమ్మల లేఖలో కోరారు.

# మేడారం జాతరను వైభవంగా జరుపుతాం

» ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశాం : మంత్రి పొంగులేటి

» శిలాశాసనంగా సమ్మక్క సారలమ్మ చరిత్ర : మంత్రి సీతక్క

ములుగు/మేడారం/హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను వైభవంగా జరుపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. సోమవారం ములుగు జిల్లా మేడారానికి వచ్చిన ఆయనకు మంత్రి సీతక్క స్వాగతం పలికారు. పొంగులేటి తన ఎత్తు బంగారం (బెల్లం) తులాభారం వేసుకొని వనదేవతలకు సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష జరిపారు. మీడియా సెంటర్, రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మీడియా టవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.110 కోట్ల నిధులతో మేడారం జాతరకు ఏర్పాట్లు చేశామన్నారు. 16 వేల మంది ఉద్యోగులతో జాతరలో సదుపాయాలను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే 58 లక్షల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారన్నారు. ఈసారి 2 కోట్ల మంది మేడారం వస్తారనే అంచనాలున్నాయని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ కీర్తిప్రతిష్ఠలు, చరిత్రను శిలాశాసనంగా ఏర్పాటు చేస్తామని, జాతర ఏర్పాట్లకు ఖర్చు చేసిన ప్రతీ రూపాయి లెక్కను ప్రజలకు చెబుతామని చెప్పారు.

### లక్షలాదిగా భక్తులు.. గద్దెల వద్ద రద్దీ

జాతర సమీపించిన నేపథ్యంలో సోమవారం భక్తులు భారీ సంఖ్యలో తరలొచ్చారు. సమ్మక్క,సారలమ్మల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. 2 లక్షలకు పైగా భక్తులు వనదేవతలను దర్శించుకోవడంతో గద్దెల పరిసరాలు రద్దీగా మారాయి. దీంతో గద్దెల గేట్లను మూసివేసి బయటనుంచే అమ్మవార్ల దర్శనాలను కొనసాగించారు. ఇటు జాతర బందోబస్తు ఏర్పాట్లను డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి పరిశీలించారు. వనదేవతల్ని దర్శించుకున్న డీజీ, ఇంటెలిజెన్స్ చీఫ్ అనంతరం భద్రతా ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని డీజీపీ అధికారులకు సూచించారు.



బెల్లంతో దేవతల గద్దెల వద్దకు వస్తున్న మంత్రులు సీతక్క, శ్రీనివాసరెడ్డి

# గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఆబ్జెక్టివ్ ప్రశ్నల విధానంలో, మెయిన్ పరీక్షను రాతపూర్వకంగా సమాధాలు ఇచ్చే ప్రశ్నల పద్ధతిలో నిర్వహిస్తారు. ఈ పోస్టుల భర్తీలో 95 శాతం స్థానికత రిజర్వేషన్‌ను అమలు పరచనున్నారు. 33 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రిలిమినరీ పరీక్ష ద్వారా మెయిన్‌కు ఒక పోస్టుకు 50 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ప్రిలిమినరీ పరీక్షను 150 మార్కులకు, మెయిన్ పరీక్షను 900 మార్కులకు నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలు ఉండవు.




### గతంలో రెండుసార్లు ప్రిలిమ్స్..

గత ప్రభుత్వం 503 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2022 ఏప్రిల్ 26న నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టుల భర్తీ కోసం రెండు సార్లు ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. మొదటిసారి పేపర్ లీక్ కావడంతో పరీక్షను రద్దు చేశారు. రెండోసారి బయోమెట్రిక్ హాజరును తీసుకోలేదని, అధికారులు నిబంధనలను పాటించలేదని అభ్యర్థులు హైకోర్టులో కేసు వేశారు. దాంతో పరీక్షను రద్దు చేయాలని కోర్టు ఆదేశించింది. దీనిపై గత ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసును వెనక్కి తీసుకుని, కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది.

| పోస్టు పేరు | ఖాళీలు |
|---|---|
| డిప్యూటీ కలెక్టర్ | 45 |
| డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ | 115 |
| కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ | 48 |
| రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ | 04 |
| జిల్లా పంచాయతీ ఆఫీసర్ | 07 |
| జిల్లా రిజిస్ట్రార్ | 06 |
| డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ | 05 |
| అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ | 08 |
| అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ | 30 |
| మునిసిపల్ కమిషనర్ గ్రేడ్-2 | 41 |
| డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ | 03 |
| డిస్ట్రిక్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ ఆఫీసర్ | 05 |
| డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ | 02 |
| జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ | 05 |
| అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మెడికల్,హెల్త్) | 20 |
| అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ | 38 |
| అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ | 41 |
| ఎంపీడీఓ | 140 |

## మెగా డీఎస్సీతో పాటు టెట్ నోటిఫికేషన్

» వచ్చే వారం ప్రకటన విడుదలయ్యే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మెగా డీఎస్సీతో పాటు, టెట్ నోటిఫికేషన్ కూడా జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే వారంలో ఈ ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో మెగా డీఎస్సీని నిర్వహిస్తామని ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం 5,089 టీచర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులు దరఖాస్తులు కూడా చేసుకున్నారు. అయితే మరిన్ని పోస్టులను జత చేసి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. అందులో భాగంగా మరో 6 వేల ఖాళీలను గుర్తించినట్లు తెలిసింది. గతంలో ప్రకటించిన పోస్టులతో పాటు, కొత్తగా గుర్తించిన పోస్టుల భర్తీ కోసం త్వరలోనే మెగా డీఎస్సీని ప్రకటించనున్నారు. ఇందులో భాగంగా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉంది. ఈ విషయంపై సోమవారం అధికారులు ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు టెట్ పాస్ కాని వారి కోసం మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. పైగా ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సమస్య కూడా టెట్ నోటిఫికేషన్ ద్వారా కొంత వరకు పరిష్కరించవచ్చని భావిస్తున్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలంటే టెట్ పాసై ఉండాలన్న నిబంధన ఉంది. అయితే.. చాలా మందికి టెట్ లేదు. దాంతో టెట్ నోటిఫికేషన్ జారీచేస్తే.. అభ్యర్థులతో పాటు, ఉపాధ్యాయులకు కూడా ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు.

### సీటెట్ ఫలితాల విడుదల..

సెంట్రల్ టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(సీ టెట్) ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. జనవరి 21న ఈ పరీక్ష జరిగింది. అభ్యర్థులు సాధించిన మార్కులు, క్వాలిఫై సర్టిఫికెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

# ఖజానాలో డబ్బుల్లేవ్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం ఇటీవల 2024-25 సంవత్సరానికి రూ.2.75 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుత బడ్జెట్ కంటే 14% మేర తగ్గించి ప్రతిపాదించింది. అంటే.. ప్రభుత్వం ఖజానా సొమ్ముపై ఎంత నిక్కచ్చిగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. నిధుల విడుదల విషయంలో అంతే జాగ్రత్త పడుతోంది. గతేడాది డిసెంబరునాటికి రాబడులు, అప్పుల రూపంలో నెలకు సగటున రూ.17,951 కోట్లు సమకూరాయి. వ్యయాలు కూడా ఇంచుమించు అంతే ఉన్నాయి. వడ్డీ చెల్లింపులు, ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలు, పెన్షన్లు, కొన్ని ప్రత్యేక పథకాల సబ్సిడీ చెల్లింపులు ఉండనే ఉంటాయి. ముఖ్యంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 24 గంటల ఉచిత విద్యుత్తుకు సబ్సిడీ సొమ్మును ఇప్పటికీ చెల్లించాల్సి వస్తోంది. బియ్యం పథకానికి సబ్సిడీని చెల్లిస్తున్నారు. ఈ రెండింటి కోసం డిసెంబరు నాటికి నెలకు సగటున రూ.750 కోట్ల వరకు చెల్లించాల్సి వచ్చింది. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ పథకాలకు నిధులను సర్దుబాటు చేయడం ఎలా అన్నది ప్రభుత్వాన్ని వేధిస్తున్న ప్రశ్న. అందుకే ఖర్చు చేసే ప్రతి రూపాయి విషయంలో జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. రైతుబంధు పథకం కింద రబీ సీజన్‌కే రూ.7,500 కోట్లు కావాలి. కానీ.. ఇప్పటివరకు రూ.3,426 కోట్లను మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. పైగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఎకరానికి రూ.10 వేల స్కీమునే ప్రస్తుతం కొనసాగిస్తోంది. కాంగ్రెస్ దీనిని రూ.15 వేలకు పెంచి అమలు చేస్తామని చెప్పింది. నిధుల కటకట కారణంగా ప్రస్తుతం పెంపు జోలికి పోవట్లేదు. దీంతో పాటు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినందుకు ప్రభుత్వం ఆర్టీసీకి ప్రతి నెలా రూ.250 కోట్ల రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలి. ఏటా రూ.3000 కోట్లను చెల్లించాలి. ఇటీవలే ప్రభుత్వం ఆర్టీసీకి రూ.374 కోట్లను విడుదల చేసింది. ఇవి తప్ప కొత్త పథకాలకు నిధుల విడుదలను విడుదల చేయడం లేదు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకాలను త్వరలో ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సిలిండర్ల పథకానికి ఏటా రూ.1,594 కోట్లు, ఉచిత విద్యుత్తు పథకానికి రూ.4,100 కోట్లు అవసరం. ఈ లెక్కన ఈ రెండు పథకాలకే నెలకు సుమారు రూ.500 కోట్ల వరకు సర్దాల్సి ఉంటుంది. పథకాలు ప్రారంభం కావాల్సి ఉన్నందున.. ఇంకా నిధుల విడుదల మొదలు పెట్టలేదు. నిధుల సర్దుబాటుపై మాత్రం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం ఆసరా పెన్షన్లను ఎలాంటి పెంపు లేకుండా యథాతథంగా అమలు చేస్తోంది. ఇప్పుడిస్తున్న ఆసరా పెన్షన్‌ను రూ.2,016ను రూ.4000కు పెంచి ఇస్తామని చెప్పింది. ప్రస్తుతం పెంపు జోలికి వెళ్లడం లేదు. బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్, కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, పంటల రుణమాఫీ, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, ఆయిల్ పామ్ సాగు వంటి పథకాలకు నిధులను విడుదల చేయడం లేదు. మూలధన వ్యయాల విషయంలోనూ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

# టీఎస్ - ఐపాస్

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 20 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

**పారిశ్రామిక ప్రాజెక్టులకు త్వరితగతిన అన్నిరకాల ఆమోదం తెలపడానికి (టీఎస్-ఐపాస్ - తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రోవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్)ను తెలంగాణ రాష్ట్రప్రభుత్వం 2014లో అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఇందులోని అన్ని ప్రాజెక్టులకు 30 రోజుల వ్యవధిలో అన్నిరకాల అనుమతులు ఇవ్వాలి.**

టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన ప్రతిపాదనలు


2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 జనవరి వరకు టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రతిపాదనల వివరాలు కిందివిధంగా ఉన్నాయి.

| సంవత్సరం | ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రతిపాదనలు |
|---|---|
| 2014-15 | 174 |
| 2015-16 | 1531 |
| 2016-17 | 1705 |
| 2017-18 | 2803 |
| 2018-19 | 2796 |
| 2019-20 | 3036 |
| 2020-21 | 3431 |
| 2021-22 | 4116 |
| 2022-23 జనవరి వరకు | 2518 |

పై పట్టిక ప్రకారం టిఎస్ ఐపాస్ అమలులోకి వచ్చిన 2014-15 నుంచి ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రతిపాదనల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2017-18, 2018-19లలో ఆ సంఖ్య కొద్దిగా తగ్గింది. మరలా పుంజుకొని 2021-22లో గరిష్ఠంగా 4166కి చేరింది. మొత్తమ్మీద 2014-15 నుంచి 2023 జనవరి వరకు 22110 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. ఆమోదించిన మొత్తం ప్రతిపాదనల పెట్టుబడి విలువ రూ.2,53,575 కోట్లు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 17.26 లక్షలమందికి ఉపాధి లభించింది.

పరిశ్రమల పరిమాణం ఆధారంగా చూస్తే మొత్తం ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 65.4 శాతం సూక్ష్మ సంస్థలు, 27.9 శాతం చిన్న సంస్థలు, 2.7 శాతం మధ్యతరహా సంస్థలు, 3 శాతం భారీ పారిశ్రామిక సంస్థలు, ఒక శాతం మెగా పారిశ్రామిక సంస్థలు ఉన్నాయి.

మొత్తం వచ్చిన పెట్టుబడిలో 59.3 శాతం మెగా




పారిశ్రామిక సంస్థలకు, 19.9 శాతం పెద్దతరహా సంస్థలకు, 7.3 శాతం మధ్యతరహా సంస్థలకు, 10.4 శాతం చిన్న సంస్థలకు, 3.2 శాతం సూక్ష్మ సంస్థలకు వచ్చింది. ఈ ప్రతిపాదనల ద్వారా కల్పించిన మొత్తం ఉద్యోగితలో 41.8 శాతం మెగా పారిశ్రామిక సంస్థల ద్వారా, 21.0 శాతం చిన్నసంస్థల ద్వారా, 17.4 శాతం, సూక్ష్మ సంస్థల ద్వారా 11.2 శాతం పెద్దసంస్థల ద్వారా, 8.5 శాతం మధ్యతరహా సంస్థల ద్వారా కల్పించారు.

పారిశ్రామిక ప్రతిపాదనలు ఆమోదం పొందిన జిల్లాలను చూస్తే మేడ్చల్-మల్కాజిగిరి(21.20 శాతం), సంగారెడ్డి(8.01 శాతం), రంగారెడ్డి(7.5 శాతం)లు యూనిట్ల సంఖ్య ఆధారంగా మొదటి మూడు స్థానాలు ఆక్రమించాయి.

పెట్టుబడుల పరంగా రంగారెడ్డి(32.15 శాతం), నల్లగొండ(11.17 శాతం), భద్రాద్రి కొత్తగూడెం (9.05 శాతం)లు మొదటి మూడుస్థానాలు ఆక్రమించాయి. ఈ ప్రతిపాదనల ద్వారా లభించిన ఉపాధిలో రంగారెడ్డి(56.66 శాతం), వరంగల్(11.12 శాతం), సంగారెడ్డి(8.04 శాతం)లు మొదటి మూడు స్థానాలు పొందాయి.

## ఎకానమీ

టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన ప్రతిపాదనలను రంగాల వారీగా చూసినప్పుడు 2015-16, 2022-23 మధ్యకాలంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్య పరిశ్రమల సంఖ్యలో నిర్దిష్టమైన పెరుగుదల ఉంది. సిమెంట్, సిమెంట్ ఉత్పత్తులు 2015-16 నుంచి 2022-23 వరకు మొత్తం పెట్టుబడిలో వాటాను గణనీయంగా పెంచుకున్నాయి. అయితే 2022-23లో ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు ఎక్కువ పెట్టుబడిని ఆకర్షించాయి. 2016-17 నుంచి 2020-21 మధ్యకాలంలో కల్పించిన మొత్తం ఉపాధిలో 50 శాతం కంటే ఎక్కువ ఐ.టి.రంగం కల్పించింది. 2015-16లో 136 ఆమోదం పొందగా 2020-21లో 235 ఆమోదం పొందాయి.

మొత్తమ్మీద 2015 నుంచి అన్ని రంగాల పరిశ్రమల యూనిట్లకు ఆమోదాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. అయితే కొన్నిరకాల పరిశ్రమల యూనిట్లు 2015 నుంచి 2020-21 వరకు పెరిగి, ఆ తరవాత తగ్గాయి.



అయితే మొత్తం కల్పించిన నూతన ఉపాధిలో 2021-22లో 36.9 శాతం, 2022-23(జనవరి 23)లో 15.1 శాతం వాటాను కలిగి ఉండటం గమనార్హం.

**2015 నుంచి 2023 జనవరి వరకు టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన ప్రతిపాదనలను వివిధ రంగాల వారీగా పట్టిక-2లో చూడవచ్చు.**

పట్టిక-2ను పరిశీలిస్తే 2015 నుంచి 2023 జనవరి మధ్య ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలకు ఎక్కువ ఆమోదం లభించింది. ఆ తరవాత స్థానాలను వ్యవసాయాధారిత, సిమెంట్, గ్రానైట్ పరిశ్రమలు పొందాయి. ఇంజనీరింగ్ సంస్థలు 2015-16లో 219 ఆమోదం పొందగా 2021-22లో 682 సంస్థలు ఆమోదం పొందాయి. ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు 2015-16లో 233 ఆమోదం పొందగా 2021-22లో 1032 ఆమోదాన్ని పొందాయి. శీతలీకరణ కేంద్రాలు సహా వ్యవసాయాధారిత పరిశ్రమల యూనిట్లు 2015-16లో 182 ఆమోదం పొందగా 2020-21లో గరిష్ఠంగా 573 ఆమోదం పొందాయి. సిమెంట్, సిమెంట్-కాంక్రీట్ పరిశ్రమలు 2015-16లో 95 ఆమోదం పొందగా 2020-21లో గరిష్ఠంగా 490 ఆమోదం పొందాయి. గ్రానైట్, రాళ్లను కొట్టే పరిశ్రమల యూనిట్లు

| సంవత్సరం | ఇంజనీరింగ్ | ఫుడ్ ప్రాసెసింగ్ | వ్యవసాయాధారిత (శీతలీకరణ కేంద్రాలు సహా) | సిమెంట్, సిమెంట్-కాంక్రీట్ ఉత్పత్తులు ఫ్లైయాష్ బ్రిక్స్ | గ్రానైట్స్, రాళ్లు కొట్టే పరిశ్రమలు | ఇతరాలు |
|---|---|---|---|---|---|---|
| 2015-16 | 219 | 233 | 182 | 95 | 136 | 666 |
| 2016-17 | 376 | 235 | 152 | 139 | 165 | 638 |
| 2017-18 | 632 | 401 | 290 | 236 | 257 | 987 |
| 2018-19 | 639 | 469 | 291 | 269 | 198 | 930 |
| 2019-20 | 576 | 466 | 449 | 284 | 236 | 1025 |
| 2020-21 | 565 | 651 | 573 | 490 | 235 | 917 |
| 2021-22 | 682 | 1032 | 467 | 298 | 232 | 1405 |
| 2022-23 | 488 | 639 | 87 | 182 | 172 | 950 |

వివిధ రంగాలు ప్రతి సంవత్సరం అదనంగా కల్పించిన ఉద్యోగితపరంగా చూస్తే రియల్ ఎస్టేట్, పారిశ్రామిక పార్కులు, ఐటి నిర్మాణం పరిశ్రమలు 2015-16లో అదనంగా 22,150 ఉద్యోగాలు కల్పించగా, 2018-19లో గరిష్ఠంగా 3,31,795 ఉద్యోగాలను కల్పించాయి. టెక్స్‌టైల్ రంగం 2015-16లో 631 ఉద్యోగాలు కల్పించగా 2018-19లో గరిష్ఠంగా 1,89,594 మందికి ఉపాధి కల్పించాయి. ఫార్మాస్యూటికల్, రసాయన పరిశ్రమలు 2015-16లో 18,881 ఉద్యోగితను కల్పించగా 2021-22లో గరిష్ఠంగా 37,403 మందికి ఉపాధి కల్పించాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2015-16లో గరిష్ఠంగా 12,947 మందికి ఉపాధిని కల్పించింది. ఇంజనీరింగ్ పరిశ్రమ 2015-16లో 4,618 మందికి ఉపాధిని కల్పించగా 2017-18లో గరిష్ఠంగా 12,452 మందికి ఉపాధి కల్పించింది.

డా.ఎం.ఎ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.



## సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

# తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి

(నిన్నటి తరువాయి)

**ఎకానమీ:** పరిశీలించినప్పుడు 2014లో 10, 2013లో 19 ప్రశ్నలు వచ్చాయి. ఎకానమీలో మౌలిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. బడ్జెట్, ఎకనామిక్ సర్వే నుంచి కూడా అధికంగా ప్రశ్నలు వస్తాయి. ఇటీవలి కాలంలో ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, ఆర్బీఐ ద్రవ్య పరపతి విధానం, క్రిప్టోకరెన్సీ, స్టార్టప్ - యూనికార్న్ స్టార్టప్ వంటి అంశాలు వినిపిస్తున్నాయి. ఎంఎస్పీ(కనీస మద్దతు ధర) అంటే ఏమిటి? ఎవరు ఇస్తారు? ఏయే పంటలకు ఇస్తారు వంటివి చదవాలి. జీఎస్టీ ఆర్థిక సంఘం, భారత దేశ వృద్ధి అంచనాలు, యూపీఐకి సంబంధించి వివరంగా చదవాలి. బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన పథకాలు, ఆర్థిక సమీక్ష కచ్చితంగా, లోతుగా చదవాలి.



ఎకానమీకి సంబంధించి ఎన్సీఈఆర్టీ 9-12 పుస్తకాలు చదివితే మౌలిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. బడ్జెట్ 2023-24, ఎకనామిక్ సర్వే 2022-23 బాగా చదవాలి. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదవాలి.

**జనరల్ సైన్స్:** శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

**సైన్స్ అండ్ టెక్నాలజీ:** సంబంధించి 6-10వ తరగతి వరకు ఎన్సీఈఆర్టీ పుస్తకాలు చదవాలి. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీలో వర్తమాన అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. ప్రాథమిక అంశాలు మొదట చదవాలి. కరెంట్ అఫైర్స్‌తోపాటు, వివిధ మంత్రిత్వశాఖల ఇయర్ ఎండ్ రివ్యూతోపాటు అప్డేట్స్ చదవాలి. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ప్రాథమిక అంశాలకు రవి అగ్రహారి సైన్స్ అండ్ టెక్నాలజీ బుక్ చదివితే మంచిది.

**పర్యావరణం:** 2020లో 10 ప్రశ్నలు, 2014, 2016లో 18 ప్రశ్నలు వచ్చాయి. పర్యావరణంలో జీవవైవిధ్యం, జీవవైవిధ్య సంరక్షణ, పర్యావరణ చట్టాలు, పర్యావరణ సంస్థలు, కమిటీలు, సమావేశాల గురించి ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు పర్యావరణ కాలుష్యానికి సంబంధించి భూ, జల, గాలి కాలుష్యం, రేడియోధార్మికత కాలుష్యం, కాలుష్య నివారణ చట్టాలు, నివారణ చర్యలు, ఓజోన్ పొర క్షీణత, గ్లోబల్ వార్మింగ్‌పై ప్రశ్నలు వస్తాయి. కాప్-27 సదస్సు గురించి చదువుతూ గతంలో జరిగిన సదస్సులు, వాటి తీర్మానాలను చదవాలి. ఏ సదస్సు ఏ అంశాన్ని ప్రధానాంశంగా తీసుకున్నదో చదవాలి. గత సంవత్సర కాలంలో రెడ్ లిస్టుకి సంబంధించి అంతరిస్తున్న జీవజాతులు, వృక్ష జాతులను చదవాలి. ఆ జాతులకి సంబంధించిన జంతువు, వృక్షాన్ని బాగా చదవాలి. అందులో భాగంగానే దాన్ని భారతదేశంలో చట్టానికి అన్వయించుకోవాలి.

పర్యావరణంపై ఎన్సీఈఆర్టీ ఎన్విరాన్‌మెంట్ తోపాటు శంకర్ అకాడమీ 'అవర్ ఎన్విరాన్‌మెంట్' గాని లేదా రవి అగ్రహారి 'ఎన్విరాన్‌మెంట్' గాని లేదా 'పిఎంఎఫ్ ఐఎఎస్ ఎన్విరాన్‌మెంట్' బుక్ చదవాలి. ఎన్సీఈఆర్టీ 8వ తరగతి పుస్తకంతోపాటు బయాలజీ 11లోని 13-16 చాప్టర్స్ (ఎన్విరాన్‌మెంట్ బయాలజీ) చదవాలి.

**వర్తమాన అంశాలు:** గడచిన సంవత్సర కాలంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ అంశాలు చదవాలి. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు విడుదలచేసే నివేదికలు, సూచికలు కచ్చితంగా చదవాలి. ఇటీవలి కాలంలో క్రీడలకు ప్రాధాన్యం పెరిగింది. వీటికి సంబంధించి పిఐబి వెబ్‌సైట్, ద హిందూ పేపర్ చదువాలి. అలాగే ఏదైనా ఒక ప్రముఖ సంస్థకి చెందిన కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ చదవాలి.

వీటితోపాటు ముఖ్యంగా జనరల్ స్టడీస్‌కి సంబంధించిన ప్రాక్టీస్ పేపర్లు రాయాలి. సుమారు 50-60 ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేస్తే అభ్యర్థికి నమ్మకం ఏర్పడుతుంది. ముఖ్యంగా గడిచిన 20 సంవత్సరాల్లో జరిగిన సివిల్స్ ప్రిలిమినరీ ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

## షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ కోర్సు



**కాన్పూర్‌లోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్ఐ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ షుగర్ రిఫైనరీ ఆపరేషన్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి మూడు నెలలు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని ఈ-మెయిల్ ద్వారా అప్‌లోడ్ చేసి హార్డ్ కాపీని కింది చిరునామాకు పంపాలి.**

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు షుగర్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ హౌస్‌లో కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి. సంస్థ అందిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ పూర్తిచేసి కనీసం రెండు సీజన్ల అనుభవం లేదా సంస్థ నుంచి షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు మూడు సీజన్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదు. విదేశీ అభ్యర్థులను 38 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

**రిటెన్ టెస్ట్:** పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి 35 ప్రశ్నలు; రెండో సెక్షన్‌లో షుగర్ ప్రాసెస్‌కు సంబంధించి 15 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. పరీక్ష సమయం మూడు గంటలు. క్యాలిక్యులేటర్లను అనుమతించరు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

**ముఖ్య సమాచారం**

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.12,000(విదేశీ అభ్యర్థులకు రూ.48,000)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 25
- **ఈ మెయిల్ ద్వారా అడ్మిట్ కార్డ్‌ల జారీ:** మార్చి 28 నుంచి
- **రిటెన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 14
- **పరీక్ష కేంద్రం:** ఎన్ఎస్ఐ, కాన్పూర్
- **రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కల్యాణ్‌పూర్, కాన్పూర్-208017
- **ఈ-మెయిల్:** nsikanpureducation@gmail.com
- **వెబ్‌సైట్:** http://nsi.gov.in

## ఏపీ జర్నలిజం కాలేజీలో అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం- పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులను రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో అందిస్తున్నారు. ఆన్‌లైన్ సెషన్స్ కూడా నిర్వహిస్తారు. అభ్యర్థులు తెలుగు లేదా ఇంగ్లీష్ మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**కోర్సులు**

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు.

**ముఖ్య సమాచారం**

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** మార్చి 5
- **మొబైల్ నెం:** 9848512767; 7286013388
- **ల్యాండ్ లైన్ నెంబర్:** 040-79610940
- **వెబ్‌సైట్:** www.apcj.in



## లిటిల్స్



### సరైన న్యాయం

ఒక ఊరిలో సోమయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అడవికి వెళ్లి కట్టెలు కొట్టేవాడు. ప్రతిరోజూ అదే పని చేసేవాడు. ఆ పని ఇరవై ఏళ్లుగా చేస్తున్నాడు. ఆ కట్టెలు మోసుకు వచ్చి బొగ్గులు కాల్చి అమ్ముకునేవాడు. డబ్బులు అవసరం అనిపిస్తే ఆరోజే తన ఊరికి దగ్గరలో ఉండే చిన్న టౌనులో కట్టెలు అమ్ముకునేవాడు. అదే అతని జీవన ఉపాధి. అతనికి తెలిసొచ్చిన విద్య కూడా అదే. ఏ చీకూ చింతా లేకుండా అడవికి వెళ్లేవాడు. ఎవరినీ పట్టించుకునేవాడు కాదు. అతడికి ముగ్గురు పిల్లలు. వారి ఆలనా పాలన చూసుకోవటానికి ఎన్నో కష్టాలు పడేవాడు.

సోమయ్య కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేది కాదు. తన తోబుట్టువుల పెళ్లిళ్లు, కార్యాలకు డబ్బును ఖర్చుపెట్టేవాడు. దీనికోసం దొరల దగ్గర అప్పు చేసేవాడు. ఆ అప్పు తీర్చలేక కష్టమే దిక్కు అనుకునేవాడు. తన జీవితం ఇంతేనేమో అనుకునేవాడు. అయినా పని చేయకుంటే జీవితం గడవదని అనుకునేవాడు. అందుకే విధిగా పని చేసేవాడు.

ఒకరోజు కట్టెలు కొట్టి.. వీపు మీద వేసుకుని అడవినుంచి టౌనుకు బయలు దేరాడు. పట్టణంలో ఎక్కడ చూసినా జనాలు. ఏదో తిరునాళ. తీయండి బాబు అడ్డం తీయండి.. తల మీద బరువుంది. ఈ జాస్తి బరువుతో నడవలేకున్నా అని గట్టిగా అరిచాడు. ఆ వీధిలోనే దొర దగ్గర పనిచేస్తే బంట్రోతు వెళ్తున్నాడు. దొర దగ్గర డబ్బుల వ్యవహారం చూసుకునేవాడు. దర్జాగా దారిలో వెళ్తున్నాడు. తీయండి.. అని అరిచినా పక్కకు పోలేదు. కట్టె అతనికి తగిలింది. ఇంత పనికిమాలిన పని చేస్తావా? వెధవ..అంటూ కసురుకున్నాడు. పక్కన ఉండే యువకులను పిలిచి 'వీడిని న్యాయాధికారి దగ్గరకు ఈడ్చుకు రండి' అని అన్నాడు. సోమయ్యను లాక్కెళ్లారు.

న్యాయాధికారి సోమయ్య వైపు చూశాడు. కోపంగా చూశాడు. సోమయ్య పట్టించుకోలేదు. అతనికి తెలియనట్లే ఉన్నాడు. మాట్లాడు అని హుంకరించినా మాట్లాడలేదు. 'చూడు వీడు బెల్లం కొట్టిన రాయిలా ఉన్నాడు. మాటలు రావు. నాలుగు తగిలిస్తే సరి' అన్నాడు బంట్రోతు. అయినా సోమయ్య మౌనం దాల్చాడు. అప్పుడు బంట్రోతు కోపంతో ఊగిపోయాడు. 'తీయండి.. తల మీద బరువు ఉంది. జాస్తి బరువును మోయటం కష్టం అని గట్టిగ అరిచావు. ఇపుడేమో గమ్మున ఉన్నావు' అంటూ చెర్నకోలా తీసుకున్నాడు. అప్పుడు న్యాయాధికారి ఇలా అన్నాడు.. 'మీరే తప్పు చేశారు. ఏమీ తెలియని సోమయ్య తప్పేలేదు. అరిచినా మీరు అడ్డం తీయలేదంటే.. తప్పెవరిదీ? ఈ చర్నకోలాతో మిమ్మల్నే కొట్టాలి. కాస్త పొగరు తగ్గించుకోండి' అంటూ న్యాయాధికారి చివాట్లు పెట్టాడు. బంట్రోతు మౌనం దాల్చాడు.



6 తేడాలను గుర్తించండి

దారి కనుక్కోండి




ఎంత మంది ఉన్నారు..?



### డైలీ సుడోకు - 234

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 8 | | | | 2 | 5 | 6 | |
| 9 | | | | 4 | | | | |
| | | | 3 | | | | 4 | 7 |
| | 4 | | | 2 | | 6 | | |
| | | 7 | | | | 3 | | |
| | | 3 | | 8 | | | 5 | |
| 5 | 2 | | | | 4 | | | |
| | | | | 3 | | | | 4 |
| | 3 | 1 | 8 | | | | 9 | |

సుడోకు - 233 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 6 | 9 | 4 | 5 | 1 | 8 | 7 | 3 |
| 4 | 3 | 8 | 7 | 9 | 6 | 2 | 1 | 5 |
| 7 | 1 | 5 | 2 | 3 | 8 | 9 | 4 | 6 |
| 3 | 9 | 1 | 5 | 2 | 7 | 6 | 8 | 4 |
| 5 | 7 | 6 | 8 | 4 | 3 | 1 | 2 | 9 |
| 8 | 4 | 2 | 6 | 1 | 9 | 3 | 5 | 7 |
| 9 | 8 | 3 | 1 | 7 | 5 | 4 | 6 | 2 |
| 1 | 5 | 4 | 9 | 6 | 2 | 7 | 3 | 8 |
| 6 | 2 | 7 | 3 | 8 | 4 | 5 | 9 | 1 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.